


సుబ్రహ్మణ్యానికి జారీ చేసిన సదరమ్ సర్టిఫికెట్

- భారీగా దివ్యాంగ పింఛన్ దొంగలు
- అడ్డగోలుగా నకిలీ వైకల్య ధ్రువపత్రాలు
- వైసీపీ హయాంలో ఇష్టారీతిన జారీ
- ప్రభుత్వం నుంచి అనర్హులకు లబ్ధి
- మార్కాపురం డివిజన్‌లో వందల్లోనే ఉన్నట్లు సమాచారం
- అధికారులు దృష్టిపెడితేనే అడ్డుకట్ట

సధరమ్

డబ్బు కొట్టు.. సర్టిఫికెట్ పట్టు..!



మార్కాపురం డివిజన్‌లో దొంగ వైకల్య సర్టిఫికెట్ల దందా యథేచ్ఛగా నడిచింది. గత ప్రభుత్వంలో వైసీపీ నేతల అండదండలతో ఆ పార్టీ సానుభూతిపరులు, కార్యకర్తలు అక్రమాలలో ఆరితేరిపోయారు. వైకల్యం లేకపోయినా ఉన్నట్లు ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కొందరు వైద్యులు కూడా అవినీతికి అలవాటు పడి విచ్చలవిడిగా జారీచేశారు. ఆ సర్టిఫికెట్లతో దివ్యాంగ పింఛన్‌ను తీసుకుంటూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఈ అక్రమాలను వేగవంతంగా వెలికితీయాల్సిన అవసరం ఉంది.

మార్కాపురం, ఆగస్టు 20 : గత వైసీపీ పాలన సమయంలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తలు అనుచిత లబ్ధి పొందారు. వైకల్యం ఉన్నా లేకపోయినా, ఇష్టారీతిగా సదరమ్ సర్టిఫికెట్లు పొందారు. వాటిని అడ్డుపెట్టుకుని దివ్యాంగ పింఛన్‌ను అప్పనంగా కొట్టేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పెంచిన పింఛన్‌ను కూడా ఆరగించేస్తున్నారు. మార్కాపురం నియోజకవర్గం పరిధిలో గత ఐదేళ్లలో ఈ విధంగా వందలాది మంది దొంగ సర్టిఫికెట్లు పొంది రూ.లక్షల్లో ప్రజాధనాన్ని బొక్కేశారు. మార్కాపురం పట్టణంలో ఒక వైసీపీ కార్యకర్త దొంగ సర్టిఫికెట్‌తో అక్రమంగా పింఛన్ పొందుతున్నట్లు ఓ టీడీపీ కార్యకర్త ఆధారాలతో ఫిర్యాదుచేసినా పట్టించుకున్న నాథుడే లేడు. చివరికి కోర్టుకు వెళ్లి పోరాడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అనర్హులైన వారిని గుర్తించే పని కూటమి నాయకులు మొదలుపెట్టారు.

ఒక్కో దానికి గరిష్టంగా రూ.50 వేలు...

మార్కాపురంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి గతంలో జిల్లా వైద్యశాలగా ఉండేది. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో జిల్లా వైద్యశాలలో ఆ పార్టీ నాయకులు చెప్పిందే వేదంగా కొందరు వైద్యులు పనిచేశారు. ముఖ్యంగా వికలత్వ సర్టిఫికెట్‌కు స్థాయిని బట్టి రూ.30వేల నుంచి రూ. 50వేల వరకు వసూలు చేసినట్లు తెలిసింది. ఈ అక్రమ వ్యవహారానికి వైద్యశాలలో ఒప్పంద పద్ధతిపై పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న ఓ వ్యక్తి చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. పేరుకు పారిశుధ్య కార్మికుడే అయినా ఆయన సూపరింటెండెంట్ వద్ద అనధికారికంగా సహాయకునిగా పనిచేస్తుండేవాడు. వైద్యులతో ఉన్న చనువును ఆసరా చేసుకొని ఎలాంటి వికలత్వం లేకపోయినా రూ.వేలల్లో వసూలు చేసి క్షణాల్లో సర్టిఫికెట్లు జారీ చేయించాడు. వాటిని అడ్డుపెట్టుకునే వందలాది మంది వైసీపీ సానుభూతిపరులు, కార్యకర్తలు పింఛన్లు పొంది ప్రజాధనాన్ని కొట్టేశారు. చివరకు ఆ ఒప్పంద ఉద్యోగి కూడా శాశ్వత వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్ పొంది ప్రభుత్వం నుంచి పింఛన్ పొందడం గమనార్హం. దొంగ సర్టిఫికెట్లతో ఇంత స్థాయిలో ప్రజాధనం లూటీ అవుతున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేకపోవడం గమనార్హం.

పక్క చిత్రంలోని సర్టిఫికెట్ మక్కల సుబ్రహ్మణ్యానికి చెందినది. ఈయనకు 62శాతం వైకల్యం ఉన్నట్లు 2022 జూలై 19న మార్కాపురం జిల్లా వైద్యశాలకు చెందిన వైద్యులు ధ్రువీకరణపత్రం జారీ చేశారు. రెండు తొంటి ఎముకలు సరిగా లేనట్లు వైద్యులు నిర్ధారించారు. ఈయన 2016 నుంచి పారిశుధ్య కార్మికుడిగా మార్కాపురం జిల్లా వైద్యశాలలోనే పనిచేస్తున్నాడు. వైసీపీ ముఖ్య నాయకుడి అండదండలతో ఈయన సూపరింటెండెంట్ వద్ద అనధికార వ్యక్తిగత సహాయకునిగా పనిచేస్తున్నాడు. ఎలాంటి వైకల్యం లేకపోయినా ఇట్టే దొంగ సర్టిఫికెట్ పొందాడు. ఇంకేముంది ఆ మరుసటి నెలలోనే ఐడీ నెంబర్ 08122840170000039 ద్వారా దివ్యాంగ పింఛన్ పొందాడు. రెండేళ్ల నుంచి ఠంఛన్‌గా తీసుకుంటున్నాడు. కూటమి ప్రభుత్వంలో పెంచిన పింఛన్‌ను కూడా తీసుకుంటున్నాడు.



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల నుంచి అధికారులకు

పక్క చిత్రంలోని దివ్యాంగ సర్టిఫికెట్ జమ్ములదిన్నె నాగిరెడ్డిది. ఈయనకు మార్కాపురం జిల్లా వైద్యశాలలోని సదరమ్ కేంద్రం 2020 డిసెంబర్‌లో పోలియోతో 46శాతం వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరించి పత్రం జారీచేసింది. 2021 నుంచి ఐడీ నెంబర్ 108810002 ద్వారా ఇతను ప్రభుత్వం నుంచి దివ్యాంగ పింఛన్ పొందుతున్నాడు. వృత్తిరీత్యా టైలర్. రెండు కాళ్లతో తొక్కితేనే మిషన్ కుట్టగలిగేది. టైలర్స్ అసోసియేషన్ నాయకుడు కావడం, దశాబ్దకాలంపైగా వైసీపీలో క్రియాశీలకంగా పనిచేస్తుండటంతో ఆ పార్టీ ముఖ్య నాయకుల ఒత్తిడితో వైద్యులు ఈ ధ్రువీకరణపత్రం ఇచ్చారు. ఎలా ఇచ్చారంటూ పట్టణానికి చెందిన ఓ టీడీపీ కార్యకర్త అప్పట్లోనే ఆధారాలతో అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఎవరూ పట్టించుకోలేదు.

ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాథుడే లేడు

అక్రమ పింఛన్లపై ఇప్పటికే కొన్ని వందల ఫిర్యాదులు అందాయి. అన్ని ఆధారాలతో సహా ఫిర్యాదులు చేసినా యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ప్రధానంగా గత వైసీపీ ప్రభుత్వంలో అంటకాగిన అధికారులే నేటికీ కీలక పోస్టుల్లో ఉండటంతో ఫిర్యాదులన్నీ బుట్టదాఖలవుతున్నాయి. మరీ ముఖ్యంగా మండలస్థాయిలో పింఛన్ల బాధ్యత చూడాల్సింది మండల పరిషత్తు అధికారులే. వారికి ఫిర్యాదులు అందింతే ఇవి తాము మంజూరు చేసిన సర్టిఫికెట్లు కావు కాబట్టి రెవెన్యూ, మెడికల్ డిపార్ట్‌మెంట్లకు ఫిర్యాదులు చేసుకోవాలని తప్పించుకుంటున్నారు. మెడికల్, రెవెన్యూ శాఖల దగ్గరకెళ్తే తమకేం సంబంధం లేదని తెగేసి చెబుతున్నారు. వాస్తవానికి పింఛన్లు అందించే మండల పరిషత్తు అధికారులే ఫిర్యాదులు స్వీకరించి వారికి సమర్పించిన సర్టిఫికెట్లు సరైనవో, కావో విచారణ చేయాల్సిన బాధ్యత ఉంది. పట్టణ స్థాయిలో అయితే మున్సిపాలిటీది ఆ బాధ్యత. కానీ అధికారుల బదిలీలు లేకపోవడంతో గత ప్రభుత్వం నుంచి కొనసాగుతున్న అధికారులు కావడంతో ఫిర్యాదులను పట్టించుకోవడం లేదు.

అక్రమాలపై దృష్టిసారించిన కూటమి నాయకులు

నియోజకవర్గంలో దొంగ సర్టిఫికెట్లతో దివ్యాంగ పింఛన్ పొందుతున్న వ్యవహారంపై కూటమి నాయకులు దృష్టిసారించారు. పట్టణంలో ఇప్పటికే వార్డుల వారీగా దివ్యాంగ పింఛన్ పొందుతున్న వారి వివరాలు సేకరించి విచారిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన పింఛన్లపైనే ఎక్కువగా దృష్టిసారించారు. చిన్నపాటి వైకల్యం ఉన్నా శాశ్వత అంగవైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్‌లు పొందిన వాళ్లు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆధారాలతో సహా అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

సదరమ్ కేంద్రం నుంచి సక్రమంగానే పరీక్షలు చేస్తున్నాం

- డాక్టర్ పి.సావిత్రి, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి

మార్కాపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నుంచి సక్రమంగానే సదరమ్ కేంద్రాలు నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా ప్రతి విభాగానికి అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు అందుబాటులో ఉన్నారు. అన్నివిధాలా పరీక్షించాకే సర్టిఫికెట్లు మంజూరు చేస్తున్నారు. గతంలో ఏమి జరిగిందో తెలియదు. జిల్లా వైద్యశాలగా ఉన్నప్పుడు పలు ఆరోపణలు వచ్చాయి. ఈ మధ్యనే కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆ ఫిర్యాదుల విషయమై మాతో మాట్లాడారు.

కొనసాగుతున్న టీచర్ల పని సర్దుబాటు



ఒంగోలులో మొదటిదశ పూర్తి

ఒంగోలు(విద్య), ఆగస్టు 20 : జిల్లాలో ఉపాధ్యాయుల పని సర్దుబాటు మొదటిదశ ప్రక్రియ కొనసాగుతోంది. వాస్తవానికి ఈ ప్రక్రియ సోమవారమే ప్రారంభమైంది. టీచర్ల సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలు రావడంతో మొదటి రోజు 30 మండలాల్లో సర్దుబాటు ప్రక్రియ నిలిచిపోయింది. కేవలం ఎనిమిది మండలాల్లో మాత్రమే పూర్తయింది. రెండో విడత ఈనెల 18, 19 తేదీల్లో విడుదల చేసిన జాబితాలపై అభ్యంతరాలు తెలుపుకునేందుకు అవకాశం ఇచ్చారు. దీంతో 30 మండలాల నుంచి మిగులు టీచర్ల జాబితాలపై అభ్యంతరాలు రావడంతో ఆ మండలాల్లో సర్దుబాటు కౌన్సెలింగ్‌ను నిలిపివేశారు. ఈ మండలాల నుంచి 54 అభ్యంతరాలు రావడంతో గుంటూరు ఆర్‌జేడీ ద్వారా వాటిని పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయానికి పంపించారు. ఆ అభ్యంతరాల్లో కొన్నింటికి పరిష్కారం లభించడంతో 30 మండలాల్లో మొదటి దశలో చేపట్టిన స్కూలు అసిస్టెంట్ల సర్దుబాటు కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. మొదటగా మిగులుగా తేలిన సబ్జెక్టు టీచర్లు తాము పనిచేస్తున్న యాజమాన్యాల్లోని పాఠశాలలకు సర్దుబాటు చేశారు. ఆ తర్వాత ఇతర యాజమాన్యాల్లో మిగిలిపోయిన ఖాళీలకు ఆయా టీచర్లను సర్దుబాటు చేశారు.

ఒంగోలులో పూర్తి

ఒంగోలు నగరం, ఒంగోలు రూరల్ మండలం పరిధిలోని టీచర్ల సర్దుబాటు మొదటిదశ పూర్తయినట్లు ఎంఈవో టి.కిషోర్‌బాబు తెలిపారు. మండలంలో 48 మంది టీచర్లు మిగులుగా తేలగా 34మందిని సర్దుబాటు చేశారు. 14 మంది ఎస్‌జీటీలు ఇప్పటికి మిగులుగా ఉన్నారు. రెండు ఇంగ్లీషు, ఒక హిందీ పోస్టు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులకు డివిజన్ స్థాయి కౌన్సెలింగ్‌లో ఇతర మండలాల్లో అర్హులైన టీచర్లతో భర్తీచేస్తారని కిషోర్‌బాబు తెలిపారు.

పంచాయతీలకు ఊరట


జిల్లాకు రూ.70కోట్లు ఆర్థికసంఘం నిధులు

నెలాఖరులోపు అకౌంట్లకు జమయ్యే అవకాశం

ఒంగోలు(కలెక్టరేట్),ఆగస్టు 20: గ్రామ పంచాయతీలకు ఎట్టకేలకు ఊరట లభించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి విడత 15వ ఆర్థిక సంఘం నిధులు జిల్లాకు రూ.70కోట్ల వరకు వచ్చే అవకాశం ఉంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కేంద్రప్రభుత్వం ఇచ్చే ఆర్థికసంఘం నిధులను విద్యుత్ బకాయిలు, ఇతర అవసరాల కోసం దుర్వినియోగం చేయడంతో గ్రామ పంచాయతీలు నిర్వీర్యమయ్యాయి. ఫాగింగ్ చేసేందుకు కూడా నిధులు లేక కునారిల్లుతున్న సమయంలో రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టిపెట్టింది. పలు పర్యాయాలు కేంద్రప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి ఆర్థికసంఘం నిధులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి వచ్చిన ఆర్థికసంఘం నిధులను మంగళవారం రాష్ట్రప్రభుత్వం పంచాయతీలకు కేటాయించింది. ఆ నిధులు ఈ నెలాఖరులోపు జమ కానున్నాయి. ఈ నిధుల ద్వారా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణతోపాటు అత్యవసరమైన పనులు చేపట్టేందుకు అవకాశం వచ్చింది.


నలుగురు ఎస్‌ఐలకు పోస్టింగ్‌లు

ఇద్దరు వీఆర్‌కు.. ఉత్తర్వులు జారీ చేసిన ఎస్పీ



ఒంగోలు(క్రైం), ఆగస్టు 20 : జిల్లాలో నలుగురు ఎస్‌ఐలకు పోస్టింగ్‌లు ఇచ్చి, ఇరువురిని వీఆర్‌కు పిలిచారు. ఈమేరకు మంగళవారం ఎస్పీ ఏఆర్ దామోదర్ ఉత్తర్వులు జారీచేశారు. కురిచేడులో పనిచేసిన బీ శ్రీకాంత్‌ను నాగులుప్పలపాడుకు బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న బి.బ్రహ్మనాయుడును వీఆర్‌కు పిలిచారు. ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న వీ మహేష్‌ను దోర్నాల ఎస్‌ఐగా నియమించారు. ఇతర జిల్లా నుంచి వచ్చిన బీ సుదర్శన్‌యాదవ్‌ను అర్ధవీడుకు బదిలీ చేస్తు అక్కడ పనిచేస్తున్న ఎం అనితను వీఆర్‌కు బదిలీ చేశారు. వెలిగండ్ల ఎస్‌ఐగా పనిచేస్తున్న ఎం శివను కురిచేడుకు బదిలీ చేశారు.

పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి



ఈనెల 23న అన్నిచోట్లా గ్రామసభలు నిర్వహణ

ఉపాధి హామీ నిధుల అనుసంధానంతో పనుల ఆమోదానికి చర్యలు

గత ఐదేళ్లుగా నిలిచిపోయిన అభివృద్ధి పనులకు శ్రీకారం

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 20 : గ్రామ పంచాయతీల్లో గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు నిలిచిపోయిన అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందుకోసం గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి ఉపాధి హామీ పథకం అనుసంధానంతో పనులను చేపట్టేందుకు అవసరమైన తీర్మానాలను చేసే విధంగా చర్యలు చేపట్టింది. జిల్లాలోని 730 గ్రామపంచాయతీల్లో అభివృద్ధితోపాటు గతంలో జరిగిన అనుసంధాన పనులను ప్రజలకు తెలిసే విధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ఆదేశించారు. తదనుగుణంగా జిల్లా వ్యాప్తంగా ఈనెల 23వ తేదీన పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.

వైసీపీ హయాంలో నిధులు ఇవ్వక...

ప్రధానంగా గత వైసీపీ ప్రభుత్వం నిధులు ఇవ్వక గ్రామాల్లో అభివృద్ధి నిలిచిపోయింది.దీంతో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వ గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను రూపొందించేందుకు ఈ సభలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సభలలో ఆ పంచాయతీ పరిధిలోని జనాభాలో కనీసం 30శాతం మంది పాల్గొనే విధంగా రెండు రోజుల ముందు విస్తృతంగా ప్రచారం చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గ్రామసభలో ఉపాధి హామీ పథకం అనుసంధానంతో చేపట్టాల్సిన పనులను ప్రజలతో చర్చించి ఆమోదించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు గత ప్రభుత్వంలో ఆ గ్రామపంచాయతీల్లో చేపట్టిన పనులను కూడా ఆ గ్రామసభల్లోనే ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అంతేగాక వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేసిన విధానాన్ని ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు కూటమి ప్రభుత్వంలో ఏ విధంగా అభివృద్ధి చేస్తామో తెలపాలని నిర్ణయించారు. మరోవైపు గ్రామ పంచాయతీలకు ఆదాయ వనరులను పెంచేందుకు తీసుకోవాల్సిన అంశాలపై కూడా ప్రభుత్వం దిశానిర్దేశం చేయడంతో అందుకు అనుగుణంగా గ్రామసభల్లో చర్చించనున్నారు. చెత్తసంపద కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేందుకు అవసరమైన ప్రణాళికలను కూడా ఈ గ్రామసభల్లో చర్చించనున్నారు. అందుకోసం పంచాయతీల వారీ తగిన ప్రణాళికలు రూపొందించేందుకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు.

దోమల నియంత్రణపై డ్రోన్ యుద్ధం

మురుగునీటి కాలువల్లో స్ప్రే చేసి లార్వా నిర్మూలన

పారిశుధ్య కార్మికుడు వెళ్లలేని తావుల్లోకి సైతం మందు పిచికారీ

ఇప్పటివరకు పంటలకే వాడకం

తొలిసారిగా ఒంగోలు నగరంలో అమలు

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 20 : పారిశుధ్యం మెరుగునకు టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పట్టణాలను పరిశుభ్రంగా ఉంచి, దోమల బెడదను పూర్తిస్థాయిలో తొలగించే ప్రక్రియను చేపట్టింది. ఈ మేరకు రెండు రోజులుగా ఒంగోలు నగరంలో మురుగుకుంటలు, ఖాళీస్థలాలు, అలాగే పోతురాజు కాలువ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికుడు వెళ్లలేని చోట్లకు సైతం డ్రోన్ల సహాయంతో స్ప్రేయింగ్ చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్ర పురపాలక శాఖ డైరెక్టర్ ఆదేశాలతో ఒంగోలులో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు పంట పొలాలకు డ్రోన్ల ద్వారా ఎబేట్ మందు పిచికారీ చేయగా, తొలిసారిగా, దోమల నియంత్రణకు ఈ చర్యలు చేపట్టారు. పోతురాజు కాలువ, గణపతినగర్, బిలాల్ నగర్, ఇతర శివారు కాలనీల్లో డ్రోన్ ద్వారా ఆయిల్ స్ప్రే చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. తద్వారా నిల్వ ఉన్న మురుగు నీటిలో లార్వా ఉత్పత్తి కాకుండా, క్షేత్రస్థాయిలోనే దోమలను నియంత్రించవచ్చని అధికారులు వెల్లడించారు. ఈ ప్రక్రియ మరో రెండు, మూడు రోజులు జరుగుతుందని అధికారులు తెలిపారు. కార్యక్రమాన్ని నగర కమిషనరు ఎం.జశ్వంత్‌రావు పర్యవేక్షించగా, శానిటరీ సూపర్‌వైజర్ పిచ్చయ్య పాల్గొన్నారు.





ఇస్లాంపేటలో పోతురాజు కాలువపై డ్రోన్ ద్వారా దోమల మందు పిచికారీని పరిశీలిస్తున్న సిబ్బంది(ఇన్‌సెట్లో) మందు చల్లుతున్న డ్రోన్

‘ఫ్రీహోల్డ్’పై ప్రత్యేక దృష్టి



సిబ్బందిని వివరాలు అడుగుతున్న కలెక్టర్ అన్సారియా

- కనిగిరిలో అక్రమంగా భూముల వివరాల నమోదుపై కలెక్టర్ ఆకస్మిక పరిశీలన
- భూరికార్డుల తనిఖీ
- పొలాల్లోకి దారి కల్పించాలని చింతలపాలెం గ్రామస్థుల వినతి



ఒంగోలులోని ఆర్టీసీ డిపో

ప్రయాణికుల గోడు..

పట్టించుకునే వారేరి?

వేధిస్తున్న మరుగుదొడ్ల సమస్య ● ఔట్‌పోస్టులో కనిపించని పోలీసులు

దుకాణాల్లో అధిక ధరలకు అమ్మకాలు ● ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో బోలెడన్ని సమస్యలు



డిపో ఆవరణలో అధ్వానంగా ఉన్న ఓపెన్ టాయిలెట్స్

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 20: ఒంగోలు ఆర్టీసి బస్టాండ్‌లో సమస్యలు తిష్ట వేశాయి. ఇక్కడ నుంచి ప్రతి రోజు వివిధ ప్రాంతాలకు వేల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అందుకు అనుగుణంగా సౌకర్యాలు లేవు. మరుగుదొడ్లు పేరుకు మాత్రమే అన్నట్లు ఉండగా, వాటి బాగోగులు పట్టించుకు నాధుడే కరువయ్యాడు. దీంతో దుర్వాసన రావడంతో ప్రయాణికులు బస్టాండ్ ఆవరణంలో పట్టుపమని పది నిమిషాలు కూడా నిలబడలేని పరిస్థితి నెలంది. మరోవైపు మండుతున్న ఎండలకు కనీసం తాగునీటి సౌకర్యం లేక గొంతు తడుపుకునే పరిస్థితి లేదు. దీంతో కనీస సౌకర్యాలు లేకపోవడంపై ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు. ఇదిలా ఉంచితే ఆర్టీసీ ప్లాట్‌ఫాంల వద్ద ప్లాట్‌ఫాం నెంబరు, ఏ ఊరుకు వెళ్ళాలో తెలియజేసే బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉండగా, గతంలో ఉన్న వి ఊడిపోవడంతో ఏ ఊరు బస్సు ఎక్కడ ఆగుతుందో తెలియని పరిస్థితి ఉంది. ప్రయాణికులు సౌకర్యార్థం విశ్రాంతి గదులు లేవు, ప్రైవేటు వ్యక్తులు కొందరు ఆర్టీసీ ఆవరణంలో విశ్రాంతి గదులను ఏర్పాటు చేసి అద్దెకు కేటాయిస్తున్నారు. కాగా అధిక ధరలు వసూలు చేస్తుండటంతో భరించలేక ఉక్కపోతల మధ్య బస్టాండ్‌లో తాము ఎక్కాల్సిన బస్సుల కోసం పడిగాపులు కాస్తున్నారు. గడిచిన ఐదేళ్ళలో వైసీపీ ప్రభుత్వం ప్రయాణికులు సంక్షేమాన్ని పూర్తిగా గాలి కొదిలేయడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పేరుకే ఔట్‌పోస్టు..

ప్రతిరోజు వేల మంది ప్రయాణికులు రాకపోకలు సా



ఖాళీగా ఉన్న పోలీసు అవుట్‌పోస్టు

గే ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో దొంగతనాలు ఇటీవల అధికంగానే జరుగుతున్నాయి. అంతేగాకుండా జేబు దొంగలు, రాత్రి వేళ ఆకతాయిల అల్లర్లు, అసాంఘీక కార్యక్రమాలు పెరిగాయి. నిరంతరం పోలీసు గస్తీ నిర్వహించి అనుమానాస్పద వ్యక్తులను గుర్తించడంతోపాటు, ఎప్పటికప్పుడు మైక్ ద్వారా పోలీస్ హెచ్చరికలు చేయాల్సి ఉంది. అయితే అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. మొక్కుబడిగా మైక్ ఏర్పాటు చేసి ఉదయం ఆన్ చేయడం, సాయంత్రానికి ఆఫ్ చేయడం తప్ప నేరుగా పోలీసులు డ్యూటీలో ఉండి, డిపో ఆవరణంలో భద్రత చర్యలు పర్యవేక్షించడం కన్పించడం లేదు. ప్రయాణికులకు రక్షణ కల్పించాల్సిన పోలీసు ఔట్‌పోస్టు ఖాళీగా దర్శనమిస్తుంది. ఎన్నికల షెడ్యూలు విడుదలైనప్పటి నుంచి సుమారుగా నాలుగు నెలల నుంచి మొక్కుబడి సేవలు లభిస్తున్నాయి. దొంగతనాలు, అల్లరి మూకల ఆగడాలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఏది కొనాలన్నా..ధరల బాదుడే..

ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహించే వివిధ దుకాణాల్లో ప్రజల జేబులకు చిల్లు పడుతున్నాయి. ఏది కొనాలన్నా వ్యాపారులు అధిక ధరలకు విక్రయించడం ఇక్కడ బహిరంగ దోపిడీగా మారింది. అదేమని ప్రశ్నించిన ప్రయాణికులపై దుకాణదారులు దురుసుగా ప్రవర్తించడంతో ఇటీవల కాలంలో వ్యాపారులకు, ప్రయాణికుల మధ్య గొడవలు సర్వసాధారణమయ్యాయి. సాధారణంగా ఒక లీటర్ మంచినీటి బాటిల్ రూ.20 అమ్మాల్సి ఉండగా, ఇక్కడ మాత్రం రూ. 25లకు అమ్ముతారు. ఇక రూ.10 బిస్కెట్ ప్యాకెట్ రూ.15, జ్యూస్ రూ.60 , కూల్‌డ్రింక్‌లు ఒక్కో బాటిల్‌పై ఎమ్మార్పీ రేటు కన్నా అదనంగా రూ.10 వరకు డిమాండ్ చేసి మరీ వసూలు చేస్తున్నారు. ఇదిలా ఉంచితే కొన్ని నెలలుగా ఆర్టీసీలోని ప్రధాన క్యాంటీన్‌కు మరమ్మతుల చేస్తుం డటంతో మూతపడింది. దీంతో ఇతర వ్యాపారుల దోపి డీ మరింత పెరిగింది. అనిన వస్తువులు అధిక ధరలకు విక్ర



డిపోలో ఉన్న దుకాణాలు

యిస్తూ ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నా, ఆర్టీసీ అధికారులు మాత్రం కనీసం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆంధ్రకేసరి యూనివర్సిటీకి
ప్రత్యేక నిధులు కేటాయించాలి

● మంత్రి లోకేష్‌ను కోరిన ఎంపీ మాగుంట



మంత్రి లోకేష్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 20: ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్సిటీకి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి కోరారు. మంగళవారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఎంపీ మాగుంట మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గంలోని పలు సమస్యలతో పటు పెండింగ్‌లో ఉన్న పలు రకాల అభివృద్ధి పనులను మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. ప్రధానంగా ఆంధ్రకేసరి యూనివర్సిటీకి సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించి నిధులు కేటాయించి ఆదుకోవాలని ఆయన కోరారు.

క్విస్ కళాశాలకు ఉత్తమ అవార్డు



అవార్డును అందుకుంటున్న ప్రిన్సిపాల్ హనుమంతరావు

ఒంగోలు(విద్య), ఆగస్టు 20 : ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలకు జేఎన్‌టీయూకే ఉత్తమ ఇంజనీరింగ్ కళాశాల అవార్డును అందజేసింది. జేఎన్‌టీయూ కాకినాడలో ఆ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ అవారును క్విస్ ప్రిన్సిపాల్ వై.హనుమంతరావుకు ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.రామ్మోహన్ రావు, కాకినాడ సీపోర్టు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎం. మురళీధర్‌ల చేతుల మీదుగా మంగళవారం అందుకున్నారు. యూనివర్శిటీ అనుబంధంగా కళాశాలల్లో ఉత్తమ ప్రతిభ పనితీరు కనబర్చినందుకు క్విస్ ఇంజనీరింగ్ కళాశాలను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. 1998లో స్థాపించిన క్విస్ ఇంజనీరింగ్ కళాశాలకు ఉత్తమమైన ఎన్ఐఆర్ఎఫ్(200-300) ర్యాంకింగ్, న్యాక్ ఎ, ఎన్‌బీఏ గుర్తింపు తదితర ప్రమాణాలతో యూనివర్శిటీ అనుబంధ కళాశాలల్లో క్విస్ కళాశాల ప్రథమస్థానంలో నిలిచింది. యూనివర్శిటీ వీసీ మురళీకృష్ణ అభినందించారు. అవార్డును అందుకున్న ప్రిన్సిపాల్‌ను స్థానిక కళాశాలలో కరస్పాండెంట్ డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణచక్రవర్తి, వైస్‌చైర్మన్ డాక్టర్ ఎన్.శ్రీగాయత్రి మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు.

క్రికెట్ మ్యాచ్‌లో పోలీస్ ఆఫీసర్ టీం విజయం

● బహుమతులను అందజేసిన ఎస్పీ

ఒంగోలు(క్రైం), ఆగస్టు 20: పోలీస్‌శాఖలో ఉన్న వివిధ విభాగాలలో ఉన్న వారి మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లలో విజేతగా పోలీస్ ఆఫీసర్ జట్టు నిలిచింది. మొత్తం రెండు గ్రూపులలో ఎనిమిది జట్లు ఈ పోటీలో పాల్గొన్నాయి. ఏ గ్రూపులో స్వాట్‌టీమ్ జూనియర్స్, పోలీసు కార్యాలయం టీమ్, ఐటీకోర్‌టీమ్, పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్స్ జట్లు ఉన్నాయి. బి గ్రూపులో స్పెషల్ పార్టీ జూనియర్స్, స్పెషల్ పార్టీ సీనియర్స్, స్వాట్ టీమ్ సీనియర్స్, పోలీసు అధికారుల జట్లు ఉన్నాయి. కాగా ఫైనల్ మ్యాచ్ పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్స్, పోలీస్ ఆఫీసర్స్ జట్ల మధ్య జరిగింది. విజేతగా పోలీస్ ఆఫీసర్స్ జట్టు నిలిచింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును ఆర్ఎస్ఐ కె.మాల్యాద్రి అందుకున్నారు. పోటీలలో గెలుపొందిన వారికి ఎస్పీ ఏఆర్.దామోదర్ పతకాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఐటీకోర్ సీఐ సూర్యనారాయణ, ఆర్ఐ రమేష్‌కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వినయ్

నాగులుప్పలపాడు, ఆగస్టు 20 : హెచ్‌ఐవీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నిడమానూరు ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ బక్కమంతుల వినయ్ పేర్కొన్నారు. బాపట్ల జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి, మేదరమెట్ల హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీని నిర్మూలించేందుకు అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. ఇంటింటికి కరపత్రాల ద్వారా స్వచ్ఛంద సంస్థలు ప్రజలను చైతన్య పరచడం అభినందనీయమని చెప్పారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ టీఐటీవీ సాగర్ హెచ్‌ఐవీ సంక్రమించే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం అబ్దుల్‌కరీం, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సిబ్బంది మల్లేశ్వరి, దివ్య, ఎ.భార్గవ్, కె.కృష్ణవేణి, దుర్గ, రాధ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

పంటలను నమోదు చేయించుకోవాలి

● ఏవో విజయకుమార్

కొండపి, ఆగస్టు 20 : ఖరీఫ్ సీజన్‌లో రైతులు తాము వేసిన పంటల వివరాలతోపాటు ఆధార్ నంబరు, పొలం పాస్‌బుక్, ఫోన్ నంబరు తీసుకుని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఈ-పంట నమోదు చేయించుకోవాలని ఏవో విజయకుమార్ చెప్పారు. మండలంలోని పెట్లూరు గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. అనంతరం గ్రామంలో రైతులు వేసిన కంది పంట ఈ క్రాప్ నమోదును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు ఐ.పద్మ పాల్గొన్నారు.

అనుమతించిన మేరకే పంట సాగు చేయాలి

● పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 20: రానున్న పంట సీజన్‌కు పొగాకు బోర్డు అనుమతించిన మేరకే పంట సాగు చేయాలని బోర్డు చైర్మన్ సీహెచ్.యశ్వంత్‌కుమార్ సూచించారు. మంగళవారం ఒంగోలులోని పొగాకు వేలం కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అక్కడ జరుగుతున్న కొనుగోళ్ళ తీరును పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ ఈ ఏడాదివేలం ప్రారంభం నుంచి మంచిధరలు రావడం సంతోషంగా ఉందన్నారు. అంతర్జాతీయ డిమాండ్‌ను వివరిస్తూ రానున్న సీజన్‌లో ఎప్పటికప్పుడు పొగాకు బోర్డు సూచనలను పాటిస్తూ మంచి నాణ్యతతో పంట పండించి మంచి లాభాలు పొందాలన్నారు. వేలం నిర్వహణాధికారి ఎం.సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు బోర్డు అనుమతించిన విస్తీర్ణం, పరిమాణంలోనే పంట సాగు చేయాలని కోరారు. ప్రపంచ వ్యాప్తంగా పొగాకు వినియోగం తగ్గించడం వల్ల వీలైనంత వరకు రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో బోర్డు సభ్యుడు పొద వరప్రసాద్, బోడపాటి బ్రహ్మయ్య, రైతు నాయకులు సునీల్, వెంకట శేషయ్య రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ యశ్వంత్‌కుమార్

వైద్యురాలిని హత్యాచారం చేసిన నిందితులను శిక్షించాలి

● జనసేన పార్టీ డిమాండ్

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 20 : కోల్‌కతాలో వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడి దారుణంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మహిళా డాక్టర్ హత్యను నిరసిస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఒంగోలులో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు స్థానిక అద్దంకి బస్టాండులోని సుబ్బరామరెడ్డి విగ్రహం వద్దనుంచి అద్దంకి బస్టాండులోని ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ సభ్యసమాజం తలదించుకునే విధంగా క్రూరంగా మహిళా డాక్టర్‌పై అత్యాచారం చేసి దారుణంగా హత్య చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చనపతి రాంబాబు, ముత్యాల కళ్యాణ్, మహ్మద్ యూనిస్, పల్ల ప్రమీల, ఆర్‌కే.నాయుడు, దండే అనిల్, గోవింద్‌కోమలి, మదాసు సాయి, సుంకర కల్యాణి, షేక్ ముంతాజ్, వాసుకి నాయుడు, ప్రమీల, అనిత తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న జనసేన నాయకులు

రోడ్డు ప్రమాదంలో పాస్టర్ మృతి

● స్కూటీని ఢీకొన్న కారు

● మరొకరికి గాయాలు



వెంకటేశ్వర్లు మృతదేహం





ఘటనా స్థలంలో ఉన్న వాహనాలు

సంతనూతలపాడు, ఆగస్టు 20: కారు ఢీకొని పాస్టర్ మృతిచెందిన సంఘటన మంగళవారం ఎండ్లూరు డొంక వద్ద జరిగింది. ఎస్సై దేవకుమార్ తెలిపిన సమాచారం మేరకు.. మండలంలోని ఎండ్లూరుకు చెందిన అట్లూరి వెంకటేశ్వర్లు(41) పాస్టర్‌గా పని చేస్తున్నారు. చీమలమర్రిలో తన స్నేహితుని కుమార్తె ఎండ్లూరు మహిళా ప్రాంగణంలో కంప్యూటర్ కోర్సు నేర్చుకుంటోంది. ఈక్రమంలో తన స్నేహితుడు ఫోన్ చేసి తాను ఈరోజు రాలేనని, తన కూతురుని క్లాసు ముగియగానే తీసుకుని చీమలమర్రిలో వదలిపెట్టాలని వెంకటేశ్వర్లుకు తెలిపారు. ఈక్రమంలో ఆమెను తీసుకుని స్కూటీపై చీమలమర్రికి బయలుదేరేందుకు కర్నూల్‌రోడ్డుపైకి రాగా అదే సమయంలో ఎండ్లూరు వైపు నుంచి వస్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లుకు తీవ్రగాయాలు కావడంతో ఒంగోలు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. తన స్నేహితుని కుమార్తెకు గాయాలు కావడంతో ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. పోస్టుమార్టం నిమిత్తం పాస్టర్ మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. రిమ్స్ అవుట్‌పోస్టు నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవకుమార్ తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం కృషి

● డీఈవో సుభద్ర

సంతనూతలపాడు, ఆగస్టు 20: పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని, అందుకోసం ప్రతిష్టాత్మకంగా మధ్యాహ్నభోజన పథకాన్ని ప్రవేశపెట్టిందని డీఈవో డి. సుభద్ర పేర్కొన్నారు. మంగళవారం సంతనూతలపాడులోని జడ్పీహైస్కూల్‌ను ఆమె సందర్శించారు. రానున్న రోజుల్లో టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులను సమాయత్తం చేసేందుకు ప్రభుత్వం సీబీఎస్‌ఈ విధానంలో నిర్వహించనున్న బేస్‌లైన్ నమూనా టెస్టును ఆమె పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులను పలు ప్రశ్నలను సంధించగా వారు సైతం తగిన సమాధానం తెలపడంతో డీఈవో సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యం ఎంతో అవసరమని, పోషకాహారం తీసుకోవాలన్నారు. మధ్యాహ్నభోజన పథకంలో భాగంగా వండిన ఆహారాన్ని స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు ఇదేవిధంగా నాణ్యతగా ప్రతిరోజు అందించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



మధ్యాహ్నభోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో సుభద్ర

'మధుమేహం జబ్బుకాదు' పుస్తకం ఆవిష్కరణ

కొండపి, ఆగస్టు 20 : మధుమేహం జబ్బు కాదని, ఆహార, ఆరోగ్య నియమాలు పాటిస్తే ఎపుడూ అదుపులోనే ఉంటుందని దేవి హాస్పటల్ డాక్టర్ కంకణాల కృష్ణమోహన్ చెప్పారు. కొండపి గ్రామం పంచాయతీలోని కట్టావారిపాలేనికి చెందిన మన ఊరి వికాసం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో కృష్ణమోహన్ రాసిన 'మధుమేహం జబ్బుకాదు' అనే పుస్తకాన్ని మన ఊరి వికాసం సభ్యులు, పలువురు వైద్యులు ఆవిష్కరించారు. డాక్టర్ కొర్రపాటి సాధాకర్ మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని, చెట్లను పెంచాలని, ఇంటి ఆవరణలో రసాయనాలు వాడకుండా కూరగాయలు పండించుకుని వాడుకోవడం ద్వారా ఆరోగ్యం అందరికీ వస్తుందని అన్నారు. ఈసందర్భంగా గ్రామంలో ఉచితంగా వైద్యసేవలు అందిసున్న డాక్టర్ కృష్ణమోహన్‌ను సన్మానించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి రోగులకు మందులను అందించారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీవాణి, హర్షిత ఎన్ఆర్ఐ డాక్టర్ గుంటుపల్లి మదన్‌మోహన్, వికాసం సభ్యులు ఆరికట్ల రాఘవులు, రావెళ్ల చెంచురామయ్య, ఆరోగ్య సిబ్బంది నాగేశ్వరరావు, ఎం.నరసింహం పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్లు, మన ఊరి వికాసం సభ్యులు

అవీ.. ఇవీ..

షీప్ బ్రీడర్స్ యూనియన్‌కు త్రిసభ్యకమిటీ

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 20: జిల్లా షీప్ బ్రీడర్స్ కో ఆపరేటివ్ యూనియన్ కార్యకలాపాల నిర్వహణకు ప్రభుత్వం త్రిసభ్య కమిటీని నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి ఎంఎం.నాయక్ ఉత్తర్వులు జారీచేశారు. యూనియన్ చైర్మన్‌గా తోడేటి గోపి, సభ్యులుగా మొనపాటి రామకృష్ణ, నంబుల కొండయ్యలను నియమించారు. కమిటీ కాలపరిమితి ఆరు నెలలు లేదా పాలక వర్గ ఎన్నికలు నిర్వహించేంత వరకు ఈ రెండింటిలో ఏది ముందయితే దాని వరకు అమలులో ఉంటుంది. ఈ ఉత్తర్వులపై పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

ఘనంగా అంకమ్మతల్లి కొలుపులు

మద్దిపాడు, ఆగస్టు 20: ఘడియపూడి గ్రామంలో మంగళవారం అంకమ్మతల్లి కొలుపులు ఘనంగా జరిగాయి. రజక సంఘం ఆధ్వర్యంలో జరిగి ఈ వేడుకల్లో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రాత్రికి అమ్మవారికి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. బుధవారం పొంగళ్లు, అన్నదాన కార్యక్రమం ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

దోమ రహిత సమాజం కోసం పాటుపడదాం

● జిల్లా మలేరియా నివారణాధికారి మాధవీలత



మాట్లాడుతున్న మాధవీలత

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 20: దోమ రహితసమాజం, ఆరోగ్యానికి సోపానం అనే నినాదంతో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా మలేరియా నివారణాధికారి డాక్టర్ మాధవీలత పిలుపునిచ్చారు. ఒంగోలులోని వీఎస్ఆర్ పాఠశాలలో మంగళవారం దోమల నివారణ దినోత్సవం పురస్కరించుకుని ఆమె మాట్లాడారు. అనాఫిల్స్ ఆడదోమ ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుందన్నారు. దోమల వల్ల సంక్రమించే వ్యాధులు, వాటి నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా మాస్‌మీడియా అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ఫ్రైడే డ్రైడే తప్పక పాటించడం ద్వారా ప్రాథమిక స్థాయిలోనే మలేరియా, డెంగ్యూ, గున్యా, ఇతర వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉప మాస్‌మీడియాఅధికారి సరోజిని, సబ్‌యూనిట్ అధికారులు సాగర్, శ్రీనివాసులు, వెంకారెడ్డి, స్కూలు హెచ్ఎం కె.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 20: ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి గురువారం నుంచి మూడురోజుల పాటు జిల్లాలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొనున్నారు. గురువారం ఉదయం రెడ్‌క్రాస్ సొసైటీలో జరిగే చిరంజీవి యువత నిర్వహించే ఉచిత రక్తదాన శిబిరంలో పాల్గొంటారు. అనంతరం కలెక్టరేట్‌లోని జేసీ కార్యాలయంలో ఒంగోలు విమానాశ్రయ ఏర్పాట్లపై జరిగే సమావేశానికి హాజరవుతారు. శుక్రవారం గిద్దలూరులో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎంపీ మాగుంట ప్రమాణ స్వీకారం చేస్తారు.

నిత్యాన్నదానం అభినందనీయం



కేక్ కట్ చేస్తున్న గురవారెడ్డి

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 20: నిత్యం కొన్ని వందలమంది నిరుపేదలు, అనాథల ఆకలి తీరుస్తూ నిత్యాన్నదానం చేయటం అభినందనీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులు గోదా గురవారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తన జన్మదినం సందర్భంగా స్థానిక సంతపేట శివం ఫౌండేషన్ శరణాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పెసల మస్తాన్‌రావు, రావూరి సదానందరావు, పత్రా శివ, నేలపాటి ప్రసాద్‌బాబు, వీఎస్.బాబు, కె.సంపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నందిపాడుకు బస్సు సౌకర్యం కల్పించాలి

మద్దిపాడు, ఆగస్టు 20: నందిపాడు గ్రామానికి ఆర్టీసి బస్సు సౌకర్యం కల్పించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు కోడూరి లక్ష్మీనారాయణ, మారెళ్ల సురేంద్రబాబు, బోడెపూడి వెంకటసత్యనారాయణ, మన్నె శేషయ్య విజ్ఞప్తి చేశారు. మంగళవారం వారు ఒంగోలులో ఆర్టీసీ అధికారులను కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. నందిపాడు గ్రామానికి బస్సు సౌకర్యం లేక కళాశాలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నిత్యం ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుందని చెప్పారు. గ్రామానికి గతంలో ఉన్న ఉదయం, సాయంత్రం బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని వారు కోరారు. అదేవిధంగా బస్సు సర్వీసు లేక బసవన్నపాలెం, సీతారాంపురం, కోవివారిపాలెం గ్రామ ప్రజలు నాలుగు కిలోమీటర్లు నడిచిపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళులు

మద్దిపాడు, ఆగస్టు 20: దేశ సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీది అని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు నట్టే సుబ్బారావు పేర్కొన్నారు. మంగళవారం మద్దిపాడులోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతిని నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మారుతి, మహేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

24,25 తేదీల్లో ఐద్వా శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న రమాదేవి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 20 : అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా స్థాయి శిక్షణ తరగతులు ఈనెల 24,25వ తేదీల్లో ఒంగోలులో జరుగుతాయని ఐద్వా జిల్లాకార్యదర్శి కంకణాల రమాదేవి తెలిపారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం సమావేశంలో ఆమె మాట్లాడుతూ విదేశాల నుంచి దిగుమతి అవుతున్న విష సంస్కృతితో సమాజంలో మహిళలు, చిన్నారులపై అకృత్యాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు అనుసరిస్తున్న విధానాలతో కుటుంబ జీవనం చిన్నాభిన్నమవుతుందని, ఈ ప్రభావంతో అంతా మహిళల మీద పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మారుతున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యల పట్ల మహిళలకు అవగాహన కల్పించి ప్రజా ఉద్యమాలను బలోపేతం చేసేందుకు ఈ శిక్షణ తరగతులు దోహదపడుతాయన్నారు. మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల గోవిందమ్మ, ఆదిలక్ష్మి, కె.రాజేశ్వరి, జి.కళ్యాణిలు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు ఎస్ఐగా శ్రీకాంత్

నాగులుప్పలపాడు, ఆగస్టు 20: నాగులుప్పలపాడు ఎస్ఐగా బి.శ్రీకాంత్‌ను నియమిస్తూ ఎస్పీ ఏఆర్.దామోదర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న బ్రహ్మనాయుడును వీఆర్‌కు, కురిచేడులో పనిచేస్తున్న శ్రీకాంత్‌ను నాగులుప్పలపాడుకు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వరిగడ్డి వాములు దగ్ధం



కాలిపోతున్న వరిగడ్డి వాములు

నాగులుప్పలపాడు, ఆగస్టు 20: ప్రమాదవశాత్తు వరి గడ్డివాములు దగ్ధమైన సంఘటన ఈదుమూడిలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. ఈదుమూడి ఎస్సీకాలనీకి చెందిన నాయిపాము రవి, కనుమూరి తిరుపాలు, మొలతోటి రవికి చెందిన వరిగడ్డివాములు పక్క పక్కనే ఉన్నాయి. అయితే మంగళవారం మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా గడ్డివాములకు నిప్పంటుకొని మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.1.50లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు.

23న ఉపాధి పనుల గ్రామసభలు

మద్దిపాడు, ఆగస్టు 20: ఉపాధి హామీ పథకం పనులపై ఈ నెల 23న అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామని ఎంపీడీవో శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఏపీవో ధనుంజయవర్మ అధ్యక్షతన మంగళవారం స్థానిక మండల కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 23 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించాలని కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో టీఏ కిరణ్, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి

ఫ్రీహోల్డ్ నమోదుపై కలెక్టర్ ఆకస్మిక పరిశీలన

కనిగిరిలో భూరికార్డుల తనిఖీ

తమ పొలాల్లోకి దారి కల్పించాలని

చింతలపాలెం గ్రామస్థుల వినతి

కనిగిరి ఆగస్టు 20: ప్రభుత్వ భూముల ఆక్రమణలపై కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రత్యేక దృష్టి సారించారు. ఈక్రమంలో ఫ్రీహోల్డ్ నమోదు ప్రక్రియలో జరిగిన అవకతవకలపై జరుగుతున్న విచారణ నేపథ్యంలో మంగళవారం కనిగిరి ఆర్డీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా పరిశీలన చేశారు. గత ప్రభుత్వంలో అసైన్డ్ భూములు ఫ్రీహోల్డ్ కింద మార్పులు జరిగాయి. ఈక్రమంలో రాష్ట్రంలోనే కనిగిరి ప్రాంతంలో వేలాది ఎకరాలు ఫ్రీహోల్డ్‌గా నిబంధనలకు విరుద్ధంగా జరిగాయిని ఆరోపణలు వెలువెత్తాయి. దీంతో కలెక్టర్ దీనిపై ప్రత్యేక దృష్టి సారించిన క్రమంలో కనిగిరిలో భూరికార్డులను పరిశీలించారు. ఆన్‌లైన్‌లో జరిగిన నమోదును పరిశీలించారు. సంబంధిత భూ రికార్డులలోని వివరాలు, ఆన్‌లైన్ ప్రక్రియలో పొందుపరిచిన వివరాలను తనిఖీ చేశారు. తొలుత కాశిరెడ్డి కాలనీ వద్ద ఇటీవల ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను కలెక్టర్ పరిశీలించారు. పట్టణ సమీపంలోని శంఖవరం పరిధిలో గల 562/2, 3, 5 సర్వే నెంబరు భూమిని, అక్కడే సంబంధిత భూ రికార్డులను చూసి ఆయా భూమి యజమానులతో మాట్లాడారు. ఫ్రీహోల్డ్ భూమిని ఆన్‌లైన్ చేసే క్రమపద్ధతిలో భాగంగా ఫాం 17ను పూరించిన విధానంపై ఆర్డీవో జాన్‌ఇర్విన్‌ను అభినందించారు. ఫ్రీహోల్డ్ భూముల తిరస్కరణ, పరిగణన విధానంపై కలెక్టర్ ఆరా తీశారు. ఇంకా ఏమైనా భూముల నమోదులో జరిగిన అక్రమాలను తేల్చాలని ఆర్డీవోను ఆదేశించారు. అక్రమాలు రుజువైతే సంబంధిత సిబ్బంది, అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఫ్రీహోల్డ్‌లో జరిగిన భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై సబ్ రిజిస్ట్రార్‌ను విచారించారు. ప్రస్తుతం ఈ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిపివేసినట్టు చెప్పారు. ఈవిషయంపై అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.



శంఖవరం పరిధిలో భూమిని పరిశీలించి యజమానులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

పొలాలకు దారి కోసం వినతి

తమ పొలాల్లో రైల్వేలైన్ వేయటంతో పొలాలకు వెళ్ళే దారి లేకుండా పోయిందని పట్టణ సమీపంలోని చింతలపాలెం గ్రామానికి చెందిన రైతులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. రైల్వేలైన్ వేయటంతో పొలాల్లోంచి గ్రామానికి వచ్చే దారిలేకుండా పోయిందని తెలిపారు. పశువులకు గ్రాసం తెచ్చుకునే వీలు లేకుండా పోయిందని గ్రామస్థులు వాపోయారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి ప్రత్యేకంగా మీ గ్రామానికి వచ్చి పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జాయింట్‌కలెక్టర్ గోపాలకృష్ణ, ఆర్డీవో జాన్‌ఇర్విన్, తహసీల్దార్ అశోక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దబోల్కర్ సేవలు అనిర్వచనీయం



మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 20: హేతువాద ఉద్యమ స్ఫూర్తి, అంధ విశ్వాసాల నిర్మూలనకు కృషి చేసిన మహనీయుడు డాక్టర్ నరేంద్ర అచ్యుత్ దబోల్కర్ అని పలువురు పేర్కొన్నారు. హేతువాద సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో దబోల్కర్ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షులు నార్నె వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ మహారాష్ట్రకు చెందిన రచయిత దబోల్కర్ అంధ విశ్వాసాలకు వ్యతిరేకంగా ఉద్యమించారని తెలిపారు. మాంత్రిక శక్తులకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎంకే.బేగ్, జనవిజ్ఞాన వేదిక నాయకులు పుల్లారావు, పౌర సంఘం కన్వీనర్ గుమ్మాల నరసింహారావు, రైతు సంఘ నాయకులు చుంచు శేషయ్య, చుండూరి రంగారావు, ఉప్పుటూరి ప్రకాశరావు, నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, రవి, పేరయ్య, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

28న నందిపాడు సొసైటీ సమావేశం

మద్దిపాడు, ఆగస్టు 20: నందిపాడు సొసైటీ సమావేశం ఈ నెల 28వ తేదీ నిర్వహించనున్నట్లు సొసైటీ సీఈవో రామచంద్రారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్దిపాడులోని సొసైటీ కార్యాలయలో జరిగే సమావేశానికి సంబంధించిన రైతులందరూ తప్పకుండా హాజరుకావాలని ఆయన కోరారు.

నియోజకవర్గ అభివృద్ధిపై లోకేష్‌తో సత్య చర్చలు

కొండపి, ఆగస్టు 20 : టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య రాష్ట్ర విద్య, ఐటీ ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను మంగళవారం మధ్యాహ్నం ఉండవల్లిలోని మంత్రి నివాసంలో కలిశారు. ఈసందర్భంగా కొండపి నియోజకవర్గంలోని దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం కోసం, అదేవిధంగా అభివృద్ధి కార్యక్రమాల అమలుపై చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం పలు ప్రభుత్వ కార్యక్రమాలు చేపడతామని ఈసందర్భంగా సత్యకు లోకేష్ హామీ ఇచ్చారు.



మంత్రి లోకేష్‌తో సత్య

జొన్నల పంపిణీ



జొన్నలను తీసుకున్న రైతులు

టంగుటూరు, ఆగస్టు 20 : మండలంలోని ఎం.నిడమలూరు పశువైద్యశాలలో పశుగ్రాసానికి కావలసిన రైతుకు 3కేజీల జొన్నలను మంగళవారం పంపిణీ చేశారు. పశువైద్యాధికారి డాక్టర్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాకుమాని శ్రీకాంత్, టీడీపీ నాయకులు పి. స్వామినాథన్, గ్రామ జనసేన నేత మేళం శ్రీనివాస్, కాకుమాని రమణయ్య, తల్లపనేని మాధవ పాల్గొన్నారు.

విచ్చలవిడిగా ఎరువులు వాడొద్దు

కొండపి, ఆగస్టు 20 : భూసార ఫలితాల ఆధారంగా రైతులు పొలాల్లో ఎరువులు వాడుకోవాలని, విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు వాడొద్దని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి ఎ. శైలజారాణి సూచించారు. మంగళవారం వెన్నూరు, కె. ఉప్పలపాడు రైతు సేవాకేంద్రాలలో ఆత్మ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం, ఎరువుల వినియోగం రైతు శిక్షణ కార్యక్రమాలలో ఏవీ వి.వి.శేషమ్మ మాట్లాడుతూ అధికారుల సిఫారసు మేరకు ఎరువులు, పురుగు మందులు వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి డి.విజయకుమార్, ప్రకృతి వ్యవసాయం ఎంటీ ఎస్తేరు రాణి, సహాయకులు జె.కొండలరావు, డి.జయలక్ష్మమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శైలజ

50 కేజీల గంజాయి పట్టివేత

టంగుటూరు, ఆగస్టు 20 : టంగుటూరు సమీపంలోని టోల్‌గేట్ వద్ద పోలీసులు వలపన్ని సుమారు 50 కేజీల గంజాయిని పట్టుకున్నారు. కొరియర్ వాహనంలో విశాఖపట్నం నుంచి చెన్నై తరలిస్తున్న ఈ గంజాయిని ముందుగా అందిన సమాచారం మేరకు పోలీసులు టోల్‌గేట్ వద్ద మాటువేసి పట్టుకున్నారు. పట్టుకున్న గంజాయి వాహనాన్ని టంగుటూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీని విలువ లక్షల్లో ఉంటుందని భావిస్తున్నారు. గంజాయి లోడుతో ఉన్న వాహనాన్ని సీజ్ చేసిన పోలీసులు వాహనంలో ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయి పట్టుబడ్డ విషయం పోలీసులు ధ్రువీకరించలేదు. సింగరాయకొండ సీఐ హజరత్తయ్య టంగుటూరు పోలీస్‌స్టేషన్‌కు రావడం, కొరియర్ వాహనం స్టేషన్‌కు తరలించడంతో అనుమానాలు రేగాయి.



గంజాయి ఉన్న కొరియర్ వాహనం

అక్రమ మద్యం, ఇసుక, గంజాయిపై నిఘా

టంగుటూరు, ఆగస్టు 20 : అక్రమ మద్యం, ఇసుక, గ్రావెల్, పేకాట, గంజాయిలను కట్టడి చేస్తామని సింగరాయకొండ సీఐ హజరత్తయ్య చెప్పారు. మంగళవారం టంగుటూరు పోలీస్‌స్టేషన్ సందర్శనకు వచ్చిన సీఐ విలేకరులతో మాట్లాడారు. సర్కిల్ పరిధిలో అత్యంత దారుణంగా తయారైన శాంతిభద్రతలను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పేకాట శిబిరాలపై సమాచారం ఉందని, త్వరలో వీటిని అరికడతామని హెచ్చరించారు. కొన్నిప్రాంతాల్లో పోలీస్ సిబ్బంది నిస్తేజంగా ఉందని, త్వరలో పరిస్థితి సమీక్షించి పరిస్థితులను పూర్తి అదుపులోకి తీసుకొస్తామని చెప్పారు.



మాట్లాడుతున్న సీఐ, ఎస్సై

అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు

కొండపి, ఆగస్టు 20 : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు చేపడతామని సీఐ జి.సోమశేఖర్ హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొండపి, మర్రిపూడి, పొన్నలూరు మండలాల్లో పేకాట, కోడిపందేలు నిర్వహించే వారిపై రౌడీషీట్లు తెరుస్తామని హెచ్చరించారు. కొండపిలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. అసాంఘిక కార్యక్రమాల సమాచారాన్ని ఇస్తే చెప్పినవారి వివరాలు గోప్యంగా ఉంచి, నిందితులపై చర్యలు చేపడతామని చెప్పారు. కొండపి, మర్రిపూడి ఎస్సైలు ఒకటి రెండు రోజుల్లో విధుల్లో చేరతారన్నారు.



మాట్లాడుతున్న సీఐ

గర్భిణులకు సీమంతం



గర్భిణులకు సీమంతం చేస్తున్న డాక్టర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు

కొండపి, ఆగస్టు 20 : కొండపి పంచాయతీలోని కట్టావారిపాలెంలో మన ఊరి వికాసం స్వచ్ఛంద సంస్థ, అంగన్‌వాడీల ఆధ్వర్యంలో మంగళవారం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీవాణి గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. గైనకాలజిస్ట్ హర్షిత, అంగన్‌వాడీ కార్యకర్తలు సాయిలీల, అరుణ, నిర్మల, శేషమ్మ, ఆదిలక్ష్మి, మస్తానమ్మ, ప్రమీల, మన ఊరి వికాసం సభ్యులు బొక్కిసం సుబ్బారావు, రావెళ్ల ప్రసాద్, వీరమోసు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పేస్‌లో అవగాహన సదస్సు

ఒంగోలు(విద్య), ఆగస్టు 20: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో లీన్‌స్టార్టప్ అండ్ మినిమం వయబుల్ ప్రొడక్ట్/ బిజినెస్‌పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ గ్లోబల్ స్కూలు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.శరత్‌సింహ మాట్లాడుతూ ఒక చిన్న కంపెనీ ప్రారంభించడానికి కావాల్సిన నైపుణ్యాలు, నియమాలు, పద్ధతులను వివరించారు. కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా తామే స్వయంగా పరిశ్రమలు స్థాపించి పది మందికి ఉపాధి కల్పించాలన్నారు. కంపెనీ ఏర్పాటు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తుల వాటా మార్కెట్‌పై దృష్టి పెట్టాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, ట్రిపుల్‌ఈ విభాగాధిపతి బి.నాగరాజు, కో ఆర్డినేటర్ బి. వెంకటేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శరత్‌సింహ

భక్తిశ్రద్ధలతో మంగళగౌరీ వ్రతం

నాగులుప్పలపాడు, ఆగస్టు 20: చీర్వానుప్పలపాడులో వేంచేసి ఉన్న శ్రీఉమామహేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రావణమాస మంగళ గౌరీవ్రతం భక్తిశ్రద్ధతో నిర్వహించారు. పూజారి శివరామశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు, నైవేద్యాలను సమర్పించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు.



వ్రతంలో పాల్గొన్న మహిళలు

పోలీసు పహారాలో మండల సమావేశం

పెద్దారవీడు, ఆగస్టు 20: పెద్దారవీడు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం పోలీసు పహారాలో సాగింది. అయితే ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబులు హాజరుకానున్నారనే సమాచారంతో అధికారులు, వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులలో కొంత అలజడి ప్రారంభమైంది. దీంతో అప్రమత్తమై ఎంపీడీవో కార్యాలయం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. అయితే ఎరిక్షన్‌బాబుకు మంత్రి లోకేష్‌తో సమావేశం ఉండడంతో ఆయన అమరావతి వెళ్లారు. దీంతో సమావేశం ప్రశాంతంగా ముగిసింది.

కోల్‌కతా దురాగతంపై నిరసన గళం

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 20: కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన దురాగతంపై ఒంగోలులోని డొక్కా సీతమ్మ అన్నదాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి పెద్ద ఎత్తున నిరసన గళం వినిపించారు. స్థానిక కొత్తపేటలోని అన్నదాన కేంద్రం దగ్గర నుంచి నిర్వాహకులు జడా బాలనాగేంద్రం ఆధ్వర్యంలో సీవీఎన్ రీడింగ్ రూము దగ్గర ఉన్న పొట్టి శ్రీరాములు బొమ్మ వరకు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలనాగేంద్రం యాదవ్ మాట్లాడుతూ మహిళలను గౌరవించినప్పుడే దేశం బాగుంటుందని, వారి పట్ల అమానుషంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ మాట్లాడుతూ ఆడవాళ్లు అంటే ఆటవస్తువు కాదని, వారిపై అత్యాచారాలు, హత్యాచారం చేసే వారి మీద తక్షణమే కఠిన చర్యలు తీసుకునే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాళం నరసమ్మ, బీరం అరుణ, జనసేన నాయకురాలు రాయపాటి అరుణ, బీజేపీ మహిళా నాయకులు, పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పెండింగ్ బిల్లుల కోసం యత్నాలు

» గత వైసీపీ ప్రభుత్వంలో నిలిపివేత

» విజిలెన్స్ విచారణ పేరుతో కాలయాపన

» కూటమి రాకతో ఆశలు

దర్శి, ఆగస్టు 20: గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో చేసిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల కోసం నిర్వాహకులు తమ యత్నాలు ప్రారంభించారు. దర్శి నియోజకవర్గంలో కోట్లాది రూపాయల బిల్లులు నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలో బాగంగా టీడీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు చేసిన పనులకు సంబంధించిన బిల్లులను నిలిపివేసింది. విజిలెన్స్ విచారణ పేరుతో కాలయాపన చేసింది. అనేకమంది కోర్టులకు వెళ్లి ఉత్తర్వులు తెచ్చినా అరకొరగానే బిల్లులు చెల్లించారు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో బిల్లులు వస్తాయనే ఆశతో నిర్వాహకులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. దర్శి నియోజకవర్గంలో సుమారు రూ.80 కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు ఉన్నాయి. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఎన్ఆర్ఈజీఎస్ మ్యాచింగ్, పశుసంవర్ధకశాఖ, ఇరిగేషన్ తదితర శాఖలలో చేసిన అనేక పనులకు బిల్లులు చెల్లించలేదు. ఐదు సంవత్సరాలు పెట్టుబడులు పెట్టి చేసిన పనులకు బిల్లులు రాకపోవటంతో తీవ్రంగా నష్టపోయారు. అప్పులు తెచ్చి పనులు చేసిన నిర్వాహకులు ఎంతో ఇబ్బంది పడ్డారు. కొంతమందికి పార్టు బిల్లులు వచ్చాయి. మరికొంతమందికి సగం బిల్లు వచ్చాయి. మిగిలిన పెండింగ్ బిల్లుల కోసం ప్రస్తుతం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కొన్ని శాఖల్లో చేసిన పనులకు సంబంధించిన రికార్డులు ఎక్కడున్నాయో అర్థంకాక పలువురు నిర్వాహకులు డివిజనల్ కార్యాలయాలు, జిల్లా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

అస్తవ్యస్తంగా రికార్డులు : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రెవెన్యూ జిల్లా కేంద్రాలు మారటంతో రికార్డులు అస్తవ్యస్తంగా మారాయి. గత ప్రభుత్వంలో అధికారులు ఆ పనుల సంబంధించి రికార్డులు పట్టించుకోలేదు. ప్రస్తుతం పనులు చేసిన నిర్వాహకులు అధికారుల వద్దకు వెళ్లి సమాచారం తెలుసుకొని బిల్లుల కోసం ప్రయత్నిస్తున్నారు. కొంతమందికి పనులు పూర్తిగా చేసినప్పటికీ అప్పటి అధికారులు ప్రభుత్వం మారటంతో బిల్లులు చేయలేదు. అలాంటి పనులకు ఇప్పుడు బిల్లులు చేయాల్సిన అవసరం ఉంది. కూటమి ప్రభుత్వం పెండింగ్ బిల్లులపై ఇంకా నిర్దిష్టమైన ఆదేశాలు ఇవ్వలేదు. దీంతో ఎంబుక్ రికార్డు పెండింగ్ ఉన్న నిర్వాహకులు ఎంచేయాలో పాలుపోక అల్లాడుతున్నారు. టీడీపీ సానుభూతిపరులైన నాయకులు, కార్యకర్తల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని, వారుచేసిన పనులకు పూర్తిగా వడ్డీతో బిల్లులు చెల్లిస్తామని గతంలో సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈక్రమంలో పాత బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తుందనే ఆశతో నిర్వాహకులు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తమ ప్రయత్నాలు తీవ్రంగా చేస్తున్నారు.



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన మెగా గోకులం

తురకపాలెం గ్రామ సచివాలయానికి తాళం

అద్దె చెల్లించాలని యజమాని డిమాండ్ • 20 రోజుల వ్యవధిలో ఇది రెండోసారి • పట్టించుకోని అధికారులు

తాళ్లూరు, ఆగస్టు 20: మండలంలోని తురకపాలెం సచివాలయం భవనానికి అద్దె చెల్లించాలంటూ మంగళవారం యజమాని తాళం వేశారు. 20రోజుల్లో రెండు పర్యాయాలు తాళం వేసి సిబ్బంది విధులకు వెళ్లకుండా ఆటంకం కల్గించినా మండలస్థాయి అధికారులు చోద్యం చూస్తున్నారు. అద్దెకు ఉంటున్న సచివాలయానికి రూ.56 వేలు చెల్లించాలని మంగళవారం ఉదయం తాళం వేశారు. దీంతో సిబ్బంది సచివాలయంలోకి వెళ్లలేక నూతనంగా నిర్మించిన రైతు సేవాకేంద్ర భవనంలో తలదాల్చుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు అద్దె చెల్లిస్తామని ఎంత చెప్పినా వినకుండా, తమకు అద్దె చెల్లిస్తేనే తాళంతీస్తామని యజమాని పేర్కొన్నా రు. అప్పటివరకు సచివాలయ సిబ్బందిని లోనికి వెళ్లనీయబోమన్నారు. ఇదే విధంగా అద్దెచెల్లించలేదని గతనెల 31 సచివాలయానికి తాళం వేశారు.

అద్దెచెల్లిస్తామన్నా వైసీపీ నేతలు తాళం వేస్తున్నారు

- సీహెచ్.గురవారెడ్డి, సర్పంచ్

సచివాలయానికి చెల్లించాల్సిన బకాయి నెలలో చెల్లిస్తామనగా, ఇంటి యజమాని ఒప్పుకుని ప్రతిసారి తాళం వేస్తున్నారు. ఇంటి యజమాని, వైసీపీ నాయకులు పథకం ప్రకారం ఇలా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. మండల అధికారులు కూడా వైసీపీ నాయకులకే వంతపాడుతున్నారన్నారని సర్పంచ్ ఆరోపించారు. గ్రామప్రత్యేకాధికారుల పాలనలో బకాయి ఉంటే సర్పంచ్‌గా తాను చెల్లించాననిచెప్పారు. ఇప్పటికి ఐదుసార్లు తాళం వేయటం జరిగిందన్నారు. అయితే నూతన సచివాలయం ప్రారంభించినా బిల్లులు రాలేదంటూ ఓ వైసీపీ నాయకుడు సచివాలయ భవన తాళం ఇవ్వలేదని ఎంపీడీవో, ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై అనేకమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోక పోవటంతో సమస్య తీవ్రతరమవు తుందని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్స్ ప్రకాశం జిల్లా, ఒంగోలు మండలం, ఒంగోలు టౌన్, బండ్లమిట్ట నివాసులు ఐన **ఆకుల హనుమంతరావు** గారి వారసులు **ఆకుల ముంతాజ్, ఆకుల నూర్జహాన్, ఆకుల నాగూర్, ఆకుల ఖాదర్** అను వారు ఇచ్చిన సంజాయిషీ మేరకు, యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా.

షెడ్యూల్ దాఖలా ఆస్తులు మా క్లయింట్స్ యొక్క జాయింట్ కుటుంబ ఆస్తులు ఐ ఉన్నవి. సదరు షెడ్యూల్ దాఖలా ఆస్తులు వీరి తాతగారు ఐన **ఆకుల కోటయ్య** గారు కొనుగోలు చేసి ఆయన స్వాధీనములో ఉన్నవి, ఆయన ఇన్‌టేస్టేట్ గా మరణించినారు. ఆయన మరణానంతరం మా క్లయింట్స్ యొక్క తండ్రి గారు ఐన హనుమంతరావు గారు సదరు ఆస్తికి హక్కుదారులు ఐ ఉన్నారు. మా క్లయింట్స్ యొక్క తండ్రి గారు కూడా ఇన్‌టేస్టేట్ గా మరణించినారు. సదరు హనుమంతరావు గారికి ఇద్దరు భార్యలు, మొదటి భార్య సంతానం (లేట్) ప్రసాద రావు ఇతని కుమారులు బాలాజీ కుమార్, ఫణి కుమార్, భవాని కృష్ణ మరియు లేట్ రాము గారి కుమారులు హరీష్ బాబు, రాజశేఖర్ మరియు బత్తుల శ్రీనివాస రావు గారి భార్య రమ లక్ష్మి, మర్ర సుబ్బారావు గారి భార్య విజయ లక్ష్మి. కాగ మా క్లయింట్స్ హనుమంతరావు గారి రెండవ భార్య ఐన ఆకుల బీబీ గారి కి జన్మించిన సంతానం. కావున షెడ్యూల్ ఆస్తులు వీరి యొక్క జాయింట్ కుటుంబపు ఆస్తులు ఐ ఉన్నవి. సదరు ఆస్తి పై మా క్లాయింట్స్ తో పాటు పై వారికి కూడా సమాన హక్కులు కలవు.

కాగా సదరు హనుమంతరావు గారి మరణానంతరం ఆయన యొక్క ఇరువురి భార్యలు మరియు వారి సంతానం, లేట్ హనుమంతరావు గారికి రావలసిన బెనిఫిట్స్ సమంగా తీసుకున్నారు. షెడ్యూల్ దాఖలా ఆస్తి తప్ప. కావున షెడ్యూల్ దాఖలా ఆస్తులలో కూడా మా క్లయింట్స్ కి, మొదటి భార్య సంతానంతో సమానంగా హక్కులు ఉన్నవి. అనగా షెడ్యూల్ ఆస్తులలో సగం వాటా మా క్లయింట్స్ కి మరియు సగం వాటా పై వారికి చెందుతుంది.

కాగ మా క్లయింట్స్ కి ఈ మధ్య తెలిసిన విషయం ఏమనగా, మా క్లయింట్స్ యొక్క ప్రమేయం లేకుండా సదరు మొదటి భార్య సంతానం పెళ్ళూరు ఇలాక ఆస్తి లో కొంత భాగం కొంతమందికి అమ్మినట్లు తెలిసినది, కావున సదరు ఆస్తికి మా క్లయిట్స్ కూడా హక్కుదారులే, మా క్లయింట్స్ యొక్క అనుమతి లేకుండా సదరు రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు చెల్లవు, వారికి ఏ విధమైన హక్కు అధికారములు రావు, సదరు డాక్యుమెంట్లను మా క్లయింట్స్ రద్దు పరచబోవుచున్నారు. కావున ఎవరైనా సదరు షెడ్యూల్ ఆస్తికి సంబంధించి ఏ విధమైన వ్యవహారం చేయదలచినచో మా క్లయింట్స్ ని కూడా సంప్రదించవలెను, లేనియెడల వారికి ఎట్టి హక్కులు రావు, వారిపై మా క్లయింట్స్ క్రిమినల్ మరియు సివిల్ చర్యలు తీసుకోనబడును.

షెడ్యూల్: ఐటమ్ నెం.1 : ప్రకాశం జిల్లా, ఒంగోలు స.రి. యిలాకా, ఒంగోలు మున్సిపల్ కార్పోరేషన్, ఒంగోలు గ్రామ నెం.29 రు పట్టా దాఖలా సర్వే నెం. 170 రు సబ్ డివిజన్ కాబడిన దరిమిలా సర్వే నెం. 170/7 రులో య.0.38 సెంట్లు భూమికి **హద్దులు: తూర్పు:** జి.పోలయ్య & పుల్లారావు గార్ల ఆస్తి, **దక్షిణం :** 20 అ.లు వెడల్పు గల ప్రపోజ్డ్ మున్సిపల్ బజారు, **పడమర :** 40 అ.లు. వెడల్పు గల బజారు (దిబ్బలరోడ్డు), **ఉత్తరం :** పాలపల్లి లక్ష్మీ నారాయణ వగైరాల ఆస్తి. యీ హద్దులలోని య.0.38 సెంట్లు లేక **16552** చ.అ.లు. లేక **229** గదుల **64** చ.అ.లు. లేక **1839.1/9** చ.గ.లు. లేక **1544.85** చ.మీ.లు ఖాళీ స్థలము.

ఐటమ్ నెం.2 : ఒంగోలు సబ్ రిజిస్ట్రరు యిలాక - **పెళ్ళూరు** గ్రామంలో నెం. 29 రు పట్టాదాఖలా భూమికి **హద్దులు: తూర్పు:** పంటకాలువ, **దక్షిణం :** నలగర్ల అయ్యన్న వగైరాల భూమి, **పడమర :** రుద్రవరం రామగోపాలరావు వలన నీవు (ఆకుల కోటయ్య) విక్రయించుకొన్న భూమి, **ఉత్తరం :** మల్లవరపు సుబ్బారావు వలన పసుపులేటి చెంచయ్య విక్రయం భూమి. యీ హద్దులలో సర్వే నెం.**272/1,6,7** ర్ల భూమి య **4.92** ట్లలో నా తాలూకు మాగాణి, పై హద్దులలోని భూమి య 0.98 ట్లు హెచ్చు తగ్గులు సహా పై మొత్తమునకు విక్రయించడమైనది.

ఐటమ్ నెం.3: ఒంగోలు సబ్ రిజిష్టరు యిలాకా - **పెళ్ళూరు** గ్రామంలో పట్టా నెం.29రు దాఖలా సర్వే నెం.**272/1** రు **య 2.96** ట్లలో వుత్తర దక్షిణముల మాగాణి భూమి **య 1.00** ఒక్క యకరముకు **హద్దులు: తూర్పు :** రావూరి మీరాసాహెబ్ మాగాణీ భూమి కొంత వరకు, పసుపులేటి నరసయ్య చేవూరి రాఘవులు, రుద్రవరం వెంకటసుబ్బయ్య గార్ల మాగాణి భూమి, **దక్షిణం :** పంటకాలువ, **పడమర :** మద్దులూరి శ్రీరాములు వగైరాల మాగాణీ భూమి, **ఉత్తరం :** పంటకాలువ. యీ హద్దులలోని 5 కయలు యిందులోకి ఉత్తర, దక్షిణముల నుండి పారు పంటకాలువలో నీరు పెట్టుకొను హక్కున్నా భాగముల కొన్నవారైన చేవూరి రాఘవలు, పసుపులేటి నరసయ్య, రుద్రవరం వెంకటసుబ్బయ్య గార్ల పంపులకు యీ పంపుకు మధ్య యీ పంపుకు తూర్పున వీరి హద్దున తూర్పు, దక్షిణముల నీరు ప్రవహించుటకు భాగస్తులు యేర్పరుచుకొన్న కాలువ గుండా నీరు యిందులోనికి పారించుకొనే హక్కు సహా.

1) ఆకుల ముంతాజ్
2) ఆకుల నూర్జహాన్
3) ఆకుల నాగూర్ 4) ఆకుల ఖాదర్
సెల్: 99638 44748

ఇట్లు:ఐద్దిగం వెంకట రెడ్డి, అడ్వకేట్, రూమ్‌నెం.7, గోల్డెన్ టవర్స్, జిల్లా కోర్ట్ ఎదురు, ఒంగోలు. సెల్: 97030 21077


మూతపడిన ఆర్వో ప్లాంట్

ప్రజల దాహార్తి తీర్చని ఆర్వో ప్లాంట్

- జగ్గారెడ్డిపల్లెలో మూతపడిన నీటి శుద్ధికేంద్రం
- ప్రభుత్వ పాఠశాలల్లోనూ అదే పరిస్థితి

తర్లుపాడు, ఆగస్టు 19: మండలంలోని కలుజువ్వలపాడులో జంగంరెడ్డిపల్లి కాలనీలో మూడేళ్ల క్రితం రూ.12.20లక్షలతో ఆర్వో ప్లాంట్ నిర్మించి ప్రారంభించారు. జంగంరెడ్డిపల్లెలో ఫ్లోరిన్ నీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతుంటే శుద్ధిజలం అందించేందుకు అప్పటి ప్రభుత్వం ఆర్వోప్లాంట్ నిర్మించింది. కానీ ప్రారంభించిన నెలరోజుల మాత్రం ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందజేశారు. ఆ తర్వాత ఆర్వోప్లాంట్‌ను పంచాయతీకి అప్పగించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మూతపడింది. దీంతో పట్టించుకునే నాథుడే లేకపోవడంతో ఆ గ్రామ ప్రజలకు ఫ్లోరిన్ నీరే దిక్కయింది. పంచాయతీ అధికారులు మాత్రం ఆర్వోప్లాంట్‌ను మరిచారు. ఆ గ్రామంలో తీవ్ర మంచినీటి ఎద్దడి ఉంది. అప్పట్లో ఆర్వో ప్లాంట్‌కు ఒక డీప్ బోర్ ద్వారా కనెక్షన్ ఇచ్చారు. ఆ డీప్ బోరు ప్రస్తుతం అరకొరగా వస్తోంది. ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా ఆ గ్రామంలో నీరు అందిస్తున్నారు. కొందరు విధిలేని పరిస్థితుల్లో కలుజువ్వలపాడు నుంచి శుద్ధిజలం తెచ్చుకొని తాగుతున్నారు. గ్రామం లో ఆర్వో ప్లాంట్ ఉన్నప్పటికీ నిరుపయోగంగా ఉండటంతో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్ప డం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామంలోని ప్రజలు కోరుతున్నారు.

పెద్దదోర్నాల : విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్వో ప్లాంట్లు ప్రారంభించకుండానే మూలన పడ్డాయి .దీంతో విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు లక్షల రూపాయాల ప్రజాధనం వృథా అయ్యింది. నాడు-నేడు పథకంలో భాగంగా ప్రభుత్వం మొదటి విడతలో మండలంలోని 39 పాఠశాలలకు ఆర్వో ప్లాంట్లు మంజూరు చేసింది. కాంట్రాక్టు తీసుకున్న ఏజన్సీలు పాఠశాలలకు ప్లాంటుకు సంబంధించిన వస్తు సామగ్రిని తరలించారు. కాని నిర్వహణ బాధ్యతను వదిలేశారు. దీంతో ఐదేళ్లయినా, నేటికీ ఒక్కంటే ఒక్క ప్లాంటు వినియోగంలో లేదు. ప్రధానంగా అటవీ ప్రాంతంలోని ఆశ్రమ పాఠశాలల్లోని గిరిజన విద్యార్థులకు అత్యవసరం. కొండప్రాంతం, కాలువలు, వాగుల్లోని నీటిని తాగడం వల్ల రోగాలబారిన పడకుండా ఉండేందుకు రక్షిత మంచినీటి పథకాన్ని అమలు చేశారు. కాని ప్రారంభించడం మరిచారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు. విద్యార్థులు మాత్రం తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. పలువురు విద్యార్థులు ఇంటివద్ద నుంచే నీళ్లసీసాలను తీసుకువెళుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రధానోపాధ్యాయులు పలుమార్లు, ఉన్నతాధికారులకు చెప్పినా ఫలితం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగినచర్యలు చేపట్టాలని, విద్యార్థులకు మంచినీటిని అందించాలని తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు.


దోర్నాలలో వినియోగంలో లేని ప్లాంట్లు

పోలీసు పహారాలో మండల సమావేశం

పెద్దారవీడు, ఆగస్టు 20: పెద్దారవీడు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం పోలీసు పహారాలో సాగింది. మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి సంబంధించి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎంపీడీవో రాజ్‌కుమార్ ముందుస్తుగా సమాచారం ఇచ్చారు. ప్రజాప్రతినిధులలో భాగంగా ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబులు హాజరుకానున్నారనే సమాచారంతో అధికారులు, వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులలో కొంత అలజడి ప్రారంభమైంది. దీంతో సమావేశం వివరాలను ఎంపీడీవో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అప్రమత్తమైన పోలీసులు మంగళవారం ఉదయం నుంచి పెద్దారవీడు ఎంపీడీవో కార్యాలయం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. మార్కాపురం సీఐ ఆవుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్సైలు అనిల్‌కుమార్, వెంకట సైదులు, 20 మంది పోలీస్, స్పెషల్ బెటాలియన్ సిబ్బందితో భద్రతా చర్యలు చేపట్టారు. అయితే ఎరిక్షన్‌బాబుకు మంత్రి లోకేష్‌తో సమావేశం ఉండడంతో ఆయన అమరాతి వెళ్లారు. దీంతో సమావేశం ప్రశాంతంగానే ముగిసింది.

ప్రజాసమస్యలు పరిష్కరించాలి: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్

పెద్దారవీడు, ఆగస్టు 20: మండలంలో తాగునీటి, ఇతర ప్రజా సమస్యలు పరిష్కరించాలని, పలువరు ప్రజాప్రతినిధులు అధికారులను కోరారు. మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజాసమస్యల పరిష్కారం విషయంలో రాజకీయ జోక్యం ఉండకూడదన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ప్రజాప్రతినిధులందరినీ భాగస్వాములు చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. సమావేశానికి గైర్హాజరైన రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, తదితర శాఖల అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఇరిగేషన్ అధికారుల గైర్హాజరుపై ఈఈతో ఫోన్‌లో మాట్లాడారు. గిరిజనులకు ప్రత్యేకంగా ప్రభుత్వం విద్య, వైద్య, పౌష్టికాహార పథకాలను తప్పక అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సభ్యుడు జడ్పీటీసీ యేరువ చలమారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

పెద్దారవీడు ఎస్సైగా అనీల్‌కుమార్ బాధ్యతలు



పెద్దారవీడు, ఆగస్టు 20: పెద్దారవీడు ఎస్సైగా పి.అనీల్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తానన్నారు. ప్రజలకు పోలీస్‌శాఖపట్ల గౌరవం పెంపొందే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగితీగ చోరీ


ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

కంభం, ఆగస్టు 20 : మండలంలోని పెద్దనల్లకాల్వ గ్రామంలోని కృష్ణమందిరం సమీపంలో దుగ్గిపోగు సుగుణమ్మ పొలంలో దొంగలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి రాగితీగను, ఇతర సామగ్రి దొంగిలించారు. దొంగతనానికి తాడు, కర్ర, బెంచీలు వినియోగించినట్లు తెలిసింది. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నారు.

నగదు చెల్లించని కేసులో ఆరు నెలలు జైలు

పొదిలి, ఆగస్టు 20 : నగదు తీసుకొని చెల్లించని కేసులో కోర్టు ఆరు నెలలు జైలు శిక్ష విధించింది. వివరాల్లోకి వెళితే షేక్ ఖాశింసాహెబ్ అనే వ్యక్తి షేక్ రాములేటి జిలాని అనే అతనికి రెండు లక్షల రూపాయలు నగదు ఇచ్చాడు. తిరిగి చెల్లించకపోవడంతో 2017వ సంవత్సరంలో జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టులో ఎన్ఐ యాక్ట్ కింద కేసు వేశాడు. అప్పటి నుంచి వాదోపవాదాలు విన్న కోర్టు నేరం రుజువు కావడంతో మంగళవారం షేక్ రాములేటి జిలానికి ఆరు నెలలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి ప్రత్యూష తీర్పు ఇచ్చారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

- మంత్రి లోకేష్‌ను కోరిన ఎరిక్షన్‌బాబు


ఎరిక్షన్‌బాబును అభినందిస్తున్న లోకేష్

పుల్లలచెరువు, ఆగస్టు 20: నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కారంతో పాటు అభివృద్ధికి తోడ్పాటు అందించాలని విద్య, ఐటిశాఖ మంత్రి నారా లోకేష్‌ను వైపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబు కోరారు. మంగళవారం అమరావతిలోని ఉండవల్లిలోని మంత్రి నివాసంలో కలిసి నియోజకవర్గంలో సమస్యలు, చేపట్టాల్సి అభివృద్ధి పనులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయానికి వచ్చే రోడ్డుపై వున్న సాగర్ కాలువపై డబుల్ బ్రిడ్జి ఏర్పాటుకు సహకారం అందించాలని కోరారు. అదేవిధంగా దోర్నాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హాస్టల్ ఏర్పాటు చేయాలని కోరారు. నియోజకవర్గంలోని చెంచుగూడెంలో రోడ్లు మౌలిక వసతులకు నిధులు కేటాయించి చెంచుల అభివృద్ధిని తోడ్పాటు అందించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. అన్ని అంశాలకు మంత్రి సానుకూలంగా వున్నట్లు ఆయన తెలిపారు.

ఉద్యానశాఖ పథకాలపై రైతులకు అవగాహన

మార్కాపురం రూరల్, ఆగస్టు 20: ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని గ్రామాలలో రైతుసేవా కేంద్రం సిబ్బందికి సూచించారు. స్థానిక ఎస్సీ, బీసీ కాలనీలోని డ్వాక్రాబజార్‌లో మంగళవారం మార్కాపురం, తర్లుపాడు మండలాలకు సంబంధించిన రైతుసేవా కేంద్రాల సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంట సాగు చేసిన ప్రతి రైతుకు ఈ-పంట నమోదు వలన జరిగే ఉపయోగాలను వివరించాలన్నారు. ఉద్యానవనశాఖ ద్వారా రైతులకు అందించే రాయితీ పథకాలను వివరించాలని కోరారు. బిందు, తుంపర సేద్యం నుంచి ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం రాయితీ, ఓసీ, బీసీ రైతులకు 90 శాతం రాయితీతో పరికరాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మైక్రో ఇరిగేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఓబయ్య, మార్కాపురం, తర్లుపాడు మండలాల రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

హత్యాచార ఘటనకు నిరసనగా ర్యాలీలు


మార్కాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 20: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని జార్జ్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో స్త్రీలు, చిన్నారుల పట్ల అకృత్యాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. త్వరగా శిక్షించడం వలన ఇటువంటి ఘటనలు పునరావృతం కావన్నారు. మహిళను గౌరవించే విధంగా నడవడికలు నేర్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.రాజారావు, కెమిస్ట్రీ హెచ్‌వోడీ సునీత, సీఈవో డాక్టర్ అశోక్, అసోసియేట్ ప్రొఫెసర్లు ముజీఫ్, సురేష్ పాల్గొన్నారు.


తురిమెళ్లలో విద్యార్థినుల ర్యాలీ

కంభం : కలకత్తాలో వైద్య విద్యార్థిని పై జరిగిన హత్యాచారం ఘటనపై దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ తురిమెళ్ల ప్రభుత్వ కళాశాల విద్యార్థినులు తురిమెళ్ల గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సోని మాట్లాడుతూ వైద్య విద్యార్థినికి న్యాయం చేయాలన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. 'బతకనిద్దాం స్త్రీలను' అంటూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో శ్రీనివాసులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

కంభం : కలకత్తా మెడికల్ కళాశాల విద్యార్థినిపై జరిగిన ఘాతుకానికి నిరసనగా మంగళవారం కంభం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.శ్రీనివాసరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభల్లో ప్రజలను భాగస్వాములను చేయండి

డీఎల్‌డీవో సాయికుమార్


మాట్లాడుతున్న డీఎల్‌డీవో సాయికుమార్

మార్కాపురం రూరల్, ఆగస్టు 20: రాష్ట్ర వ్యాప్తగా ఈ నెల 23న నిర్వహించనున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామ సభలలో ప్రజలను భాగస్వాములను చేయాలని డీఎల్‌డీవో సాయికుమార్ సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామసభల నిర్వహణపై ఎంపీడీవో చందనతో కలిసి మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు 23న మార్కాపురం నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామ సభలను నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ గ్రామ సభలలో 2024-25 ఆర్థిక సంవత్సరాని ఇక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఆయా గ్రామాలలో నిర్వహించే పనుల ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టనున్న పనుల ప్రణాళికను గ్రామస్థులకు వివరించి వారి ఆమోదం కోరను న్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో నిర్వహించే సామాజిక తనిఖీపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రామ్మోహన్‌రెడ్డి, పంచాయతీరాజ్ మోహన్‌రాజు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గ్రామ స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 20 : ఒంగోలులో సోమవారం నిర్వహించిన జిల్లా అథ్లెటిక్స్ పోటీలలో అండర్-16లో 600మీటర్లు పరుగు పందెంలో స్థానిక గురుకుల పాఠశాల 7వ తరగతి విద్యార్థి శీలం సాంబశివరావు ప్రథమస్థానంలో నిలిచారు.. రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొనేందుకు జిల్లా నుంచి సాంబశివరావును ఎంపిక చేశారు. ఇదే పాఠశాలకు చెందిన మండ్లి చినఅంజయ్య అండర్-14 విభాగంలో 600 మీటర్లు పరుగుపందెం, లాంగ్‌జంప్, జావెలిన్‌తో తదితర మూడు ఈవెంట్లలో ప్రథమస్థానం సాధించడంతో విద్యార్థి అంజయ్య రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. విద్యార్థులు ఇరువురిని ప్రిన్సిపాల్ సలామ్‌ఖాన్, వైస్ ప్రిన్సిపల్ దయాకర్ పీఈటీ బ్రమ్మనాయక్, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు పశువైద్య శిబిరం

తర్లుపాడు, ఆగస్టు 20: మండలంలోని తాడివారిపల్లెలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. పశుగ్రామీణాభివృద్ధి సంస్థ, పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో పశువులకు గర్భకోశ వ్యాధులు, ఎదకు రాని పశువులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పశుపోషకులు ఉపయోగించుకోవాలన్నారు.

ఘనంగా బలరాముని జయంతి


హారతి ఇస్తున్న రాధామనోహర్‌దాస్

మార్కాపురం, ఆగస్టు 20: స్థానిక కళాశాల రోడ్డులోని శుభం కల్యాణ మండపంలో సోమవారం రాత్రి శ్రావణ పూర్ణిమను పురస్కరించుకుని బలరాముని జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. 'అభయ్ హిందూ సేన' ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా 'అభయ్ హిందూ సేన' వ్యవస్థాపకులు రాధామనోహర్‌దాస్ ధార్మిక ఉపన్యాసం చేశారు. అనంతరం పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పీటీసీ మాజీ సభ్యులు కందుల రామిరెడ్డి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత తంగిరాల నాగ జగన్నాథ్ లు హాజరయ్యారు. వారితో మహామంగళ హారతి నిర్వహించారు. వందల సంఖ్యలో హాజరైన హిందూ భక్తులు హరే కృష్ణ నామ సంకీర్తనతో కళ్యాణ మండపం మార్మోగింది. కార్యక్రమాలను ఇస్కాన్ ప్రతినిధి అమల్ నిమయ్, గాయం దశరథ రామిరెడ్డిలు పర్యవేక్షించారు. హిందూ సంఘం పెద్దలు, ఇస్కాన్ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


హాజరైన భక్తులు

ప్యాలెస్‌లో కూర్చుని తప్పుడు ట్వీట్లు పెట్టడం సిగ్గుచేటు

జగన్‌పై ధ్వజమెత్తిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి


మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరుటౌన్, ఆగస్టు 20 : ప్యాలెస్‌లో కూర్చుని మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి తప్పుడు ట్వీట్లు పెట్టడం సిగ్గుచేటని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ధ్వజమెత్తారు. జగన్మోహన్‌రెడ్డి హయాంలోనే రాష్ట్రచరిత్రలో జలవనరులశాఖ అత్యంత నిర్లక్ష్యానికి, విధ్వంసానికి గురైందన్నారు. ఇది పచ్చి నిజమని, దాస్తే దాగదు అని అన్నారు. వెలుగొండ ప్రాజెక్టుపై ట్విట్టర్‌లో జగన్ చేసిన ట్వీట్‌కు అశోక్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. వెలుగొండ ప్రాజెక్టు గురించి పులివెందుల ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతుంటే దెయ్యాల వేదాలు వల్లించినట్లు ఉందని ఆయన దుయ్యబట్టారు. ఫేక్ రాజకీయంతో లబ్ధిపొందాలనుకునే జగన్ దుర్మార్గపు ఆలోచనను ప్రజలు నమ్మరన్నారు. కేవలం 10, 20 శాతం పనులు మాత్రమే మిగిలి ఉన్న వెలి గొండ ప్రాజెక్టు పనులను గత ఐదేళ్లలో వైసీపీ పూర్తి చేయలేక పోయిందన్నారు. అలాంటి నీవు బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చుని ట్వీట్లు చేయడానికి సిగ్గు అని పించడం లేదా? అని జగన్ రెడ్డిని ప్రశ్నించారు. సలహాదారులకు, సాక్షి పత్రికకు, సర్వే రాళ్లపై బొమ్మలకు చేసిన దుబారా ఖర్చు తగ్గించుకొంటే వెలిగొండ పూర్త య్యేదన్నారు. సాగునీటి రంగానికి, రాష్ట్ర రైతాంగానికి జగన్ ఐదేళ్ల పాపపు పాలన శాపంగా మారిందన్నారు. ఈ సంగతి ఫేక్ రాజ కీయం చేసే అంతరాత్మలేని జగన్‌కు తప్ప రాష్ట్రంలోని ప్రతి వ్యక్తికి తెలుసన్నారు. తప్పుడు ప్రచారం ఎంతోకాలం రాజకీయాలు చేయలేరని జగన్మోహన్‌రెడ్డికి హితవు పలికారు.

బిందు సేద్యంతో అధిక దిగుబడులు

- నీరు ఆదా, శ్రమ ఖర్చు తక్కువ
- ప్రోత్సహించనున్న కూటమి ప్రభుత్వం

పెద్దదోర్నాల, ఆగస్టు 20: ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో తక్కువ నీటితో దిగుబడులు తీసేందుకు బిందు సేద్యం ఎంతగానో ఉపకరిస్తోంది. ఈ పద్ధతి వల్ల నీటిని ఆదా చేయడంతో పాటు అధిక ప్రయోజనాలు పొందవచ్చు. బిందు సేద్యం అనుసరిస్తున్న రైతులు మరి కొందరికి మార్గదర్శకులుగా మారారు. దీంతో పలువురు డ్రిప్ వినియోగంకోసం ప్రభుత్వ ప్రోత్సాహం కోసం ఎదురు చూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం రాయితీని రద్దు చేయడంతో రైతులు ఐదేళ్లు మిన్నుకుండిపోయారు. ప్రస్తుత నూతన ప్రభుత్వం మళ్లీ డ్రిప్ వినియోగానికి రాయితీకి అవకాశం ఇవ్వడంతో రైతులు ఆసక్తిగా దరఖాస్తు చస్తున్నారు. రైతులు ఇప్పటి వరకు ఉద్యాన పంటల్లో ఎక్కువగా డ్రిప్‌ను వినియోగిస్తున్నారు. అయితే బోరుబావుల్లో భూగర్భ జలాలు అడుగంటడంతో కొద్దిపాటి నీటితో పైర్లను బతికించుకునేందుకు డ్రిప్ పద్ధతి అనువుగా ఉంటండడంతో రైతులు డ్రిప్ వినియోగం వైపు మళ్లారు. మోటారుపంపు సెట్ల నుంచి నీరు నేరుగా గొట్టాల ద్వారా పంపించి చిన్న చిన్న పైపుల ద్వారా ప్రతి మొక్కదగ్గర నీటిని పడేటట్లు అమర్చాలి. ఈ డ్రిప్ ద్వారా గంటకు 2నుం 8లీటర్ల నీటిని మొక్కలకు అందిస్తారు. ఈ పద్ధతిలో ఎక్కువగా నేలపై పరికరాలు అమర్చే విధానాన్ని అవలంభిస్తున్నారు. జిల్లా పశ్చిమ ప్రాంతంలో వర్షాభావ పరిస్థితులు అధికం. బోర్లలో కొద్దిపాటి నీరొచ్చినా పంటలు పండించవచ్చని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యాన పంటలు బొప్పాయి, అరటి, జామ, దానిమ్మతో పాటు పత్తి, మిరప, కూరగాయలు, మల్బరీ, తదితర తోటల్లో డ్రిప్‌ను వినియోగిస్తున్నారు.

ప్రయోజనాలు అధికం

డ్రిప్‌పద్ధతి వల్ల సాగు చేసే పంటలకు ప్రత్యేకంగా నీటి తడులు ఇవ్వాలసిన అవసరం ఉండదు. నీరు ఎక్కువ, తక్కువ లేకుండా ప్రతి డ్రిపర్ దగ్గర సమానంగా మొక్కలకు నీరు అందుతుంది. కొలత ప్రకారం అందించవచ్చు. వినియోగించిన ప్రతి లీటరు నీటికి ఎక్కువ ఫలసాయం లభిస్తుంది. మామూలుగా ఎకరం సాగు చేసే నీటితో ఈ పద్ధతి ద్వారా హెక్టారుకు నీటిని అందించవచ్చు. ప్రధానంగా కలుపు మొక్కలను అదుపుచేయొచ్చు. విద్యుత్తు ఆదా కూడా అవుతుంది. రసాయనిక ఎరువులు డ్రిప్ ద్వారానే నీటితో పాటు అందించవచ్చు. తద్వారా ఎరువు ఖర్చు, తగ్గుతుంది. కూలీల శ్రమ కూడా ఆదా అవుతుంది. సాధారణంగా 100 కిలోలు ఎరువు అవసరమూతే డ్రిప్ ద్వారా 50 కిలోలు ఎరువు సరిపోతుంది.

మెళకువలు పాటించాలి

డ్రిప్ పద్ధతి అవలంబించే రైతులు కొద్దిపాటి మెళకువలు పాటిస్తే. ఎక్కువ కాలం పని చేస్తాయి. కాలువలు, చెరువుల్లో నుంచి వచ్చే నీటిలో సన్నని మట్టి, ఇసుక, రేణువులుంటాయి. కొన్ని ప్రాంతాల్లో నీటిలో లవణాలు అధికంగా ఉంటాయి. ఇవన్నీ డ్రిప్ పరికరాల్లో పేరుకుపోయి నీటి సరఫరాకు అవరోధం కలిగిస్తాయి. అందువల్ల ఫిల్టర్లను రైతులు శుభ్రం చేస్తుండాలి. నీటి ఎద్దడి రోజు రోజుకు పెరుగుతున్న క్రమంలో బిందు సేద్యం రైతులకు ఎంతగానో ఉపయోగిస్తుంది.


డ్రిప్ పద్ధతిలో మిరప సాగు

అవీ..ఇవీ..

ఉచిత పశుగర్భకోశ చికిత్స శిబిరం


మాట్లాడుతున్న పశుసంవర్థశాఖ ఏడీఏ యోగానంద ప్రసాద్

మార్కాపురం రూరల్, ఆగస్టు 20: మండలంలోని చింతకుంట్ల గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్థకశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ వారి సౌజన్యంతో ఉచిత పశుగర్భకోశ చికిత్స శిబిరం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకులు డాక్టర్ యోగానంద ప్రసాద్ మాట్లాడుతూ.. ఎదకురాని గేదెలను చూలుకట్టే విధంగా, దూడల సంరక్షణ రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. పశువులకు గాలికుంటు టీకాలు వేయించారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ డాక్టర్ రవికుమార్, మార్కాపురం సహాయ సంచాలకులు డాక్టర్ బాలునాయక్, కొడేపల్లి పశువైద్యాధికారి డాక్టర్ జి.లీనాగ్రేస్, గజ్జలకొండ పశువైద్యాధికారి డాక్టర్ అశోక్ కుమార్, తర్లుపాడు పశువైద్యాధికారి డాక్టర్ నందన, కలుజువ్వలపాడు పశువైద్యాధికారి డాక్టర్ సౌజన్య, పశుపోషకులు పాల్గొన్నారు.

మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 20: డివిజన్‌లోని విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలని డివిజన్‌లోని మీటర్ రీడర్లు విద్యుత్‌శాఖ కార్యాలయంలో జేఏఈకు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కాపురం డివిజన్‌లోని ప్రతి మీటర్ రీడర్‌కు 2 నెలల జీతం నేటి వరకు ఇవ్వలేదన్నారు. వెంటనే పెండింగ్ జీతాలు చెల్లించాలన్నారు. ఆరు నెలల నుంచి ఈపీఎఫ్ డబ్బులు ప్రతి మీటర్ రీడర్ నుంచి ఇంచుమించు రూ.500 నుంచి రూ.1500 వరకు నెలలో యూటీఎఫ్ డబ్బులు కట్టేటప్పుడు తగ్గించి కడుతున్నారన్నారు. అందరికీ కొత్త అరియర్స్ అమౌంట్ కలిపి ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. రెండు నెలల జీతంతో పాటు అరియర్స్ ఇప్పించాలని వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో షేక్ మహమ్మద్ హుస్సేన్ అన్వర్, సతీష్, సుబ్బు, బొప్పరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

గిద్దలూరు, ఆగస్టు 20 : రాచర్ల మండలం గుడిమెట్ట ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి చదువుతున్న ఎం.లక్ష్మీకల్యాణి అనే బాలిక మూడేళ్లగా బ్లడ్‌కేన్సర్‌తో బాధపడుతోంది. వ్యవసాయంపై కష్టపడి జీవించే బాలిక తల్లిదండ్రులకు చికిత్స కోసం లక్షలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి నెలకొనడంతో పాఠశాల హెచ్‌ఎం రాజగోపాల్‌రెడ్డి స్పందించారు. గిద్దలూరు, రాచర్ల మండలాల విద్యాశాఖాధికారుల ద్వారా ఉపాధ్యాయుల నుంచి సహాయం అర్థించారు. రాచర్ల విద్యాశాఖాధికారులు శివకోటేశ్వరరావు, గిరిధరశర్మలు ఉపాధ్యాయుల ద్వారా 67వేలు, అలాగే గిద్దలూరు మండల విద్యాశాఖాధికారులు జింకా వెంకటేశ్వర్లు, కె.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుల ద్వారా 62వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాలిక తల్లిదండ్రులైన రామకృష్ణారెడ్డి, పార్వతీలకు అందచేసి చిన్నారికి సకాలంలో వైద్యసేవలు అందించుకోవాలని సూచించారు.

మైక్‌సెట్ బహూకరణ

గిద్దలూరు, ఆగస్టు 20 : రాచర్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ సమావేశం మంగళవారం నిర్వహించారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు రూ.10వేలు, ఉపాధ్యాయులు కాశయ్య రూ.3వేలు, శ్రీధర్‌రావు వెయ్యి రూపాయలు సమకూర్చి మైక్‌సెట్‌ను స్కూల్ కాంప్లెక్స్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు శివకోటేశ్వరరావు, గిరిధరశర్మ, రిసోర్స్‌పర్సన్స్ వెంకటేశ్వర్లు, రాజగోపాల్, హెచ్‌ఎం రామానాయక్, తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా తరగతులు నిర్వహించాలని ఎంఈవోలు ఉపాధ్యాయులకు సూచించారు.

యుద్ధవీరులకు సన్మానం


యుద్ధవీరులను సన్మానిస్తున్న సబ్ ఏరియా మేజర్ జనరల్

గిద్దలూరు, ఆగస్టు 20 : కార్గిల్ యుద్ధం జరిగిన 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 42 మంది మాజీ సైనికులను ఆ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అలాగే 18 మంది వీర మహిళలను సైతం సన్మానించారు. యుద్ధంలో వారి పాత్రలను, వారు చూపిన ధైర్యసాహసాలను కొనియాడారు. గిద్దలూరులో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ-ఆంధ్ర సబ్ ఏరియా మేజర్ జనరల్ రాకేష్ మనోచా ముఖ్యఅతిథిగా పాల్గొని యుద్ధవితంతువులను, మాజీ సైనికులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బ్రిగేడియర్ వెంకటరెడ్డి, సైనిక సంక్షేమశాఖ సంచాలకులు కల్నల్ రామ్‌ప్రకాశ్, వెటరన్‌సెల్ కల్నల్ ఓంప్రకాశ్, జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి రజినికుమారి, మాజీ సైనిక ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

చిత్రకారులకు సన్మానం


చిత్రకారులను సన్మానిస్తున్న నిర్వాహకులు

కంభం, ఆగస్టు 20 : ప్రగతి ఆర్టిస్టు వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్ట్ క్యాంప్, ఎగ్జిబిషన్‌లో కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన 20 మంది కళాకారులను కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ ఆర్టిస్టుతో కళాశాల గోడలపై దేశనాయకుల చిత్రాలను గీయించారు. డాక్టర్ అవార్డు గ్రహీత వజ్రగిరిని, మిగతా జాతీయ చిత్రకళాకారులను ప్రిన్సిపాల్ సైమన్‌విక్టర్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మురళీకృష్ణ ఘనంగా సన్మానించారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు

కంభం, ఆగస్టు 20 : తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు జంతుశాస్త్రం బోధించడానికి అర్హులైన వారు బుధవారం 21వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ సోని తెలిపారు. గంటల ప్రాతిపదికన గరిష్ఠంగా నెలకు 10వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు.



ఈపంట నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ

పక్కాగా పంటల నమోదు చేపట్టాలి

దొనకొండ, ఆగస్టు 20: రైతులు సాగు చేసిన పంటల నమోదు కార్యక్రమంలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా పంట నమోదు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలోని పెద్దన్నపాలెం, గుడిపాడు గ్రామాల్లో జరుగుతున్న ఈపంట నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారి, వ్యవసాయ సహాయకులు, గ్రామ సర్వేయర్‌లతో కూడిన బృందాలు పంట పొలాన్ని సందర్శించి మాత్రమే ఈపంట నమోదు చేయాలన్నారు. కౌలుకు సాగు చేస్తున్న రైతులకు సీసీఆర్‌సీ కార్డుల ద్వారా సాగు చేస్తున్న పంటలను నమోదు చేస్తామన్నారు. ఏరోజు, ఏ సర్వే నెంబర్లల్లో పంట నమోదు చేయబోతున్నారో ఒక రోజు ముందుగానే రైతులకు తెలపాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సేవాకేంద్రం సిబ్బంది అరుణాదేవి, వీణకుమారి, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు

దొనకొండ, ఆగస్టు 20: మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రారంభమైంది. జనవరి 1,2023 నుంచి మార్చి 31, 2014 వరకు చెరువులు, కుంటల్లో పూడికతీత, పండ్ల తోటల నిర్వాహణ, హౌసింగ్‌లో 90 పని దినాలకు సంబంధించి మొత్తం 833 పనులను రూ.6 కోట్లతో చేపట్టారు. ఎస్‌ఆర్‌పీ సురేష్ ఆధ్వర్యంలో ఆడిట్ బృందం గ్రామాల్లో చేపట్టిన పనులపై పరిశీలన చేపట్టింది. ఆయా గ్రామాల్లో పరిశీలనలో వెల్లడైన విషయాలపై గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి ఉపాధి కూలీలతో పాటు గ్రామస్థులకు వివరిస్తున్నారు. 18 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఆడిట్ నివేదికను సిద్ధంచేసి ఈనెల 24న స్థానిక ఉపాధి హామీ కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్వహించనున్నట్టు ఏపీవో దేవయ్య తెలిపారు.

పాఠశాలకు సైన్స్ ల్యాబ్ పరికరాలు బహూకరణ



పాఠశాలకు సైన్స్ ల్యాబ్ పరికరాలు అందజేస్తున్న హెచ్‌డీఎఫ్‌సీ ప్రతినిధులు

కురిచేడు, ఆగస్టు 20: మండలంలోని పడమర వీరాయపాలెం ప్రాథమికోన్నత పాఠశాలకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులు హెచ్‌ఆర్‌డీపీ ప్రాజెక్టులో భాగంగా లక్ష రూపాయల విలువైన సైన్స్ ల్యాబ్ పరికరాలు, రు.50 వేలు విలువచేసే గ్రంథాలయ పుస్తకాలు, బీరువా, బల్ల ను ప్రధానోపాధ్యాయుడు పచ్చా పూర్ణచంద్రరావుకు అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మండల విద్యాశాఖాధికారులు వస్రాం నాయక్, సుబ్బారావు హాజరయ్యారు. బ్యాంకు ప్రతినిధులు కిషన్‌కుమార్, కిరణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులు అన్ని రంగాలలో ముందుండాలని బ్యాంకు తరపున వీటిని అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఆకుల కోటేశ్వరరావు, వైస్‌చైర్మన్ అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేగవంతంగా 'మోపాడు' అభివృద్ధి పనులు



ప్రధాన కాలువపై నిర్మిస్తున్న బ్రిడ్జి

పామూరు, ఆగస్టు 20: పామూరు మండలంలోని మోపాడు రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. జైకో నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ప్రధాన కాలువకు సిమెంట్‌తో కాంక్రీట్ లైనింగ్ పనులు, తూము మరమ్మతు పనులు చేపట్టారు. ప్రధాన కాలువపై నాలుగు చోట్ల వంతెనల నిర్మాణ పనులు చేపట్టారు. ఆయా గ్రామాల నుంచి ఆయకట్టు భూముల వద్దకు వెళ్లేందుకు, పంట ఉత్పత్తులు ఇంటికి చేర్చుకోనేందుకు, ప్రజల అవసరాల కోసం ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాల మేరకు వీటిని నిర్మిస్తున్నారు. మోపాడు బంగ్లాకు వెళ్లే జాతీయ రహదారి నుంచి రిజర్వాయర్ కట్ట వరకు సుమారు కిలో మీటర్ దూరం వరకు తారు రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేశారు.

శునకాల బెడద నుంచి రక్షించాలి



బొట్లగూడూరు రోడ్లపై తిరుగుతున్న శునకాలు

పామూరు, ఆగస్టు 20: మండలంలోని పలుగ్రామాల్లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. జన సంచారం ఉన్న చోట్ల గుంపులు గుంపులుగా శునకాలు తిరుగుతూ పాదచారులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. మండలంలోని బొట్లగూడూరు సెంటర్‌లో వీటి సంచారం తీవ్రంగా ఉంది. పలుగ్రామాల నుంచి వివిధ పనులపై వస్తున్నవారిపై దాడులు చేస్తుండటంతో పలువురికి గాయాలయ్యాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి శునకాల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఇనిమెర్లలో గ్రామోత్సవం

పామూరు, ఆగస్టు 20: మండలంలోని ఇనిమెర్ల గ్రామంలో రామచంద్ర స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం స్వామివార్ల నూతన విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఐదు రోజులపాటు జరుగుతున్న పూజాది కార్యక్రమాలు కురిమేటి బాలసుబ్రమణ్యస్వామి శాస్త్రి ఆధ్వర్యంలో జరుగుతున్నాయి.

ఈక్రాప్ నమోదు చేయించుకోవాలి

ముండ్లమూరు, ఆగస్టు 20: మండలంలోని రైతులు సాగుచేసిన పంటలకు ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని దర్శి ఏడీఏ బాలాజీ నాయక్ అన్నారు. మండలంలోని నాయుడుపాలెంలో మంగళవారం ఈపంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. రైతులు సాగుచేసిన మొక్క జొన్న, కంది పైర్లను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఫరూక్, వీఏఏ వీరాంజమ్మ, రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలి

తాళ్లూరు, ఆగస్టు 20: గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా మంగళవారం తాళ్లూరు శాఖ గ్రంథాలయాన్ని ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పాఠకుల సంఖ్యను పెంచాలన్నారు. గ్రామపంచాయతీల నుంచి వచ్చే సెస్ బకాయిలను వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య, గ్రంథపాలకురాలు వి.విజయకుమారి, బీడీసీఎల్ బొద్దికూరపాడు నిర్వహకురాలు వై.పద్మావతి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి

- ఫ్రీహోల్డ్ నమోదుపై కలెక్టర్ ఆకస్మిక పరిశీలన
- కనిగిరిలో భూరికార్డుల తనిఖీ
- పొలాల్లోకి దారి కల్పించాలని చింతలపాలెం గ్రామస్థుల వినతి



శంఖవరం పరిధిలో గల 562/2, 3, 5 సర్వే నెంబరు భూమిని పరిశీలించి యజమానులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

కనిగిరి ఆగస్టు 20: ప్రభుత్వ భూముల ఆక్రమణలపై కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రత్యేక దృష్టి సారించారు. ఈక్రమంలో ఫ్రీహోల్డ్ నమోదు ప్రక్రియలో జరిగిన అవకతవకలపై జరుగుతున్న విచారణ నేపథ్యంలో మంగళవారం కనిగిరి ఆర్డీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. గత ప్రభుత్వంలో అసైన్డ్ భూములు ఫ్రీహోల్డ్ కింద మార్పులు జరిగాయి. ఈక్రమంలో రాష్ట్రంలోనే కనిగిరి ప్రాంతంలో వేలాది ఎకరాలు ఫ్రీహోల్డ్‌గా నిబంధనలకు విరుద్ధంగా జరిగాయిని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో జిల్లా కలెక్టర్ దీనిపై ప్రత్యేక దృష్టి సారించినక్రమంలో కనిగిరిలో భూరికార్డులను పరిశీలించారు. ఆన్‌లైన్‌లో జరిగిన నమోదును పరిశీలించారు. సంబంధిత భూ రికార్డులలోని వివరాలు, ఆన్‌లైన్ ప్రక్రియలో పొందుపరిచిన వివరాలను పరిశీలించారు.

తొలుత కాశిరెడ్డి కాలనీ వద్ద ఇటీవల ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను కలెక్టర్ పరిశీలించారు. పట్టణ సమీపంలోని శంఖవరం పరిధిలో గల 562/2, 3, 5 సర్వే నెంబరు భూమిని పరిశీలించి అక్కడే సంబంధిత భూ రికార్డులను పరిశీలించారు. ఆయా భూమి యజమానులతో మాట్లాడారు. ఫ్రీహోల్డ్ భూమిని ఆన్‌లైన్ చేసే క్రమపద్ధతిలో భాగంగా ఫాం 17ను పూరించిన విధానంపై ఆర్డీవో జాన్‌ఇర్విన్‌ను అభినందించారు. ఫ్రీహోల్ భూముల తిరస్కరణ, పరిగణన విధానంపై కలెక్టర్ ఆరా తీశారు. ఇంకా ఏమైనా ఫ్రీహోల్డ్ భూముల నమోదులో జరిగిన అక్రమాలను తేల్చాలని ఆర్డీవోను ఆదేశించారు. అక్రమాలు రుజువైతే సంబంధిత సిబ్బంది, అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఫ్రీహోల్డ్‌లో జరిగిన భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై సబ్‌రిజిస్ట్రార్‌ను విచారించారు. ప్రస్తుతం ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిపివేసినట్టు చెప్పారు. ఈవిషయంపై అప్రమత్తంగా వ్యవహరించాలని సబ్‌రిజిస్ట్రార్‌కు సూచించారు.

పొలాలకు వెళ్లేందుకు దారి కల్పించాలి

తమ పొలాల్లో రైల్వేలైన్ వేయటంతో పొలాలకు వెళ్ళే దారి లేకుండా పోయిందని పట్టణ సమీపంలోని చింతలపాలెం గ్రామానికి చెందిన రైతులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. రైల్వేలైన్ వేయటంతో పొలాల్లోంచి గ్రామానికి వచ్చే దారిలేకుండా పోయిందని తెలిపారు. పశువులకు గ్రాసం తెచ్చుకునే వీలు లేకుండా పోయిందని గ్రామస్థులు వాపోయారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి ప్రత్యేకంగా మీ గ్రామానికి వచ్చి పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఆర్డీవో జాన్‌ఇర్విన్, తహసీల్దార్ అశోక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లుల కోసం యత్నాలు

- గత వైసీపీ ప్రభుత్వంలో నిలిపివేత
- విజిలెన్స్ విచారణ పేరుతో కాలయాపన
- కూటమి రాకతో ఆశలు



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన మెగా గోకులం

దర్శి, ఆగస్టు 20: గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో చేసిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల కోసం నిర్వాహకులు తమ యత్నాలు ప్రారంభించారు. దర్శి నియోజకవర్గంలో కోట్లాది రూపాయల బిల్లులు నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలో బాగంగా టీడీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు చేసిన పనులకు సంబంధించిన బిల్లులను నిలిపివేసింది. విజిలెన్స్ విచారణ పేరుతో కాలయాపన చేసింది. అనేకమంది కోర్టులకు వెళ్లి ఉత్తర్వులు తెచ్చినా అరకొరగానే బిల్లులు చెల్లించారు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో బిల్లులు వస్తాయనే ఆశతో నిర్వాహకులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

దర్శి నియోజకవర్గంలో సుమారు రూ.80 కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు ఉన్నాయి. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ మ్యాచింగ్, పశుసంవర్ధకశాఖ, ఇరిగేషన్ తదితర శాఖలలో చేసిన అనేక పనులకు బిల్లులు చెల్లించలేదు. ఐదు సంవత్సరాలు పెట్టుబడులు పెట్టి చేసిన పనులకు బిల్లులు రాకపోవటంతో తీవ్రంగా నష్టపోయారు. అప్పులు తెచ్చి పనులు చేసిన నిర్వాహకులు ఎంతో ఇబ్బంది పడ్డారు. కొంతమందికి పార్టు బిల్లులు వచ్చాయి. మరికొంతమందికి సగం బిల్లు వచ్చాయి. మిగిలిన పెండింగ్ బిల్లుల కోసం ప్రస్తుతం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కొన్ని శాఖల్లో చేసిన పనులకు సంబంధించిన రికార్డులు ఎక్కడున్నాయో అర్థంకాక పలువురు నిర్వాహకులు డివిజనల్ కార్యాలయాలు, జిల్లా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

అస్తవ్యస్తంగా రికార్డులు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రెవెన్యూ. జిల్లా కేంద్రాలు మారటంతో రికార్డులు అస్తవ్యస్తంగా మారాయి. గత ప్రభుత్వంలో అధికారులు ఆ పనులకు సంబంధించిన రికార్డులు పట్టించుకోలేదు. ప్రస్తుతం పనులు చేసిన నిర్వాహకులు అధికారుల వద్దకు వెళ్లి సమాచారం తెలుసుకొని బిల్లుల కోసం ప్రయత్నిస్తున్నారు. కొంతమందికి పనులు పూర్తిగా చేసినప్పటికీ అప్పటి అధికారులు ప్రభుత్వం మారటంతో బిల్లులు చేయలేదు. అలాంటి పనులకు ఇప్పుడు బిల్లులు చేయాల్సిన అవసరం ఉంది. కూటమి ప్రభుత్వం పెండింగ్ బిల్లులపై ఇంకా నిర్దిష్టమైన ఆదేశాలు ఇవ్వలేదు. దీంతో ఎంబుక్ రికార్డు పెండింగ్ ఉన్న నిర్వాహకులు ఎంచేయాలో పాలుపోక అల్లాడుతున్నారు. టీడీపీ సానుభూతిపరులైన నాయకులు, కార్యకర్తల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని, వారుచేసిన పనులకు పూర్తిగా వడ్డీతో బిల్లులు చెల్లిస్తామని గతంలో సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈక్రమంలో పాత బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తుందనే ఆశతో నిర్వాహకులు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తమ ప్రయత్నాలు తీవ్రంగా చేస్తున్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలి



పీసీపల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి

పీసీపల్లి, ఆగస్టు 20: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇతర అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024-25 సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు చెప్పారు. ఇందులోభాగంగా అభివృద్ధి పనుల ఆమోదం కోసం గ్రామ పంచాయతీల్లో ఈనెల 23న గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామ సభల్లో ప్రజల నుంచి వచ్చే అర్జీలను అధికారులు సేకరించి మౌలిక వసతులు కల్పన గురించి ప్రజలకు వివరించాలన్నారు. అలాగే, వచ్చే నాలుగు నెలల్లో చేపట్టబోయే కార్యక్రమాలను ప్రజలకు వివరించి ఆయా పంచాయతీల నుంచి ఆమోదం తీసుకోవాలన్నారు. సోషల్ ఆడిట్ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి హామీ నిధుల ద్వారా సీసీ రోడ్లు, కల్వర్టల నిర్మాణం, తదితర పనులకు సంబంధించి గ్రామ సభల్లో చర్చించి ఆమోదం తీసుకోవాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ మల్లేశ్వరి, పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల ఎంపికకు గ్రామ సభలు

పామూరు, ఆగస్టు 20: మండలంలో ఉపాధి హామీ పథకం కింద కొత్త పనులు ఎంపిక కోసం ఈనెల 23న గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో బి.సురేష్ తెలిపారు. గ్రామ సభలను సర్పంచ్‌ల అధ్యక్షతన పంచా యతీ కార్యదర్శులు పర్యవేక్షించాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, ప్రజలు గ్రామ సభల్లో పాల్గొని నూతన పనులను గుర్తించి తీర్మానాలు తయారు చేయాలని కోరారు.

అభివృద్ధి పనులకు ప్రణాళికలు తయారుచేయాలి



ముండ్లమూరులో మాట్లాడుతున్న ఎంపీడీవో జనార్దన్

ముండ్లమూరు, ఆగస్టు 20: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 2024-25 సంవత్సరానికి గాను ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీడీవో ఆర్.జనార్దన్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి గ్రామ పంచాయతీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై నివేదికలు తయారు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులు కాబట్టి ప్రజలకు ఉపయోగపడే పనులు మాత్రమే గ్రామ సభల్లో గుర్తించాలన్నారు.

ప్రధానంగా రైతులకు ఉపయోగపడే పనులను గ్రామ సభల్లో ఆమోదించాలన్నారు. సమావేశంలో ఏపీవో కె.నాగరాజు, ఈవోఆర్‌డీ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

తురకపాలెం సచివాలయానికి తాళం

- అద్దె చెల్లించాలని యజమాని డిమాండ్
- 20 రోజుల వ్యవధిలో ఇది రెండోసారి
- సమస్య పరిష్కారంలో చొరవ చూపని అధికారులు



తాళం వేసిన తురకపాలెం సచివాలయం

తాళ్లూరు, ఆగస్టు 20: తురకపాలెం సచివాలయం భవనానికి అద్దె చెల్లించాలంటూ మంగళవారం యజమాని తాళం వేశారు. 20రోజుల్లో రెండు పర్యాయాలు తాళంవేసి సచివాలయ సిబ్బంది విధులకు వెళ్లకుండా ఆటంకం కల్గించినా మండలస్థాయి అధికారులు చోద్యం చూస్తున్నారు. బకాయి ఉన్న రూ.56 వేలు చెల్లించాలని మంగళవారం ఉదయం తాళంవేశారు. దీంతో సిబ్బంది సచివాలయంలోకి వెళ్లలేక నూతనంగా నిర్మించిన రైతు సేవాకేంద్ర భవనంలో తలదాల్చుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి అల్లం వెంకటేశ్వర్లు అద్దె చెల్లిస్తామని ఎంత చెప్పినా వినకుండా, తమకు అద్దె చెల్లిస్తేనే తాళంతీస్తామని యజమాని పేర్కొన్నారు. అప్పటివరకు సచివాలయ సిబ్బందిని లోనికి వెళ్లనీయబోమని విధులకు ఆటంకం కల్గించారు. ఇదేవిధంగా అద్దె చెల్లించలేదని గతనెల 31న సచివాలయానికి తాళం వేశారు.



అద్దె చెల్లిస్తామన్నా వైసీపీ నేతలు తాళం వేస్తున్నారు

- సీహెచ్ గురవారెడ్డి, సర్పంచ్

సచివాలయానికి చెల్లించాల్సిన బకాయి నెలలో చెల్లిస్తామనగా, ఇంటి యజమాని ఒప్పుకుని ప్రతిసారి తాళం వేస్తున్నారని సర్పంచ్ సీహెచ్ గురవారెడ్డి పేర్కొన్నారు. ఇంటి యజమాని, వైసీపీ నాయకులు పథకం ప్రకారం ఇలా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. మండలస్థాయి అధికారులు కూడా వైసీపీ నాయకులకే వంతపాడుతున్నారన్నారని సర్పంచ్ ఆరోపించారు. గ్రామప్రత్యేకాధికారుల పాలనలో చెల్లించకుండా బకాయి ఉంటే సర్పంచ్‌గా నేను చెల్లించానన్నారు. చెల్లించాల్సిన బకాయి చెల్లిస్తానన్నా మాట వినకుండా, పిల్లచేష్టలుగా ఇప్పటికి ఐదు సార్లు తాళం వేయటం జరిగిందన్నారు. అధికారుల పనితీరు సక్రమంగా లేకనే వైసీపీ నేతలు తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారన్నారు.

నూతన సచివాలయం ప్రారంభించినా బిల్లులు రాలేదంటూ ఓ వైసీపీ నాయకుడు సచివాలయ భవనం తాళం ఇవ్వలేదని ఎంపీడీవో, ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారన్నారు. ఈవిషయమై అనేకమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోక పోవటంతో సమస్య తీవ్రతరమవుతుందని సర్పంచ్ పేర్కొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

పామూరు, ఆగస్టు 20: ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని టీడీపీ నాయకులు ఉప్పలపాటి హరిబాబు, పాలపర్తి వెంకటేశ్వర్లు కోరారు. పామూరు నూతన తహసీల్దార్‌గా నియమితులైన బీవీ రమణారావును మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రైతుల సమస్యలు, విద్యార్థుల సర్టిఫికెట్లు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు.

కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధానకార్యదర్శి బత్తుల సత్యనారాయణ, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎం.రామకృష్ణ, కోఆర్డినేటర్లు షత్తు మస్తాన్, డి.మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.



దర్శి-కురిచేడు రోడ్డులో నిర్మించిన బస్‌షెల్టర్‌లో వేచిఉన్నప్రయాణికులు

ప్రయాణికులతో కళకళలాడుతున్న బస్ షెల్టర్లు

దర్శి, ఆగస్టు 20: దర్శి పట్టణంలో నూతనంగా నిర్మించి ప్రారంభించిన ఎన్టీఆర్ బస్‌షెల్టర్లు ప్రయాణికులతో కళకళలాడుతున్నాయి. ఇప్పటివరకు ఎన్ని ప్రభుత్వాలు మారినా పట్టణంలో బస్‌షెల్టర్ల ఏర్పాటు గురించి పట్టించుకోలేదు. ప్రయాణికులు, విద్యార్థులు బస్సుల కోసం రోడ్డుపైనే వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బస్‌షెల్టర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సూచనల మేరకు నగర పంచాయతీ నిధులతో రెండు బస్‌షెల్టర్లు ఏర్పాటుచేశారు. దర్శి-పొదిలి రోడ్డులో మరొకటి ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలుస్తున్నారు. ఇంతకాలం బస్సుల కోసం ఎండలో వేచి ఉన్న ప్రయాణికులు ప్రస్తుతం బస్‌షెల్టర్ల కింద హాయిగా సేదతీరుతున్నారు. నూతన బస్‌షెల్టర్లు ఏర్పాటుపట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వైద్యులకు రక్షణ కల్పించాలి

ముండ్లమూరు, ఆగస్టు 20: మహిళా డాక్టర్లకు రక్షణ కల్పించాలని డీవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య అన్నారు. మండలంలోని పోలవరం వద్దగల వేదా ఫార్మసీ కళాశాలలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. కోల్‌కతాలో జరిగిన ఘటన పునరావృతం కాకుండా చూడాలన్నారు.. మహిళా డాక్టర్‌పై హత్యాచారం నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్, సీఐటీయూ నాయకుడు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

పామూరులో కొవ్వొత్తులతో ర్యాలీ

పామూరు, ఆగస్టు 20: కొల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఒమేగా విద్యా సంస్థల కరస్పాండెంట్ కె.రామిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి స్థానిక వివేక ఉన్నత పాఠశాల విద్యార్థులు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మమ్మిడాడీ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి మహిళలపై దాడులను అరికట్టాలని, నిందుతుడిని శిక్షించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో బి.భాస్కరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తెనాలిలో అడుగు లోతులోని పిల్లర్లపై లబ్ధిదారుల ఫిర్యాదుతో పీకేసిన అధికారులు





కూలుతున్నా.. కట్టాలంట

- జగనన్న కాలనీ ఇళ్లలో అక్రమాలు
- పిచ్చుక గూళ్లులా కట్టినోళ్లకే మళ్లీ కాంట్రాక్టు
- ప్రభుత్వం మారినా వైసీపీ వారే నిర్మాణదారులు
- వంద రోజుల ప్రణాళిక అని అధికారుల హడావుడి
- గృహ నిర్మాణ శాఖకు బకాయిలున్నా వారికే పనులు
- రికవరీకి జప్తు నోటీసులిచ్చి.. మళ్లీ పనులు అప్పగించిన వైనం

తెనాలి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పది కాలాలు ఉండాల్సిన ఇళ్లు నిర్మాణదాశలోనే కూలుతున్నాయి. గోడలు ఒరిగిపోతు న్నాయి. అయినా ఇంకెవరూ జగనన్న ఇళ్లు కట్ట లేరన్నట్లుగా.. తిరిగి వారికే కూటమి ప్రభుత్వంలోనూ అధికారులు పనులు అప్పగిస్తున్నారు. ఆప్షన్ 3 కింద కాంట్రాక్టర్ ముసుగులో వైసీపీ నేతలు కట్టిన పేదల ఇళ్లలో నాణ్యతా లోపాలు కంటికి కనిపిస్తున్నాయి. ఇప్పుడు ప్రభుత్వం మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కానీ కాంట్రాక్టర్ ముసుగు వేసుకున్న వారు మాత్రం మారలేదు. కొత్త ప్రభుత్వం వచ్చాక కూడా వైసీపీ నేతలకే ఇళ్ల నిర్మాణ పనులు అప్పగిస్తున్నారు. 100 రోజుల ప్రణాళిక అనిచెప్పి అధికారులు హడావుడి చేసేస్తూ వారినే ఇళ్లు కట్టాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించాయని నాడు గగ్గోలు పెట్టిన కూటమి నేతలు కూడా ఇపు డు పెదవి మెదపడంలేదు. అనుభవం లేకున్నా.. అధికారులు వైసీపీ కాంట్రాక్టర్లకే ఇళ్ల నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజిష్టర్డు కాంట్రాక్టర్లా అంటే అదీ కాదు.. అయినా ఇంకెవరూ లేరన్నట్లుగా వైసీపీ వారే దిక్కనట్లుగా ఇళ్ల పనులు ఇచ్చారు. జగనన్న కాలనీల్లో గుం టూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో మొదటి విడతలోనే భారీ అక్రమాలు జరిగాయని లబ్ధిదారుల నుంచి నాటి కూటమి నేతల వరకు ఆరోపణ. నిర్మాణ పనుల్లో నాణ్యతాలోపాలు న్నాయని, నిర్మాణం కోసం ఇచ్చిన ఇనుము, సిమెంట్‌లను కొందరు కాంట్రాక్టర్లు అమ్మేసుకున్నారనే విషయాలపై గతంలోనే ఆధారాలతో నేతలే బయటపెట్టారు.

అప్పనంగా అప్పగించేశారు..

జగనన్న కాలనీల స్థలాలు కొనే విషయంలో ఎమ్మెల్యే స్థాయి వారికి భారీ లబ్ధి చేకూర్చిన అప్పటి వైసీపీ సర్కారు, ఇళ్ల నిర్మాణంలోనూ కిందిస్థాయి నాయకులకు లబ్ధి కలిగేలా అర్హతా లేని వారికి పనులు అప్పగించారు. అడ్వాన్స్‌ల రపంలో తొలి దోపిడీకి తెరతీస్తే, తర్వాత ఇంటి నిర్మాణానికి ఇచ్చిన ఇనుము, సిమెంట్, ఇసుక పక్కదారి పట్టించి కొందరు అమ్మేసుకున్నారు. 12 అడుగుల లోతులో పిల్లర్లు నిర్మించాని గృహనిర్మాణ శాఖ సూచిస్తే, చాలాచోట్ల 3 నుంచి 6 అడుగుల లోతులో గోతులు మాత్రమే తీసి పిల్లర్లు వేశారు. కొన్నిచోట్లయితే కేవలం అడుగు లోతులోనే పిల్లర్లు వేశారు. ఇటువంటి వాటిని తెనాలి, గుంటూరు, పొన్నూరు, బాపట్లలో కొందరు సి బ్బంది గుర్తించి వాటిని తిరిగి నిబంధనల ప్రకారం నిర్మించాలని కోరితే వైసీపీ కాంట్రాక్టర్లు వారి మాటలు పట్టించు కోలేదు. ఎవరైనా గట్టిగా అడిగితే వారిపై దౌర్జన్యం చేసిన సందర్భాలున్నాయి. తెనాలి వంటిచోట్లయితే కొందరు అధికారులు కూడా కాంట్రాక్టర్లతో కుమ్మక్కై దోపిడీకి దారులు చూపించారు. మరికొందరు వారి బంధువులనే కాంట్రాక్టర్లుగా రంగంలోకి దించి నిధులు దోచేశారు. పేరేచర్ల, బాపట్ల, మరికొన్ని చోట్లయితే నిర్మాణం పూర్తయిన ఇళ్లు కూలిపోవడం, గోడలు పడిపోవటం వంటివి అప్పుడే బయటపడ్డాయి. తెనాలి, పొన్నూరు, బాపట్ల, రేపల్లె, మంగళగిరి నియోజకవర్గాల పరిధిలో చాలా లేఅవుట్లలోగోడలకు పగుళ్లిచ్చాయి. దారుణంగా ఇళ్ల నిర్మాణాలు చేసినా, రూ.కోట్లలో నిధులు దోచేసినా వారికే మళ్లీ పనులు అప్పగించడం చూస్తే దొంగ చేతికే తాళాలు ఇచ్చిన చందంగా అధికారుల తీరు ఉందని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. నాసిరకం పనులపై ప్రశ్నిస్తే దౌర్జన్యం చేసిన కాంట్రాక్టర్లకే కూటమి ప్రభుత్వంలోనూ పనులు ఇస్తున్నారంటూ వాపోతున్నారు. ఇటీవల తెనాలిలో ఇళ్ల నిర్మాణ పరిస్థితి, వాటి పురోగతిని పరిశీలించేందుకు వచ్చిన జిల్లా పాలనాధికారే పనులను పాత కాంట్రాక్టర్లతో చేయించాలని ఆదేశాలివ్వడం విమర్శలకు తావిస్తోంది. ఓపక్క రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెనాలి లేఔట్‌లలో ఇళ్లను పరిశీలించి ఐదుగురు కాంట్రాక్టర్‌ల నుంచి వెంటనే డబ్బు రికవరీ చేయాలని, ఒక కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అయితే 100 రోజుల్లో ఇళ్ల నిర్మాణ లక్ష్యం పెట్టుకోవటం వల్లే వారికి పనులు అప్పగిస్తున్నామని కొందరు అధికారులు చెబుతున్నారు.




ఇల్లు.. పేదల నుంచి ధనవంతుల వరకు కల. ఎవరి స్థాయిలో వారు పది కాలాలు ఉండేలా నిర్మించుకుంటారు. అలాంటి ఇళ్ల నిర్మాణాలను గత ప్రభు త్వం అపహాస్యం చేసింది. రూ.కోట్లు దోచుకునేందుకన్నట్లుగా నిర్మాణాలు చేపట్టారు. జగనన్న కాలనీల పేరుతో పేదల సొంతింట కల నెర వేరుస్తున్నామంటూ దోపిడీకి వైసీపీ నాయకులు తెర లేపగా వారికి కొందరు అధికారులు సహకరించారన్న ఆరోపణలున్నాయి. జగనన్న కాలనీల్లో పేదల కోసం ఆప్షన్ -3లో నిర్మిస్తున్న ఇళ్లు పిచుక గూళ్లుగా ఉన్నాయి. మూడడుగుల లోతులో వేసిన పిల్లర్లు.. నేలపైనే పునాదులు.. నిర్మాణం జరుగుతుండగానే పగుళ్లిస్తూ ఒరిగిపోతున్న గోడలు.. ఇదీ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో జగనన్న కాలనీల పరిస్థితి. అయితే ప్రభుత్వం మారింది ఇలాంటి అక్రమాలు ఇక ఆగిపోతాయని లబ్ధిదారులు భావించగా అధికారుల తీరు వారిని నిరాశకు గురిచేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా నాటి వైసీపీ కాంట్రాక్టర్లకే మళ్లీ పనులు అప్పగిస్తూ నిర్మాణాలపై అధికారులు హడావుడి చేస్తున్నారు. వైసీపీ హయాంలో జగనన్న ఇళ్లలో జరుగుతున్న అక్రమాలపై ఆందోళన చేసిన టీడీపీ నేతలు ప్రస్తుతం మౌనం దాల్చడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పనుల కంటే అడ్వాన్సులే అధికం..

ప్రభుత్వం వారిది.. కాంట్రాక్టర్లు వారే కావడంతో వారు ఏదడిగితే అదిచ్చేయటం, వారు ఎలా నిర్మించినా బిల్లులపై సంతకాలు చేయమంటే చేసేయడం గృహనిర్మాణ, మెప్మా అధికారుల వంతైంది. ఒక్కో ఇంటికి రూ.1.8 లక్షలు మంజూరయితే, వీటిలో కేంద్రం రూ.1.5 లక్షలు విడుదల చేస్తే, మిగిలిన రూ.30 వేలు రాష్ట్ర ప్రభుత్వం వాటాకింద ఇవ్వాలి. కానీ ప్రభుత్వం దిగిపోయే వరకు ఆ వాటా మొత్తాన్ని విడుదల చేసే విషయాన్ని విదిలింపులతోనే సరిపెట్టారు. పైగా మెప్మా ద్వారా ఒక్కో లబ్ధిదారుకు రూ.35 వేల నుంచి రూ.50 వేల వరకు రుణం ఇప్పించి వారితో కట్టించారు. కనీసం లబ్ధిదారులు భరిస్తున్న మొత్తాలు కూడా ఇవ్వలేదు. పునాదులు వేస్తే ఇంటికి రూ.70 వేల చొప్పున అప్పనంగా వారి చేతిలో పెట్టేశారు. ఇవికాక మెప్మా రుణం మొత్తాన్ని లబ్ధిదారుల అంగీకారంతో సంబంధం లేకుండా కాంట్రాక్టర్ల ఖాతాలకు మళ్లించారు. ఇది నిబంధనలకు విరుద్ధమే అయినా ఏ అధికారీ అడ్డుకోలేదు. దీంతో ఒక్కో కాంట్రాక్టర్‌కు రూ.50 లక్షల నుంచి 10 కోట్ల వరకు అడ్వాన్స్‌ల రూపంలో చెల్లించేశారు. ఒక్క తెనాలి నియోజకవర్గంలోనే కేవలం ఐదుగురు కాంట్రాక్టర్లకు రూ.9 కోట్ల వరకు ఇచ్చేశారు. అయితే వీరికి ఇవ్వాల్సిన బిల్లులు తీసేస్తే ఇంకా నేటికీ కాంట్రాక్టర్లే ప్రభుత్వానికి రూ.6.21 కోట్లు చెల్లించాలి. ఇదే తరహాలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో నిర్మాణ పనులు దక్కించుకున్న ఓ వైసీపీ ఎమ్మెల్యేకి సంబంధించిన కాంట్రాక్ట్ సంస్థ రూ.70 కోట్లపైన తిరిగి చెల్లించాలి. ఈ మూడు జిల్లాల్లోనే రూ.89 కోట్లకు పైనే కాంట్రాక్టర్ల నుంచి బకాయిలు రావాల్సి ఉందనేది ప్రాథమిక అంచనా. అయితే వీరందరికీ జూలై మొదటి వారంలోనే గృహనిర్మాణ శాఖ నోటీసులు జారీ చేసింది. ఎన్ని ఇళ్ల నిర్మాణానికి తీసుకున్నారో! వాటిలో ఎన్ని నిర్మించారో, వాటికోసం ఎంత డబ్బు అడ్వాన్స్ కింద తీసుకున్నారో వివరాలు తెలియచేస్తూ కాంట్రాక్టర్లకు నోటీసులిచ్చారు. నోటీసు అందుకున్న 15 రోజుల్లోగా మెప్మాకు, గృహ నిర్మాణ సంస్థకు బాకీ ఉన్న మొత్తాలను ఆయా ప్రభుత్వ ఖాతాలకు జమ చేయాలని నోటీసుల సారాంశం. అయితే వీటికి ఎవరూ స్పందించకపోవడంతో తాజాగా ఆస్తుల జప్తు చేస్తుమంటూ మరో నోటీసుకూడా కొన్నిచోట్ల అందించారు. కొందరు భయపడి చెల్లించడానికి ముందుకు వస్తే, చాలామంది ఏ సమాధానం లేకుండా ఉండిపోయారు. వీరిలో కొందరు మాత్రం తమకే ప్రభుత్వం నుంచి డబ్బు రావాల్సి ఉందని, వాటి విషయం తేల్చకుండా డబ్బు చెల్లించమంటే ఎలాగంటూ ఎదురుతిరిగారు.



తక్కువ ఎత్తులో పిల్లర్లతో పునాదులకే పరిమితమైన ఇళ్లు



సీఆర్‌డీఏ సమర్థంగా

- విభాగాల వారీగా బలోపేతానికి అడుగులు
- అమరావతి పనులు ముమ్మరం చేసేలా పోస్టింగ్‌లు
- రెవెన్యూ విభాగానికి 23 మంది తహసీల్దార్ల డిప్యూటేషన్
- ఇంజనీరింగ్, ప్లానింగ్ తదితర విభాగాల పటిష్టతకు చర్యలు
- ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్, ఎంబీఏ రంగాల వారికీ అవకాశం

విజయవాడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాజధానిలో అమరావతిలో పనులు ముమ్మరం చేసేలా సీఆర్‌డీఏ శరవేగంగా అడుగులు వేస్తోంది. కూటమి ప్రభుత్వ ఆదేశాలకు.. ఆలోచనలకు అనుగుణంగా అమరావతిలో వివిధ ప్రాజెక్టులపై రాజధాని అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) దృష్టి సారించింది. ఈ క్రమంలో సమర్థంగా పని చేసేందుకు సీఆర్‌డీఏ తొలుత పెద్దఎత్తున ఉద్యోగ నియామకాలకు సిద్ధమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రాజధాని పనులను ముమ్మరం చేసేందుకు సిద్ధమౌతున్న సీఆర్‌డీఏకు తగినంతమంది సిబ్బంది లేకపోవడంతో భూ సంబంధిత వ్యవహారాలను పర్యవేక్షించడం కష్టమైపోతోంది. ఒక్క రెవెన్యూ విభాగమే కాకుండా ఇంజనీరింగ్, ప్లానింగ్ తదితర ఇతర విభాగాలలో కూడా సీఆర్‌డీఏలో తగినంతమంది సిబ్బంది లేరు. ఈ పరిస్థితుల్లో సీఆర్‌డీఏలో వివిధ విభాగాలతో పాటు రెవెన్యూ విభాగాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తహసీల్దార్లను డిప్యూటేషన్ పద్ధతిలో పోస్టింగ్‌లు కల్పించింది. రాజధాని పరిధిలోని ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాలతో పాటు ఏలూరు జిల్లాకు చెందిన మొత్తం 23 మంది తహసీల్దార్లను సీఆర్‌డీఏకు డిప్యూటేషన్ కల్పించింది. వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న 188 మందిని డిప్యూటేషన్‌పై తీసుకుంటామని జూలైలో నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే డిప్యూటేషన్‌పై సీఆర్‌డీఏకు రావడానికి ఏ శాఖ నుంచి కూడా ఇష్టపడలేదు. ఈ విషయాన్ని సీఆర్‌డీఏ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆయా శాఖల ఉన్నతాధికారులే నేరుగా రంగంలోకి దిగి తమ పరిధిలో ఉన్న అధికారులను సీఆర్‌డీఏకు డిప్యూటేషన్ విధానంలో పంపిస్తున్నారు. మొదటిగా సీసీఎల్ఏ దీనికి పూనుకుంది. సీసీఎల్ఏ కమిషనర్ జి.జయలక్ష్మి 23 మంది తహసీల్దార్లను సీఆర్‌డీఏకు డిప్యూటేషన్‌పై పంపుతున్నట్లు ఆదేశాలు జారీ చేశారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాలకు చెందిన 23 మంది తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లను సీఆర్‌డీఏకు ఏడాదిపాటు డిప్యూటేషన్‌పై కేటాయిస్తూ సీసీఎల్ఏ ఆదేశాలు జారీ చేసింది. వీరే కాకుండా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల స్థాయిలోనే 20 మంది అవసరం ఉంది. సీఆర్‌డీఏకు డిప్యూటేషన్ మీద వస్తున్న తహసీల్దార్లు ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్, ల్యాండ్ యూజ్ మేనేజర్లు, ఎస్టేటు మేనేజ్‌మెంట్, ఎస్టేటు ల్యాండ్ ఎక్విజిషన్, ల్యాండ్ ప్రొటెక్షన్, రెవెన్యూ ఆఫీసర్స్ వంటి స్థానాల్లో పనిచేస్తారు. వీరికింద పనిచేసేలా డిప్యూటీ తహసీల్దార్లకు పోస్టింగ్స్ ఇస్తారు. ల్యాండ్స్ డైరెక్టర్లుగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల స్థాయిలో తీసుకుంటారు. వీరికి సంబంధించి ఇంకా ఆదేశాలు రాలేదు. ఆర్డీవో, డీఆర్వోల స్థాయిలో ఉన్నవారిని తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇంజనీరింగ్, ప్లానింగ్ విభాగాలను కూడా సిబ్బందితో భర్తీ చేయాల్సి ఉన్నందున ఆయా శాఖలకు సంబంధించి ఇంకా డిప్యూటేషన్ ఖరారు కాలేదు.

పలు ఉద్యోగాలకు నోటిఫికేషన్లు..

సీఆర్‌డీఏలో కాంట్రాక్టు విధానంలో పలు పోస్టులకు నోటిఫికేషన్లు జారీ చేశారు. డైరెక్టర్ (ప్లానింగ్), చీఫ్ ఇంజనీర్(ట్రాఫిక్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్), గ్రూప్ డైరెక్టర్(సోషల్ డెవలప్‌మెం ట్), మేనేజర్(మీడియా),జాయింట్ డైరెక్టర్ (స్ట్రాటజీ), డిప్యూటీ డైరెక్టర్(ఫైనాన్షియల్ ప్లా నింగ్ స్ట్రాటజీ డివిజన్) పోస్టులకు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తామని చెబుతున్న టీడీపీ ప్రభుత్వం ఈ దిశగా ఉద్యోగాల కల్పనకు శ్రీకారం చుడుతోంది. సీఆర్‌డీఏలో వర్థమాన పట్టభద్రులను దృష్టిలో ఉంచుకుని 9 ఉద్యోగాలకు మరో నోటిఫికేషన్ విడుదల చేసింది. అడిషనల్ డైరెక్టర్ - ప్రొక్యూర్‌మెంట్(సివిల్ ఇంజనీరింగ్), సీనియర్ మేనేజర్ - ప్రొక్యూర్‌మెంట్ (సివిల్ ఇంజనీరింగ్), జాయింట్ డైరెక్టర్ - ఎకనామిక్(ఎంబీఏ), ఎన్విరాన్‌మెంటలిస్ట్(ఎమ్మెస్సీ), సీనియర్ కన్సల్‌టెంట్ - క్వాలిటీ కంట్రోల్(సివిల్ ఇంజనీరింగ్), సీనియర్ కన్సల్‌టెంట్ - ఇన్‌ఫ్రా మేనేజ్‌మెంట్ (సివిల్ ఇంజనీరింగ్), సీనియర్ అర్బన్ ప్లానర్ - ఆర్కిటెక్ట్(ఆర్కిటెక్చర్), ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(సివిల్ ఇంజనీరింగ్) పోస్టులకు నోటిఫికేషన్ వెలువరించింది. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునేవారు సీఆర్‌డీఏ వెబ్‌పోర్టల్‌లో కెరీర్స్‌లోకి వెళ్లి మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చు. అలాగే అందులోనే దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు.

పరిశ్రమల స్థాపనపై ప్రత్యేక దృష్టి

- జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు



బాపట్ల, ఆగస్టు 20: జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధి, ఎంఎస్ఎంఈ వ్యవస్థాపకత, ఆహార శుద్ధి పరిశ్రమల విధానం రూపకల్పనకు సూచనలు, సలహాలపై కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ఆక్వాకల్చర్, గ్రానైట్ పరిశ్రమలు, రొయ్యలు, చేపల పెంపకం- శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు జిల్లా అనువైన ప్రాంతమన్నారు. రాయల్‌మెరైన్ ప్రతినిధి సి.వి జయ్‌కుమార్ మాట్లాడుతూ మెరైన్ పరిశ్రమలు స్థాప నకు 40 అడుగుల రోడ్డు నిబంధనను సడలించాలని, కరెంట్‌కోతలు లేకుండా చూడాలన్నారు. ఫ్యాపిసియా తరఫున హాజరైన కె.సుబ్బారావు మాట్లాడుతూ ఈవోడీబీ నిర్దేశించిన రిఫార్మ్‌ను సరళతరం చేస్తూ కొన్ని రకాల అనుమతులను ఎత్తివేయాలని తెలిపారు. చీరాల ఆటోనగర్ అసోసియేషన్ ప్రతినిధి ఎం.శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఎపిక్ ద్వారా స్థలం కొనుగోలు చేసిన బీసీ మహిళలకు కూడా రాయితీ ఇవ్వాలన్నారు. రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధి టి.శిరీషా మాట్లాడుతూ మిల్లులకు ప్రత్యేక రాయితీ ఇవ్వాలన్నారు. మార్టూరు గ్రానైట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి ఇంటూరి ఆంజనేయులు మాట్లాడుతూ గ్రానైట్ పరిశ్రమలకు ట్రూ ఆఫ్ చార్జీలు ఎత్తివేయాలన్నారు. పరిశ్రమ స్థాపించి ఏడేళ్లు దాటిన వారికి మర లా కొత్త యంత్రాలు ఏర్పాటు చేస్తూ కొత్తగా రాయితీలు కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి వై.రామకృష్ణ, ఆర్డీవో లు, ఈఈలు, ఎల్‌డీఎంలు, డీపీవోలు, లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు.

ఇనాం సమస్యలు పరిష్కరించాలి

జిల్లాలో ఎన్నో ఏళ్ళగా అపరిష్కృతంగా ఉన్న ఇనాం, ఎస్టేట్ భూముల సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని జేసీ బి.సుబ్బారావు ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆర్డీవో లు, తహసీల్దార్‌లతో జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో 4 ఈనాం ఎస్టేట్ గ్రామాలు, మూడు ఇనాం గ్రామాల్లో భూ సమస్యలు వివిధ దశల్లో అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. మార్టూరు మండలంలో లక్కవరం, జంగమహేశ్వరపురం, పర్చూరు మండలలో ఎడుబాడు, సంతమాగులూరు మండలంలో గోపాపురం గ్రామాలో ఎస్టేట్ భూములు ఉన్నాయని తెలిపారు. భూ సమస్యల వల్ల రైతులు ఇబ్బంది పడకుండా చూచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఆర్డీవో గంధం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన.. నివాళి

కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ హాస్పిటల్ ఘటనకు నిరసనగా మంగళవారం ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్(ఆజ్జుడా) ఆధ్వర్యంలో గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఆవరణలో నిరసన కొనసాగింది. సాయంత్రం ప్రదర్శనగా గుంట గ్రౌండ్‌కు చేరి ట్రైనీ పీజీ చిత్రంపై కొవ్వొత్తులతో నివాళులర్పించారు. - గుంటూరు (మెడికల్)

సర్దుబాటు గందరగోళం

- హైస్కూళ్లలో ఎస్‌ఏలకు బదులు ఎస్‌జీటీలు..
- పలు పాఠశాలల్లో తీరని సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత
- జడ్పీ స్కూల్స్ నుంచి మున్సిపాల్టీలకు నియామకాలు
- సంఘాల విజ్ఞప్తుల్ని బుట్టదాఖలు చేశారని ఆందోళన
- గుంటూరు కార్పొరేషన్ పరిధిలో ఇప్పటికే జరిగిన వాటికి తిలోదకాలు

గుంటూరు(విద్య), ఆగస్టు 20: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ప్రారంభమైన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రి య అనేక చోట్ల గందరగోళంగా మొద లైంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 57 మండలాల్లో మంగళవారం నుంచి ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రారంభమైం ది. మండల స్థాయిలోని పాఠశాలల్లో అదనంగా ఉన్న ఉపాధ్యాయుల్ని సర్దుబాటు చేసేలా ఎంఈవోలు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. అయితే ఇదీ అనేక ప్రాంతాల్లో అస్తవ్యస్తంగా సాగినట్లు సంఘాల నాయకులు, కౌన్సెలింగ్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేక చోట్ల మెరిట్ కం రోస్టర్ పాటించలేదని సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. దీంతో జూనియర్లకు ఒక న్యాయం సీనియర్లకు మరో న్యాయం జరిగినష్టపోయారన్నారు. ఎస్‌జీటీ సీనియార్టీ జాబితాను విడుదల చేయలేదని సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

- గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో దాదాపు నెల క్రితమే ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే అదనపు ఉపాధ్యాయుల్ని 5 నుంచి 15 మంది వరకు సర్దుబాటు చేశారు. తాజా గా మరోసారి సర్దుబాటుతో మళ్లీ వారితో బోధన చేయించడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉందని హెచ్ ఎంలు వా పోతున్నారు.
- పల్నాడు జిల్లా రాజుపాలెం ఎంపీయూపీ స్కూల్‌లో ఇద్దరు ఎస్‌జీటీలను సర్ ప్లస్ పేరుతో బయటకు పం పారు. ఇక్కడ స్కూల్ అసిస్టెంట్స్ స్థానంలో ముగ్గురు ఎస్‌జీటీలను నియమించారు.
- గుంటూరు పశ్చిమ మండలం నల్లపాడు జడ్పీ స్కూల్ నుంచి గుంటూరు తూర్పు మండలం ఏటుకూరులో స్కూల్‌లో సర్దుబాటుకు అవకాశం కల్పించలేదు.
- మాచర్లలో సీనియర్ ఉపాధ్యాయుల నుంచి విల్లింగ్(అనుమతి) తీసుకోకుండా, అదనంగా ఉన్న జూనియర్ టీచర్లను కౌన్సెలింగ్‌కు పిలిచారు.
- అనేక స్కూల్స్‌లో ఒక సబ్జెక్టు బదులు మరో సబ్జెక్టు ఉపాధ్యాయుల్ని నియమించారు. దీనివల్ల కొరత తీరినా సబ్జెక్టు టీచర్లు లేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్‌ఎంలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- గత ఐదేళ్లుగా మున్సిపాల్టీల్లో, కార్పొరేషన్ పరిధిలో బదిలీలు, ఉద్యోగోన్నతులు నిర్వహించలేదు. అదేమని ప్రశ్నిస్తే రూల్స్‌లేవని అధికారులు సమాధానం చెబుతున్నారు. అయితే జడ్పీ స్కూల్స్ నుంచి మున్సిపాల్టీల్లోని పాఠశాలలకు, మున్సిపల్ స్కూల్స్ నుంచి జడ్పీ స్కూల్స్ ఉపాధ్యాయుల్ని సర్దుబాటు చేస్తున్నారు. ఇది ఎలా సాధ్యామని ప్రశ్నించినా సమాధానం లేదని సంఘాల నాయకులు వాపోతున్నారు. అయితే రాష్ట్రస్థాయిలో ఐటీ సెల్ నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం సర్దుబాటు జరు గుతుందని ఇందులో తమ ప్రమేయం ఏమీ లేదని అధికారులు చెబుతున్నట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తెలిపారు.



సర్దుబాటు కోసం ఎమ్మార్సీకి వచ్చిన ఉపాధ్యాయులు

కొనసాగుతున్న టీచర్ల పని సర్దుబాటు

ఒంగోలు(విద్య), ఆగస్టు 20 : జిల్లాలో ఉపాధ్యాయుల పని సర్దుబాటు మొదటిదశ ప్రక్రియ కొనసాగుతోంది. వాస్తవానికి ఈ ప్రక్రియ సోమవారమే ప్రారంభమైంది. టీచర్ల సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలు రావడంతో మొదటి రోజు 30 మండలాల్లో సర్దుబాటు ప్రక్రియ నిలిచిపోయింది. కేవలం ఎనిమిది మండలాల్లో మాత్రమే పూర్తయింది. రెండో విడత ఈనెల 18, 19 తేదీల్లో విడుదల చేసిన జాబితాలపై అభ్యంతరాలు తెలుపుకునేందుకు అవకాశం ఇచ్చారు. దీంతో 30 మండలాల నుంచి మిగులు టీచర్ల జాబితాలపై అభ్యంతరాలు రావడంతో ఆ మండలాల్లో సర్దుబాటు కౌన్సెలింగ్‌ను నిలిపివేశారు. ఈ మండలాల నుంచి 54 అభ్యంతరాలు రావడంతో గుంటూరు ఆర్‌జేడీ ద్వారా వాటిని పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయానికి పంపించారు. ఆ అభ్యంతరాల్లో కొన్నింటికి పరిష్కారం లభించడంతో 30 మండలాల్లో మొదటిదశలో చేపట్టిన స్కూలు అసిస్టెంట్ల సర్దుబాటు కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. మొదటగా మిగులుగా తేలిన సబ్జెక్టు టీచర్లు తాము పనిచేస్తున్న యాజమాన్యాల్లోని పాఠశాలలకు సర్దుబాటు చేశారు. ఆ తర్వాత ఇతర యాజమాన్యాల్లో మిగిలిపోయిన ఖాళీలకు ఆయా టీచర్లను సర్దుబాటు చేశారు.

ఒంగోలులో పూర్తి

ఒంగోలు నగరం, ఒంగోలు రూరల్ మండలం పరిధిలోని టీచర్ల సర్దుబాటు మొదటిదశ పూర్తయినట్లు ఎంఈవో టి.కిషోర్‌బాబు తెలిపారు. మండలంలో 48 మంది టీచర్లు మిగులుగా తేలగా 34మందిని సర్దుబాటు చేశారు. 14 మంది ఎస్‌జీటీలు ఇప్పటికి మిగులుగా ఉన్నారు. రెండు ఇంగ్లీషు, ఒక హిందీ పోస్టు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులకు డివిజన్ స్థాయి కౌన్సెలింగ్‌లో ఇతర మండలాల్లో అర్హులైన టీచర్లతో భర్తీచేస్తారని కిషోర్‌బాబు తెలిపారు.

పంచాయతీలకు ఊరట

- జిల్లాకు రూ.70కోట్లు ఆర్థికసంఘం నిధులు
- ఈ నెలాఖరులోపు అకౌంట్లకు జమయ్యే అవకాశం

ఒంగోలు(కలెక్టరేట్),ఆగస్టు 20: గ్రామ పంచాయతీలకు ఎట్టకేలకు ఊరట లభించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి విడత 15వ ఆర్థిక సంఘం నిధులు జిల్లాకు రూ.70కోట్ల వరకు వచ్చే అవకాశం ఉంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కేంద్రప్రభుత్వం ఇచ్చే ఆర్థికసంఘం నిధులను విద్యుత్ బకాయిలు, ఇతర అవసరాల కోసం దుర్వినియోగం చేయడంతో గ్రామపంచాయతీలు నిర్వీర్యమయ్యాయి. ఫాగింగ్ చేసేందుకు కూడా నిధులు లేక కునారిల్లుతున్న సమయంలో రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టిపెట్టింది. పలు పర్యాయాలు కేంద్రప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి ఆర్థికసంఘం నిధులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి వచ్చిన ఆర్థికసంఘం నిధులను మంగళవారం రాష్ట్రప్రభుత్వం పంచాయతీలకు కేటాయించింది. ఆ నిధులు ఈ నెలాఖరులోపు జమ కానున్నాయి. ఈ నిధుల ద్వారా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణతోపాటు అత్యవసరమైన పనులు చేపట్టేందుకు అవకాశం వచ్చింది.

నలుగురు ఎస్‌ఐలకు పోస్టింగ్‌లు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 20: జిల్లాలో నలుగురు ఎస్‌ఐలకు పోస్టింగ్‌లు ఇచ్చి, ఇరువురిని వీఆర్‌కు పిలిచారు. ఈమేరకు మంగళవారం ఎస్పీ ఏఆర్. దామోదర్ ఉత్తర్వులు జారీచేశారు. కురిచేడులో పనిచేసిన బి.శ్రీకాంత్‌ను నాగులుప్పలపాడుకు బదిలీ చేశారు. అక్కడ పనచేస్తున్న బి.బ్రహ్మనాయుడును వీఆర్‌కు పిలిచారు. ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న వి.మహేష్‌ను దొర్నాల ఎస్‌ఐగా నియమించారు. ఇతర జిల్లా నుంచి వచ్చిన బి.సుదర్శన్‌యాదవ్‌ను అర్థవీడుకు బదిలీ చేస్తు అక్కడ పనిచేస్తున్న ఎం.అనితను వీఆర్‌కు బదిలీ చేశారు. వెలిగండ్ల ఎస్‌ఐగా పనిచేస్తున్న ఎం.శివను కురిచేడుకు బదిలీ చేశారు.

క్విస్ ఇంజనీరింగ్ కళాశాలకు ఉత్తమ అవార్డు

ఒంగోలు(విద్య), ఆగస్టు 20 : ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలకు జేఎన్‌టీయూకే ఉత్తమ ఇంజనీరింగ్ కళాశాల అవార్డును అందజేసింది. జేఎన్‌టీయూ కాకినాడలో ఆ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ అవార్డును క్విస్ ప్రిన్సిపాల్ వై.హనుమంతరావుకు ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.రామ్మోహన్ రావు, కాకినాడ సీపోర్టు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎం. మురళీధర్‌ల చేతుల మీదుగా మంగళవారం అందుకున్నారు. యూనివర్శిటీ అనుబంధంగా కళాశాలల్లో ఉత్తమ ప్రతిభ పనితీరు కనబర్చినందుకు క్విస్ ఇంజనీరింగ్ కళాశాలను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. 1998లో స్థాపించిన క్విస్ ఇంజనీరింగ్ కళాశాలకు ఉత్తమమైన ఎన్‌ఐఆర్‌ఎఫ్(200-300) ర్యాంకింగ్, న్యాక్ ఎ, ఎన్‌బీఏ గుర్తింపు తదితర ప్రమాణాలతో యూనివర్శిటీ అనుబంధ కళాశాలల్లో క్విస్ కళాశాల ప్రథమస్థానంలో నిలిచింది. యూనివర్శిటీ వీసీ మురళీకృష్ణ అభినందించారు. అవార్డును అందుకున్న ప్రిన్సిపాల్‌ను స్థానిక కళాశాలలో కరస్పాండెంట్ డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణచక్రవర్తి, వైస్‌చైర్మన్ డాక్టర్ ఎన్.శ్రీగాయత్రి మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు.

ఆంధ్రకేసరి యూనివర్సిటీకి ప్రత్యేకనిధులు కేటాయించాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 20: ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్సిటీకి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. మంగళవారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఎంపీ మాగుంట మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గంలోని పలు సమస్యలతో పటు పెండింగ్‌లో ఉన్న పలు రకాల అభివృద్ధి పనులను మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. ప్రధానంగా ఆంధ్రకేసరి యూనివర్సిటీకి సంబంధించిన పలు అంశాలను ప్రస్తావిస్తూ అందుకు సంబంధించి నిధులు కేటాయించి ఆదుకోవాలని ఆయన కోరారు.

తురకపాలెం సచివాలయానికి తాళం

- అద్దె చెల్లించాలని యజమాని డిమాండ్
- 20 రోజుల వ్యవధిలో ఇది రెండోసారి

తాళ్లూరు, ఆగస్టు 20: తురకపాలెం సచివాలయం భవనానికి అద్దె చెల్లించాలంటూ మంగళవారం యజమాని తాళం వేశారు. 20రోజుల్లో రెండు పర్యాయాలు తాళంవేసి సచివాలయ సిబ్బంది విధులకు వెళ్లకుండా ఆటంకం కల్గించినా మండలస్థాయి అధికారులు చోద్యం చూస్తున్నారు. అద్దెకు ఉంటున్న సచివాలయానికి రూ.56 వేలు చెల్లించాలని మంగళవారం ఉదయం తాళంవేశారు. దీంతో సిబ్బంది సచివాలయంలోకి వెళ్లలేక నూతనంగా నిర్మించిన రైతు సేవాకేంద్ర భవనంలో తలదాల్చుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి అల్లం వెంకటేశ్వర్లు అద్దె చెల్లిస్తామని ఎంత చెప్పినా వినకుండా, తమకు అద్దె చెల్లిస్తేనే తాళంతీస్తామని యజమాని పేర్కొన్నా రు. అప్పటివరకు సచివాలయ సిబ్బందిని లోనికి వెళ్లనీయబోమని విధులకు ఆటంకం కల్గించారు. ఇదేవిధంగా అద్దెచెల్లించలేదని గతనెల 31 సచివాలయానికి తాళం వేశారు.

అద్దె చెల్లిస్తామన్నా వైసీపీ నేతలు తాళం వేస్తున్నారు

సచివాలయానికి చెల్లించాల్సిన బకాయి నెలలో చెల్లిస్తామనగా, ఇంటి యజమాని ఒప్పుకుని ప్రతిసారి తాళం వేస్తున్నారని సర్పంచ్ సీహెచ్ గురవారెడ్డి పేర్కొన్నారు. ఇంటి యజమాని, వైసీపీ నాయకులు పథకం ప్రకారం ఇలా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు కూడా వైసీపీ నాయకులకే వంతపాడుతున్నారన్నారని సర్పంచ్ ఆరోపించారు. గ్రామప్రత్యేకాధికారుల పాలనలో చెల్లించకుండా బకాయి ఉంటే సర్పంచ్‌గా నేను చెల్లించానన్నారు. చెల్లించాల్సిన బకాయి చెల్లిస్తానన్నా మాట వినకుండా, పిల్ల చేష్టలుగా ఇప్పటికి ఐదుసార్లు తాళం వేయటం జరిగిందన్నారు. అధికారుల పనితీరు సక్రమంగాలేకనే వైసీపీ నేతలు తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారన్నారు.

నూతన సచివాలయం ప్రారంభించినా బిల్లులు రాలేదంటూ ఓ వైసీపీ నాయకుడు సచివాలయ భవన తాళం ఇవ్వలేదని ఎంపీడీవో, ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారన్నారు. ఈ విషయమై అనేకమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోక పోవటంతో సమస్య తీవ్రతరమవుతుందని సర్పంచ్ పేర్కొన్నారు.

పక్కాగా పంటల నమోదు చేపట్టాలి

దొనకొండ, ఆగస్టు 20: రైతులు సాగు చేసిన పంటల నమోదు కార్యక్రమంలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా పంట నమోదు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలోని పెద్దన్నపాలెం, గుడిపాడు గ్రామాల్లో జరుగుతున్న ఈపంట నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారి, వ్యవసాయ సహాయకులు, గ్రామ సర్వేయర్‌లతో కూడిన బృందాలు పంట పొలాన్ని సందర్శించి మాత్రమే ఈపంట నమోదు చేయాలన్నారు. కౌలుకు సాగు చేస్తున్న రైతులకు సీసీఆర్‌సీ కార్డుల ద్వారా సాగు చేస్తున్న పంటలను నమోదు చేస్తామన్నారు. ఏరోజు, ఏ సర్వే నెంబర్లల్లో పంట నమోదు చేయబోతున్నారో ఒక రోజు ముందుగానే రై తులకు తెలపాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సేవాకేంద్రం సిబ్బంది అరుణాదేవి, వీణకుమారి, రైతులు పాల్గొన్నారు.

సధరమ్

డబ్బు కొట్టు.. సర్టిఫికెట్ పట్టు..!



- భారీగా దివ్యాంగ పింఛన్ దొంగలు
- అడ్డగోలుగా నకిలీ వికలత్వ ధ్రువపత్రాలు
- వైసీపీ హయాంలో ఇష్టారీతిన జారీ
- ప్రభుత్వం నుంచి అనర్హులకు లబ్ధి
- మార్కాపురం డివిజన్‌లో వందల్లోనే ఉన్నట్లు సమాచారం
- అధికారులు దృష్టిపెడితేనే అడ్డుకట్టప

మార్కాపురం డివిజన్‌లో యథేచ్ఛగా నడిచిన దొంగ వైకల్య సర్టిఫికెట్ల దందా భారీగా నడిచింది. గత ప్రభుత్వంలో వైసీపీ నేతల అండదండలతో ఆ పార్టీ సానుభూతిపరులు, కార్యకర్తలు ఆరితేరిపోయారు. వైకల్యం లేకపోయినా ఉన్నట్లు దొంగ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కొందరు వైద్యులు కూడా అవినీతికి అలవాటు పడి విచ్చలవిడిగా జారీచేశారు. ఆ సర్టిఫికెట్లతో దివ్యాంగ పింఛన్‌ను తీసుకుంటూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఈ అక్రమాలపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

మార్కాపురం, ఆగస్టు 20: గత వైసీపీ పాలన సమయంలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తలు అనుచిత లబ్ధి పొందారు. వైకల్యం ఉన్నా లేకపోయినా, ఇష్టారీతిగా సదరమ్ సర్టిఫికెట్లు పొందారు. వాటిని అడ్డుపెట్టుకుని దివ్యాంగ పింఛన్‌ను అప్పనంగా కొట్టేశారు. ప్ర స్తుత కూటమి ప్రభుత్వం పెంచిన పింఛన్‌ను కూడా ఆరగించేస్తున్నారు. మార్కాపురం నియోజకవర్గం పరిధిలో గత ఐదేళ్లలో ఈ విధంగా వందలాది మంది దొంగ సర్టిఫికెట్లు పొంది రూ.లక్షల్లో ప్రజాధనాన్ని బొక్కేశారు. మార్కాపురం పట్టణంలో ఒక వైసీపీ కార్యకర్త దొంగ సర్టిఫికెట్‌తో అక్రమంగా పింఛన్ పొందుతున్నట్లు ఓ టీడీపీ కార్యకర్త ఆధారాలతో ఫిర్యాదుచేసినా పట్టించుకున్న నాథుడే లేడు. చివరికి కోర్టుకు వెళ్లి పోరాడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అనర్హులైన వారిని గుర్తించే పని కూటమి నాయకులు మొదలుపెట్టారు.

డబ్బులిస్తే క్షణాల్లో సదరమ్ సర్టిఫికెట్

మార్కాపురంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి గతంలో జిల్లా వైద్యశాలగా ఉండేది. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో జిల్లా వైద్యశాలలో ఆ పార్టీ నాయకులు చెప్పిందే వేదంగా కొందరు వైద్యులు పనిచేశారు. ముఖ్యంగా వికలత్వ సర్టిఫికెట్‌కు స్థాయిని బట్టి రూ.30వేల నుంచి రూ. 50వేల వరకు వసూలు చేసినట్లు తెలిసింది. ఈ అక్రమ వ్యవహారానికి వైద్యశాలలో ఒప్పంద పద్ధతిపై పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న ఓ వ్యక్తి చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. పేరుకు పారిశుధ్య కార్మికుడే అయినా ఆయన సూపరింటెండెంట్ వద్ద అనధికారికంగా సహాయకునిగా పనిచేస్తుండేవాడు. వైద్యులతో ఉన్న చనువును ఆసరా చేసుకొని ఎలాంటి వికలత్వం లేకపోయినా రూ.వేలల్లో వసూలు చేసి క్షణాల్లో సర్టిఫికెట్లు జారీ చేయించాడు. వాటిని అడ్డుపెట్టుకునే వందలాది మంది వైసీపీ సానుభూతిపరులు, కార్యకర్తలు పింఛన్లు పొంది ప్రజాధనాన్ని కొట్టేశారు. చివరకు ఆ ఒప్పంద ఉద్యోగి కూడా శాశ్వత వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్ పొంది ప్రభుత్వం నుంచి పింఛన్ పొందడం గమనార్హం. దొంగ సర్టిఫికెట్లతో ఇంత స్థాయిలో ప్రజాధనం లూటీ అవుతున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేకపోవడం గమనార్హం.

ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాథుడే లేడు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల నుంచి అధికారులకు అక్రమ పింఛన్లపై ఇప్పటికే కొన్ని వందల ఫిర్యాదులు అందాయి. అన్ని ఆధారాలతో సహా ఫిర్యాదులు చేసినా యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ప్రధానంగా గత వైసీపీ ప్రభుత్వంలో అంటకాగిన అధికారులే నేటికీ కీలక పోస్టుల్లో ఉండటంతో ఫిర్యాదులన్నీ బుట్టదాఖలవుతున్నాయి. మరీ ముఖ్యంగా మండలస్థాయిలో పింఛన్ల బాధ్యత చూడాల్సింది మండల పరిషత్తు అధికారులే. వారికి ఫిర్యాదులు అందింతే ఇవి తాము మంజూరు చేసిన సర్టిఫికెట్లు కావు కాబట్టి రెవెన్యూ, మెడికల్ డిపార్ట్‌మెంట్లకు ఫిర్యాదులు చేసుకోవాలని తప్పించుకుంటున్నారు. మెడికల్, రెవెన్యూ శాఖల దగ్గరకెళ్తే తమకేం సంబంధం లేదని తెగేసి చెబుతున్నారు.

వాస్తవానికి పింఛన్లు అందించే మండల పరిషత్తు అధికారులే ఫిర్యాదులు స్వీకరించి వారికి సమర్పించిన సర్టిఫికెట్లు సరైనవో, కావో విచారణ చేయాల్సిన బాధ్యత ఉంది. పట్టణ స్థాయిలో అయితే మున్సిపాలిటీది ఆ బాధ్యత. కానీ అధికారుల బదిలీలు లేకపోవడంతో గత ప్రభుత్వం నుంచి కొనసాగుతున్న అధికారులు కావడంతో ఫిర్యాదులను పట్టించుకోవడం లేదు.

అక్రమంపై దృష్టిసారించిన కూటమి నాయకులు

నియోజకవర్గంలో దొంగ సర్టిఫికెట్లతో దివ్యాంగ పింఛన్ పొందుతున్న వ్యవహారంపై కూటమి నాయకులు దృష్టిసారించారు. పట్టణంలో ఇప్పటికే వార్డుల వారీగా దివ్యాంగ పింఛన్ పొందుతున్న వారి వివరాలు సేకరించి విచారిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన పింఛన్లపైనే ఎక్కువగా దృష్టిసారించారు. చిన్నపాటి వైకల్యం ఉన్నా శాశ్వత అంగవైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్‌లు పొందిన వాళ్లు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆధారాలతో సహా అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

సక్రమంగానే పరీక్షలు జరుపుతున్నాం

- డాక్టర్ పి.సావిత్రి, సూపరింటెండెంట్

మార్కాపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నుం చి సక్రమంగానే సదరమ్ కేంద్రాలు నిర్వహిస్తు న్నాం. ముఖ్యంగా ప్రతి విభాగానికి అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు అందుబాటులో ఉన్నారు. అన్నివిధాలా పరీక్షించాకే సర్టిఫికెట్లు మంజూరు చేస్తున్నారు. గతంలో ఏమి జరిగిందో తెలియదు. జి ల్లా వైద్యశాలగా ఉన్నప్పుడు పలు ఆరోపణలు వచ్చాయి. ఈ మధ్యనే కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆ ఫిర్యాదుల విషయమై మాతో మాట్లాడారు.

పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి

- 23న అన్నిగ్రామ పంచాయతీల్లో గ్రామసభల నిర్వహణ
- ఉపాధి హామీ నిధుల అనుసంధానంతో పనుల ఆమోదానికి చర్యలు



ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 20 : గ్రామ పంచాయతీల్లో గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు నిలిచిపోయిన అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందుకోసం గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి ఉపాధి హామీ పథకం అనుసంధానంతో పనులను చేపట్టేందుకు అవసరమైన తీర్మానాలను చేసే విధంగా చర్యలు చేపట్టారు. జిల్లాలోని 730 గ్రామపంచాయతీల్లో అభివృద్ధితోపాటు గతంలో జరిగిన అనుసంధాన పనులను ప్రజలకు తెలిసే విధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ ఆదేశించారు. తదనుగుణంగా జిల్లా వ్యాప్తంగా ఈనెల 23వ తేదీన పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.

వైసీపీ హయాంలో నిధులు ఇవ్వక...

ప్రధానంగా గత వైసీపీ ప్రభుత్వం నిధులు ఇవ్వక గ్రామాల్లో అభివృద్ధి నిలిచిపోయింది. దీంతో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వ గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను రూపొందించేందుకు ఈ సభలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సభలో ఆ పంచాయతీ పరిధిలోని జనాభాలో కనీసం 30శాతం మంది పాల్గొనే విధంగా రెండు రోజుల ముందు విస్తృతంగా ప్రచారం చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గ్రామసభలో ఉపాధి హామీ పథకం అనుసంధానంతో చేపట్టే పనులను ప్రజలతో చర్చించి ఆమోదించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు గత ప్రభుత్వంలో ఆ గ్రామపంచాయతీల్లో చేపట్టిన పనులను కూడా ఆ గ్రామసభల్లోనే ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేసిన విధానాన్ని ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు కూటమి ప్రభుత్వంలో ఏ విధంగా అభివృద్ధి చేస్తామో తెలపాలని నిర్ణయించారు. మరోవైపు గ్రామ పంచాయతీలకు ఆదాయ వనరులను పెంచేందుకు తీసుకోవాల్సిన అంశాలపై కూడా ప్రభుత్వం దిశానిర్దేశం చేయడంతో అందుకు అనుగుణంగా గ్రామసభల్లో చర్చించనున్నారు. చెత్తసంపద కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేందుకు అవసరమైన ప్రణాళికలను కూడా ఈ గ్రామసభల్లో చర్చించనున్నారు. అందుకోసం పంచాయతీల వారీ తగిన ప్రణాళికలు రూపొందించేందుకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు.

నిర్లక్ష్యం మిగిల్చిన విషాదం

- కారు ఢీకొట్టిన ఘటనలో చిన్నపాప మృతి
- కోమాలో తల్లిదండ్రులు
- దిక్కుతోచని స్థితిలో పెద్దకుమార్తె



వెంకటేశ్వరరెడ్డి కుటుంబం(ఫైల్)

చీరాలటౌన్, ఆగస్టు 20 : రాఖీ పండుగ రోజు జాతీయ రహదారి రక్తసిక్తమైంది. కారు డ్రైవర్ నిర్లక్ష్యం ఓ కుటుంబాన్ని దిక్కుతోచని స్థితిలోకి చేర్చింది. వివరాల్లోకి వెళితే బాపట్ల జిల్లా పిట్లవానిపాలెం మండలం పిట్లువానిపాలెం గ్రామానికి చెందిన టంగు వెంకటేశ్వరరెడ్డి(40) సుమారు 15 ఏళ్ల కిందట చీరాల మండలం వాడరేవు పరిధిలోని కొత్తపాలెంకు చెందిన లలితతో వివాహం జరిగింది. వీరికి ఎనిమిదవ తరగతి చదువుతున్న రేణుక(13), 6వ తరగతి చదువుత్ను నందిని(12) సంతానం. భార్యాభర్తలు చినగంజాం పరిధిలో చెరువుల వద్ద కాపలా ఉంటూ పిల్లలిద్దరినీ చినగంజాం హైస్కూల్‌లో చదివిస్తున్నారు. ఆనందంగా సాగిపోతున్న వీరి జీవితాల్లోకి రోడ్డు ప్రమాదం విషాదం మిగిల్చింది.

పచ్చమొగిలిలో ఉంటున్న లలిత సోదరుడికి రాఖీ కట్టేందుకు ద్విచక్ర వాహనంపై కుటుంబమంతా పచ్చమొగిలి వచ్చారు. సోదరునికి రాఖీ కట్టి రాత్రి వరకు సంతోషంగా గడిపారు. తిరిగి ద్విచక్ర వాహనంపై చినగంజాం వెళ్లేందుకు పయనమయ్యారు. బయలుదేరిన 10 నిమిషాలకే వేటపాలెం జాతీయ రహదారిలోని నాయినిపల్లి వద్దకు వద్ద ఒంగోలు నుంచి చీరాల వైపు వస్తున్న కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా వస్తూ వీరిపైకి దూసుకొచ్చాడు. దీంతో సుమారు పది మీటర్లు అవతలికి ద్విచక్ర వాహనం ఎగిరిపడింది. ఈఘటనలో చిన్న కుమార్తె నందిని(12) అక్కడికక్కడే మృతిచెందింది. పెద్ద కుమార్తెకు స్వల్ప గాయాలు కాగా తల్లిదండ్రులు తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో పడి కోమాలోకి చేరారు. తండ్రి వద్ద ఉన్న ఫోన్ తీసుకుని రేణుక పచ్చమొగిలిలోని బంధువులకు చెప్పింది. అయితే ఈలోగా వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకుని చిన్న కుమార్తె మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. గాయాలైన ముగ్గురినీ చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు కుటుంబ సభ్యుల సహాయంతో తరలించారు. చిన్న కుమార్తె మృతదేహం చీరాల మార్చురీలో ఉండగా, తండ్రి గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో, పెద్ద కుమార్తె, లలిత మరో ఆసుపత్రిలో ఉన్నారు. భార్యాభర్తలిద్దరూ కోమాలో ఉండగా, వారి పరిస్థితి విషమంగానే ఉంది. దీంతో నందిని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన పోలీసులు బంధువులకు అప్పగించారు. అయితే కన్న బిడ్డ అంత్యక్రియలు విషయం తల్లిదండ్రులు తెలియని పరిస్థితిలో ఉండడం అందరినీ కలచివేసింది. ప్రమాదానికి కారుకుడైన కారు డ్రైవర్‌ను పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారు. అలాగే కారును సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సిద్ధం?

- 12 మందితో ఖరారు
- నేడో, రేపో వెల్లడించే అవకాశం



చీరాల ఏరియా వైద్యశాల

చీరాల, ఆగస్టు 20: చీరాల ఏరియా వైద్యశాల అభివృద్ధి సొసైటీ కమిటీ పేర్లు ఖరారైనట్లు విశ్వసనీయం సమాచారం. కమిటీలో 12 మంది పేర్లు ఉన్నట్లు తెలిసింది. ఆ వివరాలు రెండుమూడు రోజుల్లో వెల్లడించే అవకాశం ఉంది. హెచ్‌డీఎస్ (హాస్పటల్ డెవలప్‌మెంట్ సొసైటీ) కమిటీ ఏర్పాటుతో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

జిల్లాలోనే అత్యంత పెద్ద ప్రభుత్వ ఆసుపత్రి చీరాల దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ప్రభుత్వ ఆసుపత్రి. 100 పడకల సామర్థ్యం ఉన్న ఈ హాస్పటల్‌లో ప్రస్తుతం ఆర్థోపెడిక్ విభాగానికి సంబంధించి వైద్యుడు తప్ప మిగిలిన అన్ని విభాగాలకు వైద్యం అందుబాటులో ఉంది. ఆర్థోపెడిక్ విభానికి కూడా వైద్యురాలు వచ్చేందుకు అంగీకారం తెలిపినట్లు తెలిసింది. ఆ డాక్టర్ చేరితే ఎలుకలు, కీళ్ల విభాగానికి సంబంధించి ఇతర ప్రాంతాలకు రోగులకు పంపే అవసరం లేకుండా స్థానికంగా వైద్యసేవలు అందించేందుకు మార్గం సుగమం అవుతుంది. గుండె సంబంధిత వ్యాధుల విభాగం లేదు. అత్యవసర సేవలకు సంబంధించి స్టెమీ విధానం ద్వారా హార్ట్ ఎటాక్ వచ్చినవారికి సైతం ప్రాథమిక చికిత్స అందించి, తరువాత మెరుగైన వైద్యానికి చర్యలు చేపట్టే అవకాశం ఉంది. స్టెమీ పద్ధతిలో హార్ట్ ఎటాక్ వచ్చిన వ్యక్తికి వెంటనే రక్తాన్ని పలచబరిచే(గడ్డ కట్టకుండా) ఇంజక్షన్ ఇస్తారు. ఈసీజీ రిపోర్టు ఒంగోలు లేదా గుంటూరు ప్రభుత్వ మెడికల్ హాస్పటల్స్‌కు చేరుతుంది. ఆ ఇంజక్షన్ ఖరీదు సుమారు రూ.30వేలు ఉంటుంది. దానిని రోగికి ఉచితంగానే ఇస్తారు. ఏరియా వైద్యశాలకు ఉన్న వనరులను వినియోగించుకోవడంలో కొంత విఫలమవుతున్నారు. దీంతో మెరుగైన వైద్యం అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పాత భవనాలను పూర్తిగా వినియోగించుకుంటే ..

పాత ఆసుపత్రి భవనాలను పూర్తిగా మరమ్మతులు చేయించి వినియోగించుకుంటే రోగులకు ఎంతో సౌకర్యవంతమైన సేవలు అందించవచ్చు. అందుకు అనుగుణంగా వచ్చే హెచ్‌డీసీ కమిటీ తగిన బాధ్యతలు తీసుకోవల్సి ఉంటుంది. అప్పుడే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుతాయి.

హెచ్‌డీసీ కమిటీ ఎవరు..

మొత్తం 12 మందితో హెచ్‌డీసీ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. అందులో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చైర్మన్‌గా ఉంటారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుభాషిని, మున్సిపల్ చైర్మన్, ఆర్డీవో, ఏడీఎంహెచ్‌వో, ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్, ఇద్దరు సోషల్ వర్కర్లు (వీరిలో ఒకరు సోషల్ యాక్టివిస్ట్, వైద్యురాలు) హాస్పటల్ వైద్యులు ఒకరు, చారిటీస్ నుంచి ఒకరు, మరో వ్యక్తిగా వైద్యునిగా, టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధిగా అందరితో మమేకం అవుతున్న డాక్టర్ మహేంద్రనాథ్‌తో కలిపి మొత్తం 12 మందితో కమిటీకి తుది రూపం ఇచ్చినట్లు సమాచారం. ఒకటి అర పేరు మార్పు తప్పించి మిగతా కమిటీని నామినేట్ చేసే అవకాశం ఉంది.

మెరుగైన వైద్యసేవలు అందించటమే లక్ష్యం

- డాక్టర్ సుభాషిణి, సూపరింటెండెంట్, ఏరియా వైద్యశాల

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. హెచ్‌డీఎస్ కమిటీ ఏర్పాటు దాదాపు ఖారారైంది. వచ్చే వారంలోగా మొదటి సమావేశం కూడా నిర్వహించే ప్రణాళికతో అడుగులు వేస్తున్నాం. పాత ఆసుపత్రి భవనాన్ని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేచ్చేందుకు కమిటీ దోహదపడుతుందని భావిస్తున్నాం.

దోమల నియంత్రణపై డ్రోన్ యుద్ధం

మురుగునీటి కాలువల్లో స్ప్రే చేసి లార్వా నిర్మూలన

పారిశుధ్యం మెరుగుకు నగరంలో నూతన విధానం

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 20: పారిశుధ్యం మెరుగునకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పట్టణాలను పరిశుభ్రంగా ఉంచేందుకు, దోమల బెడదను పూర్తిస్థాయిలో తొలగించే ప్రక్రియను చేపట్టింది. ఈ మేరకు గత రెండు రోజులుగా ఒంగోలు నగరంలో మురుగుకుంటలు, ఖాళీస్థలాలు, అలాగే పోతురాజుకాలువలో పారిశుధ్య కార్మికుడు వెళ్లలేని ప్రాంతాల్లోకి డ్రోన్ల సహాయంతో స్ప్రేయింగ్ చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్ర పురపాలక శాఖ డైరెక్టర్ ఆదేశాలతో ఒంగోలులో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు పంట పొలాలకు డ్రోన్ల ద్వారా మందు పిచికారీ చేయగా, తొలిసారిగా, దోమల నియంత్రణకు ఈ చర్యలు చేపట్టారు. పోతురాజు కాలువ, గణపతినగర్, బిలాల్‌నగర్, ఇతర శివారు కాలనీల్లో డ్రోన్‌ద్వారా ఆయిల్ స్ప్రే చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. తద్వారా నిల్వ ఉన్న మురుగు నీటిలో లార్వా ఉత్పత్తి కాకుండా, క్షేత్రస్థాయిలోనే దోమలను నియంత్రించవచ్చని కార్పొరేషన్ అధికారులు వెల్లడించారు. ఈప్రక్రియ మరో రెండు, మూడు రోజులు జరుగుతుందని అధికారులు తెలిపారు.



ఇస్లాంపేటలో పోతురాజు కాలువపై డ్రోన్ ద్వారా దోమల మందును పిచికారీ చేస్తున్న సిబ్బంది

ముందు కట్టడి.. తరువాత కాంట్రాక్టు పద్ధతి

- ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు వ్యూహరచన
- దిబ్బలున్న వ్యక్తులతో బేరసారాలు
- పార్టీలతో పనేముంది.. కలిస్తేనే కాసులు
- అందరికీ సంధానకర్తగా వ్యవహరిస్తున్న వ్యక్తి
- తిరిగి దందా పునఃప్రారంభించేందుకు ఒప్పందాలు
- ఉచిత ఇసుక విధానం సాగేనా?


ఇసుక ట్రాక్టర్‌తోపాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న వేటపాలెం ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

చీరాల, ఆగస్టు 20 : నాలుగు రోజుల్లో చీరాల నియోజకవర్గంలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను ఒకే గొడుకు కిందకు తెచ్చేందుకు ఓ కీలక వ్యక్తి పావులు కదుపుతున్నాడు. ముందు కట్టడి చేద్దాం..తరువాత కాంట్రాక్టు పద్ధతిలో ముందుకు సాగుదామని చెప్తున్నాడు. ఇసుక దిబ్బలు ఎక్కడెక్కడ ఉన్నాయి. ఎవరి ఆధీనంలో ఎంత ఉన్నాయి. అందులో సొంతమెంత, అసైన్డ్ భూమి ఎంత, పార్టీలతో పనేముంది. మళ్లీ ఎన్నికలు వచ్చినప్పటి వరకూ మనకు తిరుగుండదని భావిస్తున్నాడు. ప్రస్తుతం సమిష్టిగా ఇసుక దందా సాగించి కాసులు కూడబెట్టుకుందామని ఆ కీలక వ్యక్తి సంపాదించుకుందామంటూ ఆ కీలక వ్యక్తి ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు సంబంధించి సంబంధీకులతో పార్టీలకు అతీతంగా చర్చలు జరుపుతున్నాడు. నాలుగైదు రోజుల్లో దందాను ఒకే గొడుగు కిందికి తెచ్చి పునఃప్రారంభించేందుకు పావులు కదపడంపై రాజకీయవర్గాలతో పాటు సామాన్య ప్రజల్లో చర్చనీయాంశమైంది. ఈ క్రమంలో చీరాల నియోజకవర్గంలో అసలు ఉచిత ఇసుక సరఫరా ఉంటుందా లేదా అని చర్చించుకుంటున్నారు.

అసలేం జరుగుతోంది..

216 జాతీయ రహదారి పక్కన వేటపాలెం, పందిళ్లపల్లి మధ్య భారీ అక్రమ ఇసుక కువ్వలు వైసీపీ హయాంలో ఉన్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం తెచ్చిన నేపథ్యంలో ఆ ఇసుకను కొనుగోలుదారులకు విక్రయించారు. ఆ ఇసుక అయిపోయిన తరువాత మరలా ఆ నిల్వ కేంద్రానికి సరఫరా లేదు. ఈ క్రమంలో అక్రమ తవ్వకాలు, రవాణా ఊపందుకున్నాయి. ఈ నెల 13న ఆంధ్రజ్యోతిలో ఆగని ఇసుక అక్రమ రవాణా అన్న శీర్షికన ప్రచురితమైన కథనంపై మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు స్పందించారు. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాను కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టారు. ఓ ఎక్స్‌కవేటర్ నిర్వాహకుడికి రూ.50వేలు అపరాధ రుసుము విధించారు. చీరాల నియోజకవర్గం ఈపురుపాలెం పరిధిలో జరిగిన అక్రమ తవ్వకాలకు సంబంధించి కొలతలు తీశారు. దీంతో పాటు ఈపురుపాలెంలోని మరో ప్రాంతంలోను, బోయినవారిపాలెం, కావూరివారిపాలెం, చల్లారెడ్డిపాలెం, పాపాయిపాలెం, గవినివారిపాలెం, పందిళ్లపల్లి, పర్చూరు నియోజకవర్గంలో మోటుపల్లి, కడవకుదురు పరిధిలో జరిగిన అక్రమ తవ్వకాలను లెక్కకట్టాల్సి ఉంది.

ఇప్పుడేం జరుగుతోంది..

మైనింగ్, రెవెన్యూ అధికారులు కలసి జాయింట్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. కట్టడికి ప్రయత్నం చేస్తున్నారు. వేటపాలెం ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఇటీవల తాను చార్జి తీసుకున్న తరువాత 5 అక్రమ ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. అందులో ఒకటి మంగళవారం తాజాగా పట్టుకున్నారు. ఇదిలావుంటే కీలకవ్యక్తి ఆచరణలోకి తీసుకొస్తున్న ఒకే గొడుగు కిందికి ఇసుక అక్రమ దందాను ప్రారంభించిన తరువాత కూడా ఇలాగే యంత్రాంగం పట్టుకుంటుందా లేదా వేచ్చి చూడాలి.

పార్టీలతో పనేముంది.. కలిస్తే తలో రూపాయి వస్తుంది

నియోజవకర్గంలో ఇసుక అక్రమ దందాను కలసి చేసుకుందాం. అలాచేస్తే నాలుగు రూపాయలు వస్తాయని ఆ కీలక వ్యక్తి రాయబేరాలు సాగిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అందులో ఇసుక దిబ్బలు ఉన్న ఒకరిద్దరు అంగీకారం తెలపగా, భారీగా ఇసుక దిబ్బలు ఉన్న ఒకరిద్దరు ధర దగ్గర మీనమేషాలు లెక్కిస్తున్నట్లు తెలిసింది. వారంతా గత ఎన్నికల్లో వైసీపీకి చేసిన వ్యక్తులు కావడంతో కూటమికి చెందినవారు ఆ అంశాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని బహిరంగంగానే తమ సన్నిహితుల వద్ద అంటున్నారు. అక్రమ ఇసుక దందాను కొనసాగించేందుకు ఆ కీలక వ్యక్తికి మద్దతు లభిస్తుందో.. లేక ఉచిత ఇసుక విధానం పారదర్శకంగా అమలు జరుగుతుందో వేచి చూడాల్సిందే.


నామ్ రోడ్డులో వెలగని సెంట్రల్ లైటింగ్

సెంట్రల్ లైటింగ్ నిర్వహణ అస్తవ్యస్తం

అద్దంకి, ఆగస్టు 20 : అద్దంకి పట్టణంలోని నామ్ రోడ్డులో ఉన్న సెంట్రల్ లైటింగ్ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. పట్టణంలోని నామ్ రోడ్డులో నల్లవాగు వద్ద నుంచి శింగరకొండ సమీపంలోని అభయాంజనేయస్వామి 99 అడుగుల విగ్రహం వరకు సుమారు 4 కి.మీ. దూరం సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. అయితే నిర్వహణపై శ్రద్ధ చూపకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. నిర్వహణ కొంత భాగం నామ్ రోడ్డు నిర్వహణ సంస్థ, మరి కొంత భాగం అద్దంకి మున్సిపాలిటీ వారు చేస్తున్నారు. దీంతో తరచూ పలు ప్రాంతాలలో లైట్లు వెలగడం లేదు. లైటింగ్ సరిగ్గా లేక పోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

వేటపాలెం(చీరాల), ఆగస్టు 20 : మినుము పైరులో మేలైన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు పాటించాలని ఏవో కాశీవిశ్వనాథ్ రైతులకు సూచించారు. మండలంలోని కొత్తపేట-3 రైతు సేవా కేంద్రం పరిధిలో సాగులో ఉన్న మినుము పైరును పరిశీలించారు. సాగులో తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో శివనాగబాబు, రైతులు పాల్గొన్నారు.

షర్మిలారాణికి డాక్టరేట్


షర్మిలారాణిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

అద్దంకిటౌన్, ఆగస్టు 20: అద్దంకిలోని కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకురాలు ఎన్.షర్మిలారాణికి ఆంధ్రాయూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. స్త్రీ రహస్యం, జైశ్రీ మిశ్రా ఎంపిక చేసిన నవలలను అధ్యయనం అంశంపై ఆమె చేసిన పరిశోధనలకు గాను ఏయూ పీహెచ్‌డీతో సత్కరించింది. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు డాక్టర్ ఎన్. షర్మిలారాణిని ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

వాహనం ఢీకొని యాచకుడి మృతి

మేదరమెట్ల, ఆగస్టు 20 : జాతీయ రహదారిలో తిమ్మనపాలెం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడు మృతిచెందాడు. మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో రోడ్డుపక్కగా వెళుతున్న యాచకుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో యాచకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మేదరమెట్ల ఎస్‌ఐ షేక్ మహ్మద్ రఫీ ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బారికేడ్లను ఢీకొని బైకిస్టు మృతి

మేదరమెట్ల, ఆగస్టు 20 : మేదరమెట్ల నార్కెట్ పల్లి రహదారిలో మేదరమెట్ల ఫ్లై ఓవర్ వద్ద రోడ్డు మళ్లింపు కోసం పెట్టిన ప్లాస్టిక్ బారిగేట్లను ఢీకొని మోటర్ సైకిలిస్టు మృతి చెందాడు. మంగళవారం వేకువజామునా అద్దంకి పట్టణం ఇందిరానగర్‌కు చెందిన షేక్ నాగూర్ బాషా మోటర్ సైకిల్‌పై అద్దంకి నుంచి ఒంగోలు వెళ్తూ ప్రమాదానికి గురయ్యాడు. బొడ్డువానిపాలెం వద్ద రోడ్డు మరమత్తులల్లో బాగంగా మళ్లింపు కోసం పెట్టిన ప్లాస్టింగ్ బారీ గేట్‌లను గుద్దుకుని కింద పడిపోయాడు. మొఖం రోడ్డుకు తగలడంతో అక్కడికి అక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని మేదరమెట్ల ఎస్‌ఐ షేక్ మహమ్మద్ రఫీ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మళ్లింపే ప్రమాదానికి కారణం

రోడ్డు మరమత్తుల కోసం గత వారం రోజులగా మళ్లింపు ఏర్పాటు చేసి ఒకే రోడ్డులో రాకపోకలు నిర్వహిస్తున్నారు. వేగంగా వచ్చే వాహనాలు ఒక్కసారిగా మళ్లింపు తీసుకోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు నిర్మాణ సంస్థ మరమ్మతు పనులు వేగంగా చేయకపోవడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయి. మళ్లింపుపట్ల తగిన జాగ్రత్తలు తీసుకుని ప్రమాదాలు జరగకుం డా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆరిఫ్ హత్య కేసులో మరో ఇద్దరు నిందితుల అరెస్టు

- కారు సీజ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ జగదీష్ నాయక్

చీరాలటౌన్, ఆగస్టు 20 : చీరాల మండలం ఈపూరుపాలెంకు చెందిన అమీన్ ఆరీఫ్ (18)ను హత్యకు పాల్పడిన వారిలో పరారీలో ఉన్న ఇద్దరు నిం దితులను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పటికే హత్యకు పాల్పడిన ఆరుగురు రిమాండ్ ఖైదీలుగా ఉండగా, స్థానిక పాపరాజుతోటకు చెందిన గరిక మహేంద్ర (ఏ2), రామకృష్ణాపురానికి చెందిన కర్రెద్దుల వంశీ(ఏ8)ని అరెస్ట్ చేశారు. డీఎస్పీ జగదీష్ నాయక్ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. అలాగే కారును సీజ్ చేసినట్లు చెప్పారు. కారుకు సైడ్ ఇవ్వలేదని ఈనెల 6వ తేదీన ఆరీఫ్‌ను అతి కిరాతకంగా హత్య చేశారని తెలిపారు. వేగవంతంగా చార్జిషీట్ వేసి నిందుతలకు శిక్ష పడేలా చూస్తున్నట్లు చెప్పారు. కేసును ఛేదించిన ఏఎస్పీ విఠలేశ్వర్, ఇతర సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

గేదెను ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

గేదె మృతి, యువకుడికి గాయం

వేటపాలెం(చీరాలటౌన్), ఆగస్టు 20 : ద్విచక్ర వాహనంతో గేదెను ఢీకొట్టడంతో మూగజీవి అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మంగళవారం రాత్రి వేటపాలెం జాతీయ రహదారిలో జరిగింది. ద్విచక్ర వాహనంపై ముగ్గురు యువకులు వేగంగా వెళ్తూ వైజంక్షన్ వద్ద గేదెను ఢీకొట్టారు. గేదె మృతి చెందగా బైకుపై ఉన్న వ్యక్తి కుడి కంటికి గాయమైంది. క్షతగాత్రుడిని 108లో ఏరియా వైద్యశాలకు తరలించారు. వేటపాలెం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కత్తెర పురుగు నివారణకు జాగ్రత్తలు


మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏవో వెంకటకృష్ణ

అద్దంకిటౌన్, ఆగస్టు 20 : మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు కార్బో ఫ్యూరాన్ 3జీ గుళికలు మొవ్వలో వేసుకోవాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. మంగళవారం మండలంలోని వెంపరాల గ్రామంలో సాగులో ఉన్న మొక్కజొన్నను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో వెంకటకృష్ణ మాట్లాడుతూ ఎకరాకు 4కేజీలు వేసుకోవాలని తెలిపారు. ప్రతి రైతు ఈ-పంటను సెప్టెంబర్ 15 కల్లా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆయనవెంట సచివాలయ సిబ్బంది, రైతులు ఉన్నారు.

నేడు మంత్రి గొట్టిపాటి పర్యటన

అద్దంకి, ఆగస్టు 20 : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం నియోజకవర్గంలోని పలు కార్యక్రమాలకు హాజరుకానున్నారు. ఉదయం 9-30 గంటలకు కొమ్మినేనివారిపాలెం, 10 గంటలకు వెంపరాల, 11 గంటలకు చక్రాయపాలెం, 11-30 గంటలకు అద్దంకి పట్టణంలోని 14వ వార్డు, 11-45 గంటలకు 2వ వార్డు, 12 గంటలకు చెరువుకొమ్ముపాలెంలో జరిగే కార్యక్రమాలకు మంత్రి హాజరవుతారు.


సదస్సులో పాల్గొన్న న్యాయవాదులు, అధ్యాపకులు

యాంటీ ర్యాగింగ్ చట్టాలపై అవగాహన

అద్దంకిటౌన్, ఆగస్టు 20 : విద్యార్థులందరూ యాంటీ ర్యాగింగ్ చట్టాలు, శిక్షలపై అవగాహన కలిగి ఉండాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ మోహనరావు అన్నారు. మంగళవారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ సెల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు మోహనరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాదులు షేక్ మహమ్మద్ రఫీ, అనూషా, బెంజిమెన్ యాంటి ర్యాగింగ్ చట్టాలు, వాటి ద్వారా పడే శిక్షలపై అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

చినగంజాం, ఆగస్టు 20 : గ్రామాల్లో నిర్వహించే ఉచిత పశు వైద్య శిబిరాలను పశు పోషకులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని చీరాల పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ చిట్టిబాబు అన్నారు. మండలంలోని చింతగుంపల్లి గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్, పశు సంవర్థక శాఖ సంయుక్తంగా ఉచిత పశు వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఉచిత పశు వైద్య శిబిరంలో 35 గేదెలకు, ఆవులకు చూడు పరీక్షలు, 27 గేదెలకు సాధారణ వైద్య పరీక్షలను డాక్టర్ చిట్టిబాబు, చినగంజాం పశువైద్యాధికారి బండ్ల కిరణ్ నిర్వహించారు. 25 దూడలకు ఎదుగుదలకు సంబంధించిన మందులను అందజేశారు. గేదెలకు వైద్య పరీక్షలు నిర్వహించి పశు పోషకలకు పలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి రత్నకుమార్ మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న సేవలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. రైతులు 18004198800 నెంబరకు ఫోను చేసి సూచనలు, సలహాలు నివృత్తి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెటర్నరీ విలేజ్ అసిస్టెంట్ టి.ఆదయ్య రైతులు, పశుపోషకులు పాల్గొన్నారు.

కోలలపూడిలో జింక కళేబరం


జింక కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

మార్టూరు, ఆగస్టు 20 : మండల పరిధిలో కోలలపూడి గ్రామ పొలాల్లో దాసరి శ్రీనుకు చెందిన మినప పంటలో చుక్కల దుప్పి (జింక) కళేబరం ఉన్నట్లు మంగళవారం తమకు సమాచారం వచ్చినట్లు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కే రమేష్ తెలిపారు. ఈ విషయమై సమాచారం అందడంతో ఆయన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. పొలంలో ఉన్న దుప్పి కళేబరాన్ని పరిశీలించారు. దాదాపుగా 10 రోజుల కిందట కుక్కల దాడిలో దుప్పి చనిపోయినట్లు భావిస్తున్నామని, దుప్పి కళేబరం పూర్తిగా పాడైపోయిందని రమేష్ తెలిపారు. గ్రామ సర్పంచ్ ఎం.సతీష్ కుమార్, వెటర్నరీ అసిస్టెంట్ అశ్వనిని, గ్రాపెద్దలను పిలిపించి, వారి సమక్షంలో కళేబరాన్ని దగ్ధం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో అన్నదానం


క్యాంటీన్‌లో భోజనం ఒడ్డిస్తున్న కరిముల్లా

అద్దంకి, ఆగస్టు 20 : నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ కరిముల్లా తన పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం అన్న క్యాంటీన్‌లో 300 మందికి భోజనాలను సమకూర్చారు. అక్కడ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతులు కల్పించాలి

- ప్రభుత్వ విద్యకు పూర్వవైభవం తీసుకురావాలి
- మంత్రి లోకేష్‌కు ఎమ్మెల్యే ఏలూరి విజ్ఞప్తి


మంత్రి లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, ఆగస్టు 20 : పాఠశాలల్లో మౌలిక వసతులకు పెద్దపీట వేసి ప్రభుత్వ విద్యకు పూర్వ వైభవం తీసుకురావాలని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు. మంగలవారం రాష్ట్ర సచివాలయంలో ఎమ్మెల్యే ఏలూరి విద్యా శాఖ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను మంత్రి లోకేష్ దృష్టికి ఆయన తీసుకువెళ్లారు. జగన్‌రెడ్డి పాలనలో విద్యా వ్యవస అంధకారంలో పడిందని ఏలూరి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస అవసరాలను కూడా వైసీపీ పాలకులు ఏర్పాటు చేయలేదన్నారు తెలుగు దేశం ప్రభుత్వం హయాంలో కోట్లాదిరూపాయలు ప్రభుత్వ స్కూళ్ల అభివృద్ధికి మంజూరు చేసిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక దానిని అమలు చేకుండా నిర్లక్ష్య వైఖరిని అనుసరించిందన్నారు. తక్షణమే నిధులు మంజూరు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించాలని ఏలూరి మంత్రిని కోరారు. మార్టూరు మండలంలో 3, యద్దనపూడి మండలంలో 1 ఎయిుడెడ్ పాఠశాలల్లో మరుగుదొడ్లతో పాటు కనీస వసతులు కూడా లేవని ఆయా పాఠశాలల్లో వెంటనే వసతులను ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేయాలన్నారు. యద్దనపూడి, మార్టూరు, పర్చూరు, ఇంకొల్లు మండలాల్లో జడ్పీ, ప్రాథమిక, హైస్కూళ్లలో ఉన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రధానంగా కొన్ని పాఠశాలలు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. ప్రహరీ గోడలు లేకపోవడంతో విద్యార్థులు విషసర్పాలకు భయపడుతున్నారని తెలిపారు. వర్షాకాలం సీజను ప్రారంభం కావడంతో కొన్ని పాఠశాలల్లో తరగతి గదులు వర్షపు నీటితో నిండిపోతున్నాయని, తక్షణమే వాటికి మరమ్మలు చేయించాలని మంత్రిని కోరారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. దానికి స్పందించిన మంత్రి లోకేష్ విద్యావ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభు త్వం కృషి చేస్తుందన్నారు. త్వరలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దూరం


ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

చినగంజాం, ఆగస్టు 20 : పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరి చేరవని పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.విజయభాస్కరరావు, పి.సాయిశ్రీచరణ్ అన్నారు. ప్రపంచ దోమల నియంత్రణ దినం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది చినగంజాం గ్రామంలోని ప్రధాన వీధులలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. దోమలు ఉత్పత్తి చేసే ప్రదేశాలను సమూలంగా నిర్మూలించాలని, ఆరోగ్యవంతమైన సమాజానికి శ్రీకారం చుట్టాలని వైద్యాధికారులు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి శుక్రవారం డ్రై డేని పాటించాలన్నారు. మలేరియా, డెంగ్యూతోపాటు దోమలతో వచ్చే వ్యాధులు దరిచేరవన్నారు. దోమలు పుట్టకూడదు, దోమలు కుట్టకూడదని నినాదాలు చేశారు. కార్యక్రమంలో చీరాల సబ్‌యూనిట్ అధికారి పి.శ్రీనివాసరావు, సీహెచ్‌వో ఝాన్సీరాణి, సూపర్‌వైజర్లు ఎం.చిరంజీవి, ఉల్లారాణి, పీహెచ్‌ఎన్ బేబీ, ల్యాబ్ టెక్నీషియన్ శ్యాంసుందరరావు, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి జంగమహేశ్వరపురం ఎస్టేట్ భూములపై సర్వే

మార్టూరు, ఆగస్టు 20 : కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని జంగమహేశ్వరపురం ఎస్టేట్ భూములపై ఈనెల 22,23,24 తేదీల్లో ప్రత్యేక బృందాలతో సర్వే నిర్వహిస్తామని వలపర్ల వీఆర్‌వో అశోక్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. జంగమహేశ్వరపురం పరిధిలో 2521 ఎకరాల ఎస్టేట్ భూములు ఉన్నాయన్నారు. రామకూరు, కొమ్మినేనివారిపాలెం, వలపర్ల, వల్లాపల్లి, ధర్మవరం గ్రామాలకు చెందిన రైతులు ఏళ్లుగా సాగు చేస్తున్నట్లు చెప్పారు. వారికి ఈ భూములలో యాజమాన్య హక్కు నిర్ధారణ కోసం సర్వే చేసేందుకు 8 ప్రత్యేక బృందాలను కేటాయించినట్లు తెలిపారు. ఆయా తేదీల్లో రైతులు అందుబాటులో ఉండి, అధికారులకు సహకరించాలని కోరారు.

కేశఖండనశాల ప్రారంభం


ప్రారంభిస్తున్న ఈవో సుభద్ర, దాతలు

అద్దంకి, ఆగస్టు 20 : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వద్ద దాతల సహకారంతో నిర్మించిన కేశ ఖండనశాలను మంగళవారం ప్రారంభించారు. కావలికి చెందిన నర్రా విజయ భాస్కర్ సూరత్‌లో శ్రీభాస్కర్ టెక్స్‌టైల్స్ క్లాత్ ఏజెన్సీస్ నిర్వహిస్తూ స్థిరపడ్డారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద రూ.17లక్షలలో కేశఖండనశాల నిర్మించారు. ఈవో సుభద్ర, దాతలు నర్రా విజయభాస్కర్, విజయలక్ష్మి దంపతులు మంగళవారం కేశఖండన శాలను ప్రారంభించారు.

ఎన్‌సీసీతో బంగారు భవిష్యత్


ఎన్‌సీసీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

వాడరేవు(చీరాలటౌన్), ఆగస్టు 20 : విద్యార్థి దశలో ఎన్‌సీసీతో శిక్షణ పొందినవారికి బంగారు భవిష్యత్ ఉంటుందని మేజర్‌లు అంజిరెడ్డి సుబేదార్, రేఖాసింగ్ అన్నారు. చీరాల మండలం వాడరేవు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎన్‌సీసీ యూనిట్‌ను ప్రారంభించా రు. అలాగే సంబంధిత జెండా ఆవిష్కరణ చేశారు. అధికారులు మాట్లాడుతూ ఎన్‌సీసీతో లక్ష్యాలపై మక్కువ పెరుగుతుందన్నారు. క్రమ శిక్షణ ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో రమేష్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఎన్‌సీసీ కేర్‌టేకర్ రామ్‌నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


చీరాలలో ర్యాలీ నిర్వహిస్తున్న అనిల్, శ్రేణులు

చీరాల, ఆగస్టు 20 : కోల్‌కతా ఘటనకు కారుకులైన నిందితులను వెంటనే శిక్షించాలని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్రా కమిటీ కన్వీనర్ ఆల అనిల్ అన్నారు. గడియార స్తంభం సెంటర్లో మంగళవారం రాత్రి జనసేన పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నేత ఆల అనిల్ తదితరులు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఎవరూ అలాంటి దుశ్చర్యలకు పాల్పడకుండా ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో జనసైనికులు, వీరమహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో గడియార స్తంభం సెంటర్లో మంగళవారం పలు కళాశాలల విద్యార్థులు మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా సభ్యురాలు భవాని, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు నాశిన మణికుమార్, కాకర్ల వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, వేముల వెంకటేష్ పాల్గొన్నారు.


పర్చూరులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

పర్చూరు : కోల్‌కతాలో హత్యాచారానికి పాల్పడిన మృగాళ్లను కఠినంగా శిక్షించాలని జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. పర్చూరులో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పెట్రోలు బంక్ నుంచి బొమ్మల సెంటర్ వరకు సాగిన ర్యాలీలో నినాదాలు చేశారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపూడి విజయకుమార్, పర్చూరు మండల పార్టీ అధ్యక్షుడు చిన్నకోట అజయ్, నాయకులు కారంపూడి సందీప్‌తేజ, కఠారి సురేంద్రబాబు, సాకిరి శ్రీనివాసరావు, అయ్యప్ప, శీలం కుమార్, బోగాది మోహన్, తోట మణి, రంగిశెట్టి ఆంజనేయులు, అచ్చికోలు సతీష్, తులసి చంటి, గ్రంధి రాజా, సుచంద్, కె.బసవేశ్వరావు, టి.వెంకటేష్ పాల్గొన్నారు.



ఆగ్రహ జ్వాల



కోల్‌కతా ఘటనలో నిందితుడు సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నర్సింగ్ విద్యార్థులు

నెల్లూరు (వైద్యం) : కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ జిల్లావ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయి. మంగళవారం రాత్రి నెల్లూరు నగరంలో 24 కళాసంఘాల ఆధ్వర్యంలో నర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. కాగడాలు చేతబట్టి వీఆర్‌సీ నుంచి గాంధీబొమ్మ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఈ కేసులో ముద్దాయి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. భరతమాత వేషధారణలో ఓ విద్యార్థిని పాల్గొనడం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళాంజలి ఆర్కెస్ట్రా నిర్వాహకుడు శ్రీనివాస చక్రవర్తి మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఇంతవరకు అసలైన నిందితులను పట్టుకోకపోవటం సిగ్గుచేటని, పైగా కేసును సీబీఐకి అప్పగించడం ఆ ప్రభుత్వ పనితీరును ప్రశ్నిస్తోందని మండిపడ్డారు.


● **గళం విప్పిన జూడాలు**

జూనియర్ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో జూడాలు కూడా ప్రభుత్వం జనరల్ ఆసుపత్రి నుంచి మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. సెల్‌ఫోన్ లైట్లు వేసుకుని ప్లకార్డులు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. కోల్‌కతా ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీ జూనియర్ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు జునాయిద్ ఆలీ అహ్మద్, ప్రధాన కార్యదర్శి పీరస్ జోయల్, కార్యదర్శి హితేష్ యాదవ్, ఉపాధ్యక్షులు ఉత్తమ్‌కుమార్, రాజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులు తేజస్విని, అబిద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

తాళికట్టు శుభవేళ!

- మోగుతున్న పెండ్లిబాజాలు ● ఈ శ్రావణంలో పెళ్లిళ్లే.. పెళ్లిళ్లు
- నెలాఖరులోపు 50 వేలకుపైగా కల్యాణాలు ● మండపాలకు డిమాండ్
- ఆకాశానికి అంటిన ధరలు ● మధ్య తరగతిపై పెనుభారం






శ్రావణ మాసం వ్రతాలు, పూజలకే కాదు పెళ్లి సందడికీ ప్రత్యేకం. మంచి ముహూర్తాలు ఉండటంతో ప్రస్తుత మాసంలో జిల్లాలో పెద్ద సంఖ్యలో పెళ్లిళ్లు జరుగుతున్నాయి. ఇప్పటికే ఈ నెల 18వ తేదీన భారీ ఎత్తున పెళ్లిళ్లు జరగ్గా, రాబోవు 21, 22, 23, 24, 26, 28, 29, 30, 31తేదీల్లో శుభలగ్నాలను పండితులు నిర్ణయించడంతో ఆయా ముహూర్తాలకు కూడా పెళ్లిళ్లు అత్యధికంగా జరగనున్నాయి. జిల్లాలో 50 వేలకుపైగా వివాహాలు జరిగే అవకాశం ఉందని అంచనా. ఈ క్రమంలో పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా అన్నిచోట్ల సందడి నెలకొంది. పెళ్లి పెద్దలు కల్యాణ మండపాలు, పూల డెకరేషన్లు, భజంత్రీలు, పురోహితులు, ఫొటో, వీడియో షూటింగ్, భోజనాలు, విద్యుత్ డెకరేషన్ వంటి వాటిని విడివిడిగా బుక్ చేసుకుంటున్నారు. కొన్ని కల్యాణ మండపాలు వారు ప్యాకేజీలు ప్రకటించి అన్ని ఏర్పాట్లు వారే చేస్తున్నారు. అయితే పెద్ద సంఖ్యలో పెళ్లిళ్లు జరుగుతుండటంతో కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లకు డిమాండ్ పెరిగి రేట్లు చుక్కలను చూపిస్తున్నాయి. ధరల పెరుగుదల వల్ల పెళ్లిళ్లకు సిద్ధపడ్డ మధ్య తరగతి కుటుంబాలపై అధిక భారం పడుతోంది. సగటున రూ.4లక్షల నుంచి రూ.6లక్షల వరకు ఖర్చు భరించాల్సి వస్తోంది. ఇవికాకుండా బంగారు నగలు, పెట్టుపోతలకు మరికొంత ఖర్చు చేయకతప్పదు. అయినప్పటికీ జీవితంలో వివాహ వేడుక ఒక్కసారే వస్తుంది కదా.. అనే ఉద్దేశంతో అప్పు చేసైన పెళ్లి ఘనంగా చేయడానికి ఎక్కువ మంది సిద్ధపడుతున్నారు. ఇక ధనవంతుల ఇళ్లలో అయితే పెళ్లి వేడుకకు వారి స్థాయిని బట్టి రూ.కోటి వరకు కూడా ఖర్చు చేస్తున్నారు.

● **కార్మికులకు చేతినిండా పని**

పెళ్లిళ్ల సీజన్ వస్తే ఆ వేడుకలపై ఆధారపడ్డ సుమారు 36 రకాల కార్మికులకు చేతినిండా పని ఉంటోంది. అందుకు అనుగుణమైన వ్యాపారులు కూడా పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. ముఖ్యంగా వస్త్రాభరణాల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఒకే నెలలో వేలాది వివాహాలు జరుగుతుండడంతో స్థానికంగానూ, జిల్లాలో ఉండే కార్మికులు, క్యాటరింగ్, భజంత్రీలు, పురోహితులు సరిపోక చెన్నై, తెలంగాణ, ఉత్తర కోస్తా జిల్లాల నుంచి పిలిపించుకుంటున్నట్లు వివాహ కాంట్రాక్టర్లు చెబుతున్నారు. మొత్తంగా ఈ శ్రావణ మాసంలో పీపీపీ.. డూడూడూ అంటూ జిల్లా అంతటా పెళ్లిబాజాలు మోగుతున్నాయి.

- నెల్లూరు (సాంస్కృతికం)



భూ దస్త్రం.. నిఘా నేత్రం!

రెవెన్యూ కార్యాలయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆదేశం

ఎందుకు చేస్తున్నారో.. ఎవరి కోసం చేస్తున్నారో లేదా తమ గుట్టు రట్టవుతుందని చేస్తున్నారో తెలియదు కానీ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. కారణాలు ఏవైనా ఈ ఘటనలలో విలువైన రికార్డులు దగ్ధమవుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించింది. వెంటనే అన్ని రెవెన్యూ కార్యాలయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది.

వరుస అగ్నిప్రమాదాల ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్



నెల్లూరు : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో..

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 20 : ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అగ్ని ప్రమాదాల్లో రికార్డులు దగ్ధమవుతుండటంతో అసైన్డ్ భూముల వ్యవహారం చర్చనీయాంశమైంది. 20 ఏళ్లు దాటిన అసైన్డ్ భూములను విక్రయించుకోవచ్చని వాటిని ఫ్రీహోల్డ్ చేస్తున్నట్లు జగన్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ ముసుగులో వైసీపీ నాయకులు రైతులతో ఒప్పందం కుదుర్చుకొని భూములను వారి పేరిట మార్చుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ నేతల సూచనలతో 22-ఏ జాబితా నుంచి తప్పించి రిజిస్ట్రేషన్లు చేశారనే విమర్శలు ఉన్నాయి. జిల్లా రెవెన్యూ శాఖ నుంచి ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి 7వేల ఎకరాలను రిజిస్ట్రేషన్ చేయవచ్చని ఆ శాఖకు నివేదిక అందింది. దీని ఆధారంగా సబ్ రిజిస్ట్రార్లు వింజమూరు, ఆత్మకూరు, ఉదయగిరి ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు చేశారు. అయితే, ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి 147 ఎకరాలు మాత్రమే రిజిస్ట్రేషన్లు జరిగాయి. మళ్లీ వైసీపీ ప్రభుత్వమే వస్తుందన్న ధీమాతో మిగిలిన ఫ్రీహోల్డ్ భూములను కూడా రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని చూసిన వైసీపీ నేతలకు నిరాశే మిగిలింది. రిజిస్ట్రేషన్ శాఖపై ప్రభుత్వం దృష్టి సారించడంతో ఆ శాఖ ఐజీ ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లపై నివేదిక కోరారు. దీంతో రిజిస్ట్రేషన్ చేసిన భూములపై జిల్లా అధికారులు విచారిస్తున్నారు.

● **రిజిస్ట్రేషన్ శాఖపైనే నిఘా**

ఇలాంటి అంశాల దృష్ట్యా రిజిస్ట్రేషన్ల శాఖపై ప్రభుత్వం గట్టి నిఘా పెట్టింది. ఆయా కార్యాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందడంతో రిజిస్ట్రార్ కార్యాలయంతోపాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సీసీ కెమెరాలను అమర్చుతున్నారు. ముఖ్యంగా దస్తావేజు రిజిస్టర్లు భద్రపరిచే గది మార్గంలో నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సబ్ రిజిస్ట్రార్ కుర్చీ దగ్గర, కంప్యూటర్ల గది, కార్యాలయ ప్రధాన ద్వారాల వద్ద కూడా ఏర్పాటు చేస్తున్నారు.



నెల్లూరు : అర్బన్ తహసీల్దారు కార్యాలయంలో కానరాని సీసీ కెమెరాలు

● **కలెక్టరేట్‌లో..**

కలెక్టరేట్‌లో అత్యంత విలువైన రికార్డులతోపాటు బ్రిటీష్ కాలంనాటి భూవివరాలు తెలిపే రికార్డులు ఉంటాయి. అలాగే చుక్కల భూములు, అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూముల వివరాల రికార్డులు కలెక్టరేట్‌లోనే ఉన్నాయి. ఈ రికార్డుల ఆధారంగానే రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు రిజిస్ట్రేషన్లు చేస్తుంటారు. దీంతో కలెక్టరేట్‌లో ప్రధాన రికార్డులు భద్రపరిచే గది, కార్యాలయం లోపల, వెలుపల సీసీ కెమెరాలను అమర్చుతున్నారు. నెల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో రికార్డులను భద్రపరిచే గది వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

● రెవెన్యూ శాఖలో భాగమైన భూసర్వేశాఖలో విలువైన రికార్డులు ఉన్నాయి. వీటిని ప్రత్యేక గదులలో భద్రపరిచి ఉండగా ఇక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కొన్ని రోజులుగా పని చేయడం లేదు. నెల్లూరు అర్బన్ తహసీల్దారు కార్యాలయం లోనూ సీసీ కెమెరాలు పని చేయడం లేదు. వీటిపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతోనే అవి మరమ్మతులకు గురైనట్టు సమాచారం.



కలెక్టరేట్‌లోని రికార్డు గదిలో సీసీ కెమెరాలు

ఇదిగో స్మార్ట్ మీటర్!

● తొలిగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు : ఎస్‌ఈ



స్మార్ట్ మీటర్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ) ఆగస్టు 20 : జిల్లాలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు విద్యుత్ శాఖ ఎస్‌ఈ విజయన్ తెలిపారు. మంగళవారం నగరంలోని తెలుగుగంగ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కార్యాలయంలో స్మార్ట్ మీటరును ఏర్పాటు చేశారు. ఈ మీటరును అమర్చిన అనంతరం ఎస్‌ఈ మాట్లాడుతూ తొలివిడతగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆ తర్వాత జిల్లా అంతటా విస్తరిస్తామని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు అశోక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

నెల్లూరు (విద్య) : విధుల్లో అలసత్వంతోపాటు పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ డీఈవో రామారావు ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరులోని కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్లు ఆర్‌వీ ప్రసన్నలక్ష్మి, ఎల్ శ్రీనివాసరావు విధుల్లో అలసత్వం వహించడమేకాక బాధ్యతారహితంగా ప్రవర్తిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. వీటిపై నెల్లూరు డిప్యూటీఈవో విచారించి, నివేదిక అందచేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ టీచర్లను సస్పెండ్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఈ ఉపాధ్యాయులపై కొన్ని రోజుల క్రితం విద్యార్థులే కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసిన విషయం గమనార్హం.

తీగ లాగితే డొంక కదిలేనా!?

- జగనన్న ఇళ్ల నిర్మాణంపై విజిలెన్స్ విచారణ
- కావలిలో 8 మంది సభ్యుల పరిశీలన

కావలి, ఆగస్టు 20 : జగనన్న లేఅవుట్లలోని ఇళ్ల నిర్మాణాల్లో చోటు చేసుకున్న అవినీతిని నిగ్గు తేల్చేందుకు మంగళవారం విజిలెన్స్ విచారణ ప్రారంభమైంది. జిల్లాలో అత్యధికంగా కావలి పట్టణంలోనే 6,700 ఇళ్లు మంజూరు కావడంతో వాటి కోసం భూముల కొనుగోళ్లు, లేఅవుట్ల లెవలింగ్, లబ్ధిదారుల ఎంపిక, స్టీలు, సిమెంట్ మాయం, ప్రభుత్వం సరఫరా చేసిన ఇసుక అమ్ముకుని సముద్రపు ఇసుకతో నిర్మాణాలు, పనులు పూర్తి చేయకనే బిల్లులు తీసుకోవడం ఇలా కాలనీల్లో అడుగడుగునీ అవినీతి చోటుచేసుకుందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారాలపై పత్రికల్లో కథనాలు రావడమేగాక ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించడంతో విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. 8 మంది సభ్యులు గల అధికారుల బృందం ముసునూరు మెగా లే అవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది.



ముసునూరు మెగా లేఅవుట్‌లో జగనన్న ఇళ్లను పరిశీలిస్తున్న విజిలెన్స్ బృందం

● **విచారణ పారదర్శకంగా జరిగేనా!?**

జగనన్న లేఅవుట్లు, ఇళ్ల నిర్మాణాలపై విజిలెన్స్ విచారణ పారదర్శకంగా జరిగేనా అన్న అనుమానాలు రేగుతున్నాయి. గతంలో కొద్దిపాటి వర్షానికే కొన్ని ఇళ్ల గోడలు కూలిపోగా అప్పట్లో కూడా విజిలెన్స్ అధికారులు విచారించారు. అయితే, చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అప్పట్లో వైసీపీ అధికారంలో ఉండటం, కాంట్రాక్టర్లు వైసీపీ నాయకులే కావడంతో గుట్టు చప్పుడు కాకుండా సర్దుబాటు చేశారు. ప్రస్తుతం ఎన్డీఏ కూటమి అధికారంలో ఉండటంతో జరిగిన అక్రమాలపై ఏకపక్షంగా విచారణ జరిపేందుకు వీల్లేదని, అవినీతి అక్రమాలు బయటకు వస్తాయనే నమ్మకం ప్రజల్లో ఉంది.


ఆసుపత్రులకు అత్తెసరు నిధులు

- ఎన్‌హెచ్‌ఎం ద్వారా రూ.56 లక్షల విడుదల
- పీహెచ్‌సీలకు రూ. 50వేలు
- సీహెచ్‌సీ, ఏరియా ఆరోగ్య కేంద్రాలకు రూ. 2.50 లక్షలు
- జిల్లాకు ఏటా రూ. 25 కోట్లు రావాలి
- మరి మిగతా నిధులు ఎప్పుడొస్తాయో..?

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 20 : జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల నిర్వహణకు జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ద్వారా ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఆసుపత్రుల్లో అత్యవసర మందులతోపాటు మరమ్మతులు, చిన్నచిన్న పరికరాలు, పరిసరాల పరిశుభ్రతకు ఈ నిధులే ఆధారం. ఏప్రిల్‌లోనే ఈ నిధులు రావాల్సి ఉన్నా సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆలస్యమై తాజాగా విడుదలయ్యాయి. అయితే ఆశించిన, అవసరమైన స్థాయిలో కాకుండా అత్తెసరుగా నిధులివ్వడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రతి ఏడాది జాతీయ ఆరోగ్య మిషన్ కింద జిల్లాలోని ఆసుపత్రు నిర్వహణకు రూ.1.51 కోట్లు, ఉద్యోగుల జీతభత్యాలతో కలిపి రూ.25 కోట్లు రావాల్సి ఉండగా ప్రస్తుతం రూ.56 లక్షలు మాత్రమే విడుదల అయ్యాయి. వాటిని కూడా ఆసుపత్రుల నిర్వహణ కోసమే విడుదల చేసింది, మిగిలిన నిధులు ఎప్పుడు ఇస్తుందోనని వైద్య వర్గాలు పెదవి విరుస్తున్నాయి.

పీహెచ్‌సీలకు కేవలం రూ. 50 వేలే

జిల్లా వ్యాప్తంగా 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా ఒక్కోదానికి రూ.1.75 లక్షలు ఇవ్వాల్సి ఉండగా రూ.50 వేల వంతున రూ.26 లక్షలు మాత్రమే కేటాయించారు. ఇదేవిధంగా 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలకు ఒక్కోదానికి రూ. 5 లక్షలు ఇవ్వాల్సి ఉండగా రూ. 2.50 లక్షలు మాత్రమే ఇచ్చింది. కావలి, కందుకూరులోని ఏరియా ఆసుపత్రులకు కూడా రూ. 5 లక్షలకుగాను రూ. 2.50 లక్షలే విడుదల చేసింది. ఇక ఆత్మకూరు జిల్లా ఆసుపత్రికి రూ. 10 లక్షలు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ. 5 లక్షలు ఇచ్చింది. ఇంత తక్కువ నిధులతో ఆసుపత్రులను ఎలా నిర్వహిస్తామని వైద్యాధికారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



ఉద్యోగుల జీతాలు, ఇతర ఖర్చులు ఎలా?

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వందలాది మంది ఉద్యోగులు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. వీరి జీతభత్యాలు జాతీయ ఆరోగ్య మిషన్ నుంచి ఇవ్వాల్సి ఉంటుంది. అయితే తగినన్ని నిధులు విడుదల చేయకపోవటంతో ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపు ఆగమ్య గోచరంగా మారుతోంది. దీంతోపాటు వైద్యాధికారులు వాహన అలవెన్స్, ఇతర ఖర్చులకు కూడా ఎన్‌హెచ్‌ఎం నిధులే ఖర్చు చేయాల్సి ఉంది. అయితే నిధుల కొరత వల్ల ఉద్యోగులు నానా అగచాట్లు పడుతున్నారు. ఎన్‌హెచ్‌ఎంలో కేంద్రం వాటాగా ఇచ్చే 60 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుతుండటం వల్లే ఈ పరిస్థితి వస్తోందని ఆరోపిస్తున్నారు. నిధుల లేమితో ఆసుపత్రుల్లో వైద్య సేవలు కూడా కుంటుపడుతున్నాయి.

వచ్చిన నిధులనే ఆసుపత్రులకు ఇచ్చాం

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులనే ఆయా ఆసుపత్రులకు ఇచ్చాం. పూర్తి స్థాయిలో నిధులు కేటాయించ లేకపోయాం. ఆసుపత్రుల నిర్వాహణ కోసమే ఈ నిధులు విడుదల చేయటం జరిగింది. మిగిలిన నిధులు ఎప్పుడు వస్తే అప్పుడు పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా, జిల్లా ఆసుపత్రులకు పూర్తి స్థాయిలో కేటాయిస్తాం.

- డాక్టర్ పెంచలయ్య,
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

హనుమంతుడిపై వెంకయ్య స్వామి

వెంకటాచలం : గొలగమూడిలో వెంకయ్య స్వామి ఆరాధనోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. 3వ రోజు మంగళవారం ఉదయం స్వామివారు హనుమంతుడిపై విహరించారు. వివిధ రకాల పూలతో అలంకరించిన హనుమంత వాహనంపై కొలువైన వెంకయ్య స్వామిని చూసేందుకు రెండు కళ్లు చాలవన్నట్లుగా భక్తులు పులకించిపోయారు. రాత్రి హంస వాహనంపై విహరించగా, భక్తులు కాయ, కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కాగా, బుధవారం వెంకయ్యస్వామి చినశేష, గజవాహనాలపై విహరిస్తారని ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.



పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టండి

● జిల్లా అధికారులకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి శరవేగంగా అనుమతులు ఇవ్వాలని సూచించారు. భారీ పరిశ్రమలకు అవసరమైన భూ సేకరణ, నీటివసతి, విద్యుత్ మౌలిక సదుపాయాలు కల్పన తదితర విషయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అదేవిధంగా పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు వేతనాలు, సంక్షేమ పథకాల లబ్ధిపై సర్వే చేయాలన్నారు. నూతనంగా పరిశ్రమలు స్థాపించే వారికి పీఎంఈజీపీ పథకం గురించి వివరించాలన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం సుధాకర్, ఏపీఐఐసీ జెడ్ఎం విజయరత్నం, విద్యుత్ శాఖ అధికారి విజయన్, కాలుష్య నియంత్రణ అధికారి రాజశేఖర్, కార్మిక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లు.. అరకొర నిర్మాణాలు

- నియోజకవర్గానికి మంజూరైన గృహాలు 7,833.. పూర్తయినవి 1,302
- వాటిలోనూ నాసిరకం నిర్మాణాలు
- వివిధ దశల్లో మిగిలినవి..



ఆత్మకూరు అర్బన్ పరిధిలోని పమిడిపాడు వద్ద లేఅవుట్లలో బేస్‌మెంట్ స్థాయిలోనే ఆగిన పక్కాగృహాలు

ఆత్మకూరు, ఆగస్టు 20: పేదలందరికీ పక్కా ఇళ్లు నిర్మిస్తామని వైసీపీ ప్రభుత్వం బీరాలు పలికింది. ఇళ్ల పథకం కింద లేఅవుట్లు వేసింది. భూములు అందుబాటులో లేని కొన్నిచోట్ల ప్రైవేటుగా భూ ములు కొనుగోలు చేసింది. ఈ క్రమంలో కొందరు వైసీపీ నేత లు రంగప్రవేశం చేసి అధిక ధరలకు కొనుగోలు చేశారు. మరికొన్ని ప్రాంతాల్లో అనువుగా ని చోట ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు. దీంతో ఇళ్ల నిర్మాణాలు అరాకొరగానే మిగిలిపోయాయి.

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో..

మొత్తం 7833 ఇళ్లు మంజూరయ్యాయి. అందులో కేవలం 1302ఇళ్లు మా త్రమే పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. ఆత్మకూరు అర్బన్‌లో మినహా మిగిలిన అన్ని మండలాల్లో 10శాతం ఇళ్లు పూర్తయిన దాఖ లాలు లేవు. కాలనీల్లో మౌలిక వసతులు కల్పించడంలో గత ప్రభుత్వం విఫలమైంది. అంతర్గత రోడ్లు, మురుగు కాలువలు పూర్తిస్థాయిలో నిర్మాణానికి నోచుకోలేదు. విద్యుత్ సౌకర్యం అంతంత మాత్రంగానే ఉంది. పలు కాలనీల్లో కంపచెట్లు పెరిగిపోయి అధ్వానంగా తయారయ్యాయి.

మండలం	మంజూరైన ఇళ్లు	పూర్తయినవి
ఏఎస్‌పేట	1094	51
అనంతసాగరం	1070	83
ఆత్మకూరు రూరల్	572	68
చేజర్ల	1011	44
మర్రిపాడు	948	48
సంగం	859	43
ఆత్మకూరు అర్బన్	2279	965
మొత్తం	7833	1302

నాసిరకంగా నిర్మాణాలు

నియోజకవర్గంలో 2095పక్కాగృహాలను 23మంది కాంట్రాక్టర్లు నిర్మిస్తున్నా రు. వీటిలో కేవలం 68ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. కిటికీలు, స్లాబ్ స్థాయి లో 412, స్లాబ్‌లు వేసినవి 82ఉన్నాయి. బిలో బేస్‌మెంట్ స్థాయిలో 104, ప్లింత్ బీమ్ స్థాయిలో 94, లెంటల్ లెవల్‌లో 73ఉన్నాయి. వారు నిర్మించిన పక్కా గృహాలు నాసిరకంగా ఉన్నా యని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీ పీ నాయకులే కాంట్రాక్టర్లు కావడంతో కొన్ని కాలనీ ల్లో సిమెంట్ రాళ్లతో పునాదులు కట్టారు. ఆ రాళ్లు నాసిరకంగా ఉండడంతో చాలాచోట్ల దెబ్బతిన్నాయి. ప్రభుత్వం మారడంతో కాంట్రాక్టర్లు పనులు అర్ధాంతరంగా ఆపేశారు. ఈ పనుల నాణ్యతపై థర్డ్ పార్టీ పరిశీలన నామమాత్రంగా సాగిందని విమర్శలు న్నాయి. ప్రస్తుతం విజిలెన్స్ అధికాకారులు విచారణ చేయనున్నారు. విచార ణలో ఏ మేరకు అక్రమాలు వెలుగు చూస్తాయో వేచి చూడాల్సి ఉంది.

మొక్కుబడిగా మర్రిపాడు మండల సమావేశం



ప్రగతి నివేదికను చదివి వినిపిస్తున్న ఏపీవో నారాయణ

మర్రిపాడు, ఆగస్టు 20: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సా గింది. పలు శాఖల అధికారులు సమావేశానికి డుమ్మాకొట్టారు. కేవలం పంచాయతీ కార్యదర్శులు మాత్రమే ఉన్నారు. ఎక్కువ మంది ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వైసీపికి చెందిన సభ్యులు కావటంతో వారు సమావేశాలకు, ఇతర కార్యక్రమాల్లో పాల్గొనటం లేదు. మూడునెలలకు ఒకసారి తప్పక మండల సమావేశం నిర్వహించాల్సి ఉండటంతో ఈవోపీఆర్డీ మస్తాన్‌ఖాన్ సమావేశాన్ని నిర్వహించారు. ఏపీవో, ఇరిగేషన్ శాఖల అధికారులు ప్రగతి నివేదికను చదివి వినిపించారు.

యూనిఫాం పంపిణీ



విద్యార్థులకు యూనిఫాంలను అందజేస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి

ఆత్మకూరు, ఆగస్టు 20: మున్సిపాలిటీ పరిధిలోని వెంకట్రావుపల్లి ఎస్టీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 36మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి మూడుజతల యూనిఫాంలను మంగళవారం సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకొని తమ పిల్లలను బాగా చదివించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యుడు రాంపల్లి ప్రసాద్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంటింటా సర్వే చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు సుభద్ర

ఉదయగిరి రూరల్, ఆగస్టు 20: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని బూత్ లెవల్ అధికారులు ఈ నెల 20నుంచి అక్టోబరు 18వరకు ఇంటింటా సర్వే చేపట్టాలని తహసీల్దారు సుభద్ర తెలిపారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో బీఎల్‌వోలతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఇంటింటా సర్వేలో భాగంగా 18ఏళ్లు నిండిన వారు ఓటుహక్కు దరఖాస్తు చేసుకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. డోర్ నెంబర్ జీరో ఉన్న వాటిని సరి దిద్దాలన్నారు. కార్యక్రమంలో డీటీ జహీర్‌ఖాన్, సీ నియర్ అసిస్టెంట్ సందానీ, వీఆర్వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్య దారుణం

- కొవ్వొత్తుల ర్యాలీలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక కమిటీ సభ్యులు



ఉదయగిరి రూరల్: కొవ్వొత్తుల ర్యాలీలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక కమిటీ సభ్యులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 20: కోల్‌కతా మెడికల్ విద్యార్థిని అత్యాచారం, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో కొవ్వొత్తులు ప్ర దర్శిస్తూ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రోజ్‌ధార్ మన్సూర్, కాకు వెంకటయ్య, బకీరు జాషువా, షేక్ ఎండీ ఖాజా, మన్సూర్‌అలీ, బాలగురవయ్య తదితరులు పాల్గొన్నారు.

సంగం: కోల్‌కతా వైద్యురాలిపై హత్యా కాండను నిరసిస్తూ జనసేన నాయకులు నిరసన చేపట్టారు. స్థానిక హైస్కూల్ సెంటర్ నుంచి విద్యార్థులతో కలిసి ర్యాలీగా బస్టాండ్ సెంటర్‌కు చేరుకుని మానవహారం చేపట్టి నినాదాలు చేశారు. నింది తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మావిళ్ల ఆనంద్, మదన్ యాదవ్ పాల్గొన్నారు.



సంగం: నిరసన ర్యాలీలో పాల్గొన్న జనసేన నాయకులు, విద్యార్థులు

బీటీఏ సభ్యత్వ నమోదు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 20: బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నాయకులు మంగళవారం ఉదయగిరిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు పలు పాఠశాలల ఉపాధ్యాయులను కలిసి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై బీటీఏ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు మణి, సుబ్బు, రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, కార్యదర్శి కృష్ణప్రసాద్, ఖాజారంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్‌ను అడ్డుకున్న ఫ్యాప్టో నాయకులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 20: స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవోలు మస్తాన్‌వలి, శ్రీనివాసులు మంగళవారం చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటు కౌన్సెలింగ్‌ను ఫ్యాప్టో నాయకులు అడ్డుకున్నారు. అనంతరం సమస్యలపై ఎంఈవోలకు వినతిపత్రం అందజేశారు. చంద్రశేఖర్‌రెడ్డి, షేక్‌ఎండీ ఖాజా, ఫణిరాజు, షబ్బీర్, బలరాం పాల్గొన్నారు.

పార్థీనియంపై అవగాహన

ఉదయగిరి రూరల్, ఆగస్టు 20: పార్థీనియం వారోత్సవాల్లో భాగంగా స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలోని మొదటి సంవత్సర విద్యార్థులకు మంగళవారం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కృష్ణారెడ్డి అవగాహన కల్పించారు. పార్థీనియం అనేది విషపూరిత, హానికరమైన మొక్కన్నారు. ఈ కలు పు మొక్క జీవవైవిధ్యం, వ్యవసాయ ఉత్పాదక నష్టాన్ని తగ్గించడంతో పాటు చర్మ అలర్జీ, గ వత జ్వరం, మానవుడు, జంతువుల్లో శ్వాస సమస్యలకు కారణవుతుందన్నారు. కార్య క్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి రమేష్, ప్రొఫెసర్ నారాయణస్వామి, సునీత పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

వరికుంటపాడు, ఆగస్టు 20: మండలంలోని పశువులకు సెప్టెంబరు 18వ తేదీ వరకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు పెద్దిరెడ్డిపల్లి పశువైద్యాధికారి ఎస్‌వీ రాఘవేంద్రశర్మ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా అన్ని పంచాయతీల్లో వ్యాధి లక్షణాలు, సంభవించే నష్టాలపై అవగాహన కల్పిస్తామన్నారు. నాలుగు నెలలు దాటిన పశువులను గుర్తించి టీకాలు వేయనున్నట్లు చెప్పారు. పాడిరైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దోమల నివారణపై అవగాహన ర్యాలీ



ఉదయగిరిలో వైద్యఆరోగ్య సిబ్బంది ర్యాలీ

ఉదయగిరి రూరల్, ఆగస్టు 20: ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది మంగళవారం ఉదయగిరి పట్టణంలో అవగాహన ర్యాలీ చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. వైద్యాధికారిణి శివకల్పన నోబెల్ పు రస్కార గ్రహీత సర్ రొనాల్డ్‌రాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దోమకాటుకు గురికాకుండా జాగ్ర త్తలు తీసు కోవాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, సీహెచ్‌వో శివకుమారి, ఆరోగ్య పర్యవేక్షకులు భోగ్యం వెంకటేశ్వర్లు, చెన్నయ్య, అంకమ్మ పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 20: కృష్ణంపల్లిలో సీతారామచంద్ర ఆలయంలో ఐదు రోజులు నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు మంగళవా రంతో ముగిశాయి. చివరిరోజు గ్రామ పురవీధుల్లో స్వామివారి గ్రామోత్సవం వైభవంగా చేపట్టారు. అనంతరం ఉట్టి మహోత్సవం, వసంతోత్సవం, పారువేట కార్యక్రమాలు చేపట్టారు. కేరళ బృందంతో నిర్వహించిన డప్పు వాయిద్యాలు భక్తులను అలరించాయి. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం

వరికుంటపాడు, ఆగస్టు 20: అంతంతమాత్రంగా విధులు నిర్వహిస్తున్నారన్న విమర్శలను నిజం చేసి చూపిస్తున్నారు సొసైటీ కార్యాలయ ఉద్యోగులు. స్థానిక కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఎప్పుడు వస్తారో, ఎప్పుడు పోతారో తెలియని అయోమయ పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అక్కడి అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమే గోదాం అద్దెకు ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఆ ఫ్లెక్సీలో అప్పటి చైర్మన్ పేరు, ఫోన్ నంబర్లు నేటికీ అలాగే దర్శనమిస్తుండటం విశేషం.

స్థానిక నేతకు అభినందనలు

సంగం, ఆగస్టు 20: జనసేన పార్టీ తరుపున అత్యధిక క్రియాశీలక సభ్యత్వాలు చేయించిన స్థానిక నేత దాడి భాను కిరణ్‌ను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్ మంగళవారం అభినందించారు. భాను కిరణ్ అత్యధికంగా 316 క్రియాశీలక సభ్యత్వాలు చేయించారన్నారు. ఆయన్ను శాలువాతో సత్కరించి పార్టీ తరుపున సర్టిఫికెట్ అందజేశారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

రాయపేట రోడ్డుకు మోక్షమెప్పుడో..!?

- వాహన రాకపోకలకు తప్పని తిప్పలు
- దూరం పెరిగినా చుట్టూ తిరిగి ప్రయాణిస్తున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



అధ్వానంగా ఉన్న రాయపేట రోడ్డు

అల్లూరు, ఆగస్టు 20 : మండలంలోని రాజుపాళెం-ఇస్కపల్లి (ఆర్‌ఐ) రోడ్డు నుంచి రాయపేట వరకు ఉండే రోడ్డు దుస్థితిలో ఉండడంతో ఆ గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతోన్నారు. ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారడంతో దీనికి ఎప్పుడు మోక్షం లభిస్తోందోనని ఆశగా ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వంలో నాయకులు, పాలకులు రోడ్డు నిర్మాణం చేయిస్తామని మాయమాటలు చెప్పి కాలయాపన చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక తమ రోడ్డుకు మోక్షం కలుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 3 కి.మీ దూరం ఉండే ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో ఇటు వైపు ప్రయాణాలు మానుకున్న ప్రజలు ఉడ్‌హౌస్ పేట మీదుగా వెళ్తున్నారు. దూరమైనప్పటికీ తప్పని పరిస్థితుల్లో ఈ రోడ్డులోనే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో రాయపేట, ఆర్‌ఐ రోడ్డు పక్కల ఉన్న చిల్లచెట్లు ఏపుగా పెరిగిపోయి రోడ్డును మూసేస్తున్నాయి. ఇకనైనా నాయకులు, అధికారులు ఈ రోడ్డును నిర్మించాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

దసరా ఉత్సవాల గోడపత్రికల ఆవిష్కరణ



పోస్టరును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, కమిటీ సభ్యులు

కావలి, ఆగస్టు 20: పట్టణంలోని 30వ వార్డులో వెలసి ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో అక్టోబర్‌లో జరిగే దసరా ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం కావలి ఎమ్మెల్యే డీవీ క్రిష్టారెడ్డి ఆలయ కమిటీ సభ్యులతో కలిసి తమ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం దేవస్థాన కమిటీ సభ్యులు మాట్లాడుతూ అక్టోబరు 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు 10 రోజుల పాటు ఆలయంలో దసరా ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజు ప్రత్యేక అలంకారంలో అమ్మవారి దర్శనం ఉంటుందని, భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆమె కృపకు పాత్రులు కాగలరని కోరారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

కావలిటౌన్, ఆగస్టు 20: పట్టణంలోని మద్దూరుపాడులో ఉన్న డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సందీప్ కంటి పరీక్షలు నిర్వహించడంతోపాటు కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కువగా సెల్‌ఫోన్‌లో చదవడం అలవాటుగా మారిందని, సెల్‌ఫోన్‌లో మెటీరియల్ చదవడం కంటే పేపర్ రూపంలో మెటీరియన్ చదవడం మేలని సూచించారు. కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు మాట్లాడుతూ నేటి సమాజంలో కంటి సమస్యలు ఎక్కువయ్యాయని, విద్యార్థులు ప్రధానంగా కంటి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ రాంబాబు, పీఆర్‌వో వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు అభయాంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ

- సాయిపేటలో ప్రారంభమైన ఉత్సవాలు
- రేపు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి రాక



కొండాపురం : హోమ పూజలకు సిద్ధమైన యాగశాల

కొండాపురం, ఆగస్టు 20: మండలంలోని సాయిపేటలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠ జరగనుంది. దీనికి సంబంధించి మూడు రోజులపాటు జరిగే విగ్రహ ప్రతిష్ఠామహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు యాగశాలలో మహాగణపతి పూజ, దీక్షా కంకణధారణ, వరుణపూజ, తీర్థానయనమ్, అఖండ ప్రజ్వలన, ప్రధాన కలశ, కర్కరీ కలశ, వర్ధని కలశ, వరుణ కలశములస్థాపన, విగ్రహముల యాగశాల ప్రవేశం, వాస్తుమండల, యోగిని మండల, క్షేత్రపాలక మండల, నవగ్రహ మండల దేవతా ఆవాహన, గ్రామ దేవత ఆవాహన తదితర పూజలు జరిగాయి. అభయాంజనేయస్వామి, శిఖర కలశం, మహాగణాధిపతి విగ్రహాలను జలాధివాసాన్ని రుత్వికులు వేదమంత్రోశ్ఛరణల నడుమ నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు పంచామృతం, తీర్థప్రసాదం అందచేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ పూజా కార్యక్రమాలను నిర్వాహకుడు ఎమ్.సుబ్బరావు పర్యవేక్షించారు.

సాయిపేటలో గురువారం జరగనున్న అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొంటారని గ్రామ మాజీ సర్పంచు, టీడీపీ సీనియర్ నాయకుడు గంటా లక్ష్మీనరసింహులు తెలిపారు.

సుందరగిరివారికండ్రికలో...

చిట్రగుంట : బోగోలు మండలం సుందరగిరివారికండ్రికలో అభయ అంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ఉదయం బ్రహ్మశ్రీ ఈపూరు గోవిందరాజు ఆచారి బృందంచే గణపతి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సుదర్శన హోమం, తామర పూవ్వులతో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. జలాధివాసంలో ఉన్న అభయ ఆంజనేయస్వామి, శంఖు చక్ర నామాలును భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.



చిట్రగుంట : సుందరగిరి కండ్రికలో గణపతి పూజలు

దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



రాజీవ్ గాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

కావలిటౌన్, ఆగస్టు 20: దేశాభివృద్ధి దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ పుణ్యమేనని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి లేళ్లపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ట్రంకురోడ్డులోని రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సీనియర్ కార్యకర్తలకు తినిపించారు. ఈ సంద్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో గాంధీ కుటుం బం త్యాగాలను జాతి మరవదని, పంచాయితీల అభివృద్ధి, పరిశ్రమల స్థాపన, ఐటీ తదితర అభివృద్ధి పనులు చేసిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా బీసీ సెల్ కన్వీనర్ కమలాపురి శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు నరేంద్ర చౌదరి, నాయకులు కంచి వెంకటేశ్వర్లు, వెంకటరమణయ్య, జరీఫ్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

30 వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యుడు

లింగసముద్రం, ఆగస్టు 20 : మండలంలోని పశువులకు మంగళవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తామని వీఆర్ కోట పశు వైద్యాధికారి వై శ్రీకాంత్ చెప్పారు. మొదటి రోజు మండలంలోని విశ్వనాథపురంలో ఆయన పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పశువులకు ఉచితంగా వేస్తున్న ఈ టీకాలను పశుపోషకులు తమ పశువులకు వేయించుకోవాలన్నారు. ఈ వ్యాధి సోకితే పాల దిగుబడి తగ్గి, ఆ పాలు తాగిన దూడలు మరణించే అవకాశం ఉందని తెలిపారు. అలాగే చూడి గేదెలు ఈసుకు పోతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎస్ఏ సీహెచ్ మహేంద్ర, పశు సంవర్ధక సహాయకులు జె.ప్రవీణ్, చౌదయ్య, శ్రీను, రైతులు పాల్గొన్నారు.

కందుకూరు : మండలంలోని కోవూరు పశువైద్య కేంద్రంలో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని సర్పంచు ఆవుల మాధవరావు మంగళవారం ప్రారంభించారు. పశువైద్యాధికారి డాక్టరు సుధాకర్ గేదెలు, దున్నలతో పాటు ఆవులు, ఎద్దులకు టీకాలు వేశారు.

మండుతున్న ఎండలు.. ఎండుతున్న బావులు..!



కడనూతల బావిలో అడుగంటిన నీరు

చిట్రగుంట, ఆగస్టు 20: బోగోలు మండలంలో ఎండలు మండిపోతున్నాయి. దీంతో బావులు, చెరువులో నీరు అడుగంగి ఎండుతోన్నాయి. వారం రోజులుగా ఎండలు వేసవి కాలాన్ని తలపిసుండడంతో ప్రజలు తాగునీటికి, ఇంటి నుంచి బయటకు రావడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అల్లిమడుగు పంచాయతీ కడనూతల గ్రామ చెరువు పూర్తిగా ఎండిపోయింది. గ్రామ బావుల్లో నీరు అడుగంటిపోయింది. ఫలితంగా తాగునీటి సమస్య క్రమంగా పెరుగుతోంది. గ్రామానికి పంచాయతీ నీరు రెండు రోజులకు ఒక్కసారి అరకొరగా వదులు తున్నారని స్థానికులు అంటున్నారు. చెరువు పూర్తిగా ఎండిపోవడం వలన మూగజీవులు తాగేందుకు నీరు లేక అలమటిస్తున్నాయి. అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం

అల్లూరు, ఆగస్టు 20 : మినర్వా గ్రాండ్ హోటల్స్, విజయ హిల్స్ అధినేత, రామకృష్ణ విద్యాసంస్థల అభివృద్ధి కమిటీ సభ్యుడు అల్లంపాటి లోకేశ్వరరెడ్డి జన్మదినం సందర్భంగా మంగళవారం అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం నార్తుఆములూరులోని చైల్డ్ ఆశ్రమంలో బాలలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అయూబ్, సుభాష్, పవన్, కళ్యాణ్, సునీల్, కోటి, మదన్, రాజేష్, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ చెట్టు వద్ద ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ

అల్లూరు, ఆగస్టు 20 : అల్లూరు బీసీ కాలనీలో వెలసిఉన్న పోలేరమ్మ చెట్టు వద్ద మంగళవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు ప్రతిఏటా నిర్వహించేలా గంగపెట్టె, వీరతాళ్లతో అమ్మవారికి ప్రత్యేక సేవా కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పొంగళ్ల నైవేద్యం సమర్పించిన అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. తప్పెట్లు, ప్రత్యేక అలంకారంతో అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టరు పట్టివేత



పోలీసుల అదుపులో ఉన్న ట్రాక్టరు

కొండాపురం, ఆగస్టు 20: అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టరును కొండాపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై మహేంద్ర తెలిపిన వివరాల మేరకు.. మర్రిగుంటలో మట్టి తరలిస్తున్నారని ఫిర్యాదు రావడంతో పోలీసులు దాడి చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న ట్రాక్టరును పట్టుకుని స్టేషన్‌కు తరలించారు.

కాంట్రాక్టు కార్మికులకు జీతాలు చెల్లించాలి

కందుకూరు, ఆగస్టు 20: మున్సిపాలిటీలో పనిచేసున్న కాంట్రాక్టు కార్మికులకు జీతాలు చెల్లించాలని సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. 1వ తేదీన చెల్లించాల్సిన జీతాలను 20వ తేదీ వచ్చినా చెల్లించకపోవటంతో కార్మికుల కుటుంబాలు నానా అవస్థలు పడుతున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు సీఐటీయూ నాయకులు ఎస్‌ఏ గౌస్, ఎం.ప్రసాద్, డీఎం రాయుడు తదితరులు కమిషనర్‌కు విజ్ఞప్తిచేయగా తక్షణ చర్యలు చేపట్టి జీతాలు వారి ఖాతాలకు జమచేయిస్తానని హామీ ఇచ్చారు.